www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

12 ప్రకాశం

సోమవారం 21 ఆగస్టు, 2017

## సన్మానం



బీవీ మోహన్ రెడ్డిని సన్మానిస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, గ్రామస్థులు

పద్మశ్రీ అవార్డు గ్రహీత, సైయెంట్ వ్యవస్థాపకుడు, కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బి.వి. మోహన్‌రెడ్డికి ఆదివారం ఆయన స్వగ్రామమైన మోక్షగుండంలో ఘన సన్మానం జరిగింది. అవార్డు తీసుకున్న అనంతరం తొలిసారి గ్రామానికి వచ్చిన ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు.

వివరాలు 12లో

# దర్శి సబ్‌ట్రెజరీలో నిధుల గోల్‌మాల్




- కుకింగ్ ఏజెన్సీల పేరుతో రూ. 30 లక్షల స్వాహా
- బినామీ పేర్లతో బ్యాంకు అకౌంట్లు
- నకిలీ రికార్డులతో బిల్లులు
- తవ్వేకొద్దీ బయటపడుతున్న అక్రమాలు
- డీడీవో నిధులూ మేత
- ముగ్గురు ఉద్యోగులది ప్రధాన పాత్ర

**ఒంగోలు కలెక్టరేట్ :** దర్శి సబ్ ట్రెజరీ కార్యాలయం అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారింది. మధ్యాహ్న భోజన పథకం పేరుతో కొందరు ఉద్యోగులు భారీగా నిధులు స్వాహా చేశారు. బినామీ పేర్లతో బ్యాంకు అకౌంట్లు తెరచి వాటి ద్వారా సుమారు రూ. 30 లక్షల ప్రభుత్వ ధనాన్ని మింగేశారు. ఎస్‌టీవో పరిధిలో దర్శి, కురిచేడు, తాళ్లూరు, దొనకొండ, ముండ్లమూరు మండలాలు ఉన్నాయి. దొనకొండ మండల పరిధిలో కుకింగ్ నిర్వహిస్తున్నట్లుగా రికార్డులు సృష్టించి నిధుల స్వాహాకు పాల్పడ్డారు. ఈ అక్రమాలకు 2012 నవంబరు నుంచి బీజం పడినట్లు తెలుస్తోంది. దర్శికి చెందిన ఓ మహిళ చేత సంతకాలు

మిగతా 11వ పేజీలో...



దర్శిలోని సబ్ ట్రెజరీ కార్యాలయం

## ఈవారంలో మూడు రోజులే బ్యాంకులు

- రేపు దేశవ్యాప్తంగా ఉద్యోగుల సమ్మె
- 25 నుంచి వరుసగా మూడురోజుల సెలవులు
- నగదు కోసం ఇబ్బందులు పడే అవకాశం

11 లో



## మంచం పట్టిన వల్లాపల్లి

విజృంభించిన విష జ్వరాలు

12 లో



సహస్ర జల ఘటాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

## ముగిసిన వరుణయాగం

వర్షాలు సమృద్ధిగా కురవాలని, కరువు నుంచి గట్టెక్కించాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం సమీపంలోని చెరువులో మూడు రోజులుగా చేస్తున్న వరుణ యాగం ఆదివారంతో ముగిసింది. మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో రాగా పొంగళ్లు పెట్టి చెన్న కేశవునికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా సహస్ర జల ఘటాభిషేకం నిర్వహించారు. సర్వమత ప్రార్థనలు చేశారు.

వివరాలు 12 లో..

## మీనమేషాలు

- అధికోత్పత్తి కొనుగోళ్లపై స్పష్టత లేని పొగాకు బోర్డు
- రైతుల్లో అయోమయం
- నాణ్యత తగ్గి నష్టపోతామని ఆందోళన
- సమీపిస్తున్న వచ్చే సీజన్ సాగు పరిమితి గడువు
- 23న హైదరాబాద్‌లో బోర్డు సమావేశం
- సిద్ధమవుతున్న రైతు ప్రతినిధులు

11 లో





# శతాబ్దాల పుణ్యతిథి సోమవతి అమావాస్య



**-అత్యంత అరుదుగా వచ్చే రోజు నేటి సోమవారం**

**-అమావాస్య, సూర్యగ్రహణం ఒకేరోజు రావడం మహాద్భుతం**

**ఒంగోలు కల్చరల్ :** చాంద్రమానం ప్రకారం కొన్ని పండుగలు, ముఖ్యమైన రోజులు, తిథులు అత్యంత అరుదుగా వస్తుంటాయి. ఇలాంటివి రావడానికి కొన్ని వందల ఏళ్లు పడుతుంటాయి. అంతటి అరుదైన తిథి 'సోమవతి అమావాస్య' నేటి సోమవారం రానుంది. సహజంగా సోమవారం, అమావాస్య కలిసి రావటం అరుదు. అందునా శ్రావణ సోమవారంతో కూడిన అమావాస్య రావడమంటే అత్యంత అరుదు. ఎన్నో ఏళ్ల తర్వాత కానీ ఈ శుభదినం రాదు. అలా సోమవారంతో కూడి వచ్చే అమావాస్యనే 'సోమవతి అమావాస్య' అని పిలుస్తారు. నేడు వస్తున్న సోమవతి అమావాస్యకు మరో ప్రత్యేకత కూడా ఉంది. ఇదే రోజున సూర్యగ్రహణం కూడా సంభవిస్తుంది. సోమవతి అమావాస్య అనేది చంద్రుడికి సంబంధించి నదయితే, ఇదే రోజు సూర్యగ్రహణం కూడా సంభవిస్తుండటంతో ఈ రోజు అటు సూర్యుడు, ఇటు చంద్రుడు కూడా అత్యంతప్రభావవంతంగా ఉండే రోజు.

## సోమవతి అమావాస్య ఆవిర్భావమిలా...

పురాణాల ప్రకారం దక్షప్రజాపతికి 28మంది కుమార్తెలు. వారిలో అశ్వని, భరణి తదితర 27మంది కుమార్తెలను ఆయన చంద్రుడికిచ్చి వివాహం చేశారు. వారి పేర్లే మనం పలికే నక్షత్రాల పేర్లు. ఇక 28వ కుమార్తె అయిన సతీదేవిని పరమశివుడు వివాహం చేసుకున్నాడు. దక్షుడు, నేడు ద్రాక్షారామంగా పిలుస్తున్న దక్షారామంలో యాగం చేయాలని సంకల్పిస్తారు. ఆ యాగ నిర్వహణ బాధ్యత అంతా పెద్ద అల్లుడైన చంద్రుడికి అప్పగిస్తారు. చంద్రుడు ఆ యాగానికి శివుడిని ఆహ్వానించకుండానే నిరీశ్వరయాగం చేస్తాడు. శివుడు ఆగ్రహించి తన జటాజూటాన్ని విసిరితే ఉదయించిన వీరభద్రుడు దక్షుడి యాగాన్ని భగ్నం చేస్తాడు. అపుడు వీరభద్రాదులు చంద్రుడిని శిక్షిస్తే వికృతరూపం, అనారోగ్యం పొందుతాడు. దీంతో చంద్రుడు పరమశివుడిని శరణు కోరతాడు. అందుకు శివుడు ఏ రోజైతే సోమవారం అమావాస్య కలిసి వస్తాయో ఆ రోజున రాహుకాలంలో తనను అభిషేకిస్తే సకలబాధలు తీరతాయని చంద్రునికి వరమిస్తారు. ఆయన అలాగే చేస్తాడు. సోముడు అంటే చంద్రుడు. సోముడు శివుడిని అభిషేకించి తరించిన అమావాస్య కనుక దీనిని సోమవతి అమావాస్య అంటారని శివపురాణం పేర్కొంటోంది. అందువలన సోమవారం, అమావాస్య కలిసిన 'సోమవతీ అమావాస్య' రోజున రాహుకాలమైన ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య శివునికి అభిషేకం చేస్తే అనారోగ్య బాధలు తీరటమే కాకుండా అన్ని రకాల శుభాలు చేకూరతాయని పెద్దలు చెబుతారు.



**శివుని అభిషేకం ఇలా...**

సోమవతి అమావాస్య రోజున రాహుకాలంలో శివునికి పంచామృతాభిషేకం, జలాభిషేకం చేసిన తర్వాత మందారపూలు, తెల్లగన్నేరుపూలు, పారిజాతపూలతో అలంకరించటం శ్రేష్ఠం. అంతేకాకుండా ఈ రోజున శివునికి అభిషేకం చేసిన తర్వాత రావిచెట్టుకు ప్రదక్షిణం చేయాలని కూడా శివమహాపురాణం పేర్కొంటోంది. శివాయ విష్ణు రూపాయ శివరూపాయ విష్ణవే అని చెప్పినట్లుగా శివుని అభిషేకించిన తర్వాత విష్ణురూపమైన రావిచెట్టును పూజించి ప్రదక్షిణం చేస్తే శివకేశవుల అనుగ్రహం పూర్తిగా కలుగుతుందని చెబుతారు. సోమవారం రానున్న సోమవతి అమావాస్యకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

# పేదింటి వెలుగు.. జ్యోతయ్య..!

**అన్నం, దుస్తులు, సామగ్రి సేకరించు.. పంచు..**

**ఇదే జ్యోతయ్య దినచర్య**



**అద్దంకి డిపో ఆవరణలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న జ్యోతయ్య**

**అద్దంకి :** ప్రతి మనిషికి కూడు, గూడు, గుడ్డ తప్పనిసరి. ఈ మూడింట్లో గూడు లేకున్నా తాత్కాలికంగా ఎక్కడో చోటైనా తలదాచుకోవచ్చు... కానీ అన్నం, దుస్తులు అత్యంత అవసరం. తప్పనిసరి కూడా. అవి లేకుండా ఒక రోజు కూడా జీవించలేం. ఎందరో నిరుపేదలు కనీసం తినడానికి తిండిలేక, వేసుకోవడానికి సరైన దుస్తుల లేక ఇబ్బందులు పడుతుంటారు. అదే సమయంలో కొంతమంది సంపన్నులు శుభకార్యాల్లో బ్రహ్మాండమైన విందు భోజనాలు ఏర్పాటు చేసి ఆశించిన స్థాయిలో బంధువులు, మిత్రులు రాక మిగిలిపోతుంది. ఈ ఆహారాన్ని ఏమి చేయాలో తెలియక చెత్తదిబ్బల్లో పారపోస్తుంటారు. అలాగే ఎగువ మధ్య తరగతి నుంచి సంపన్నుల వరకు తాము వాడుకునే దుస్తులు చినిగిపోకముందే, వస్తువులు పాడుకాకముందే కొత్త వాటిని కొనుక్కొని పాత వాటిని పక్కన పడవేస్తారు. వాటిని ఏమి చేయాలో తెలియక ఇంట్లో అడ్డంగా ఉన్నాయంటూ ఎక్కడో ఓమూలన పడేస్తారు. కాలక్రమంలో అవి పాడైపోతుంటాయి. ఈ రెండు విషయాలను జ్యోతయ్య చాలాసార్లు గమనించారు.. అదే సమయంలో పేదల బతుకుల్లోని బాధలను గుర్తించారు. వీరికి ఓ పరిష్కారం చూపాలని రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి, రిటైర్డ్ ఎస్‌బీఐ సెక్యూర్టీ గార్డు పంతంగి జ్యోతయ్య నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఓ చక్కటి ఆలోచన వచ్చింది.

**జ్యోతయ్య...!**
**ఆ పేరులోని దివ్యమైన వెలుగు ఉంది...**
**ఆ వెలుగును పంచుతూ**
**పేదలకు నట్టింటి దీపం అయ్యాడు.**
**ఆకలి తీర్చేవాడయ్యాడు..!**
**మానాభిమానాలు**
**కాపాడేవాడయ్యాడు..!**
**అతనేం సంపన్నుడు కాదు..**
**కానీ సుసంపన్నమైన విశాల**
**హృదయం ఉంది...!**
**పువ్వుపుట్టగానే పరిమళిస్తుంది..**
**చిరుప్రాయంలోనే అతని**
**సేవాతత్పరతను తల్లిదండ్రులు**
**గుర్తించినట్లున్నారు.**
**అందుకేనేమో జ్యోతయ్య అని పేరు**
**పెట్టి సార్థకం చేశారు...!**

### చెక్కా రిక్షాపై తిరుగుతూ.. సేకరిస్తూ

రెండేళ్లుగా అద్దంకి పట్టణంలో ఎక్కడా చిన్నపాటి శుభకార్యాలు జరుగుతున్నా తెలుసుకొని విందు భోజనాలు ముగిశాక అక్కడకు వెళ్లి మిగిలిపోయిన ఆహార పదార్థాలను తనతో తెచ్చిన బకెట్లలోకి నింపుకుని చెక్క రిక్షాపై నేరుగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు నిరుపేదలు పడుకుని ఉండే ప్రాంతాలకు నెట్టుకొని వెళ్తాడు. అర్ధరాత్రి సమయమైనా సరే గాఢ నిద్రలో ఉన్నా వారిని లేపి తీసుకువచ్చిన ఆహార పదార్థాలను పెడుతుంటాడు. ఇటీవల పలువురు మధ్య తరగతి, సంపన్నుల కుటుంబాలలో నిరుపయోగంగా ఉన్న చీరలు, చొక్కాలు, ఫ్యాంట్‌లు తదితర దుస్తులను, వాడకుండా పక్కన పడవేసిన కంచాలు, గ్లాసులు, చెంబులు, స్టీలు సామగ్రిని ఇంటింటికీ తిరిగి సేకరించడం ప్రారంభించాడు. వాటిని నిరుపేదలకు పంపిణీ చేసేందుకు ఆర్టీసీ బస్టాండ్‌ను వేదికగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్‌లో చీరలు, చొక్కాలు, ఫ్యాంట్లను జ్యోతయ్య పంపిణీ చేస్తున్నాడని తెలుసుకొని పలువురు నిరుపేదలు తోపుడు బండి వద్ద బారులు తీరారు. మహిళలకు చీరలు, పురుషులకు చొక్కాలు, ఫ్యాంట్లు పంపిణీ చేసి నిరుపేదల ఆనందంలో జ్యోతయ్య పాలు పంచుకున్నాడు. జ్యోతయ్య చేస్తున్న కార్యక్రమాలను గమనిస్తున్న పలువురు ఆయనను అభినందిస్తున్నారు. జ్యోతయ్య సంపన్నుడు కాకపోయినా అంతకంటే మిన్నగా ధాతృత్వంగల వ్యక్తిగా పేదల మనస్సుల్లో స్థానం పొందాడు. అదే సమయంలో తమ వద్ద నిరుపయోగంగా ఉన్న వస్తువులు, దుస్తులు మరికొందరికి ఉపయోగపడే విధంగా ఉండటంతో వాటిని ఇచ్చే కుటుంబాలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



**జ్యోతయ్య**



కురిచేడు ప్రాథమిక వైద్యశాల

# వైద్యశాఖ నిర్లక్ష్యానికి పురిటి బిడ్డ బలి

**కాన్పు కష్టమయ్యాక 108లో వేరే వైద్యశాలకు బదిలీ**

**దారిలోనే మృతి చెందిన శిశువు**

**కన్నీరు మున్నీరవుతున్న తల్లిదండ్రులు**



మృతిచెందిన శిశువు

**కురిచేడు :** కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యంతో కాన్పుకు వచ్చిన నిండు గర్భిణి మృత శిశువుతో ఇంటికి వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. కురిచేడు మండలం పొట్లపాడు గ్రామానికి చెందిన శ్రీరామలక్ష్మికి నెలలు నిండాయి. మొదటి కాన్పు కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే చేయించుకున్నాననే నమ్మకంతో రెండో కాన్పు కోసం శనివారం ఉదయం 8 గంటల సమయంలో అక్కడికి వెళ్లింది. ఆశా కార్యకర్త రామకోటమ్మను కలిసి వైద్యశాలలో చేరింది. వైద్యాధికారి ప్రవీణ్ ఆమెను పరీక్షించి స్టాఫ్ నర్సుకు సూచనలిచ్చారు. ఆమె రిపోర్టులు పరిశీలించారు. సాయంత్రం 4 గంటల నుంచి కలెక్టరు వీడియో కాన్ఫరెన్స్ ఉందని డాక్టర్ ప్రవీణ్ దర్శి వెళ్ళారు. శనివారం రాత్రి 7 గంటల సమయంలో లక్ష్మికి నొప్పులు ప్రారంభమయ్యాయి. కాన్పు కష్టమైంది. వైద్యుడు లేకపోవడంతో స్టాఫ్ నర్సు అలివేలుబాయి కాన్పు చేయడానికి యత్నించింది. కనీసం ఏఎన్ఎంలు కూడా సహాయం లేకపోవడంతో కష్టమైన కాన్పు సమయలో ఏం చేయాలో అర్థంకాక వైద్యాధికారి ప్రవీణ్‌కు సమాచారం అందించారు. ఆయన సలహాతో 108లో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో కష్టతరమైన కాన్పయింది. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్ళగా అప్పటికే బిడ్డ మృతి చెందినదని అక్కడి వైద్యులు తెలిపారు. పురిటి బిడ్డ మృతి చెందాడని తెలియడంతో ఆ కన్నతల్లి కన్నీరు మున్నీరయింది. పేదలమని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్ళి పురుడు పోయలేక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తే ఇలా జరిగిందని లక్ష్మి తల్లి బోయలపాటి సుబ్బమ్మ వాపోయింది. మొత్తం 14 మంది వైద్యశాలలో ఉండాల్సి ఉండగా ఆదివారం ఒక్కరంటే ఒక్కరు కూడా పీహెచ్‌సీలో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

## వైద్యశాఖ నిర్లక్ష్యం...



శ్రీరామ లక్ష్మి

వైద్య శాఖ నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ మృతి చెందాడని లక్ష్మి ఆవేదన వ్యక్తం చేస్తున్నది. 'ఇద్దరు వైద్యాధికారులు ఉండగా ఒక్కరు కూడా వైద్యశాలలో లేకపోవడం ఏంటి? స్టాఫ్ నర్సుకు తోడుగా ఒక మహిళా స్వీపర్ సహాయకురాలిగా ఉంది. కాన్పు కష్టం అయితే దర్శి సీహెచ్‌సీ నుంచి అనుభవం ఉన్న వైద్యులను పిలిపించి కాన్పు చేయాలి. అలా కాకుండా సగం కాన్పు అయ్యాక నిర్దాక్షిణ్యంగా బయటికి పంపారు. పీహెచ్‌సీలో లేని కాన్పు చేసే పరికరాలు 108లో ఎలా ఉంటాయని ఊహించారు' అని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు - పలువురికి గాయాలు

**సంతమాగులూరు:** కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై మండ లంలోని పుట్టావారి పాలెం సమీపంలో ఆదివారం ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్నాయి. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. నర్సరావుపేట వైపు వెళ్తున్న లారి పుట్టావారిపాలెం సమీపంలో లారీ సడన్ బ్రేక్ వేయటంతో వెనుక వస్తున్న కారు సడన్‌గా బ్రేక్ వేయడం జరిగింది. దీంతో వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టింది.

# అవమాన భారంతో యువకుడి ఆత్మహత్య



మృతిచెందిన యర్రమోతు వేణు

**మేదరమెట్ల:** ఆడపిల్ల వెంట పడ్డాడని పట్టుకొని చెట్టుకు కట్టేసి కొట్టడంతో అవమానం భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం కొరిశపాడుకు చెందిన యర్రమోతు వేణు(18) ఉరేసుకున్నాడు. అద్దంకి సీఐ హైమారావు కథనం ప్రకారం.. ఈ నెల 16వ తేదీ తనను ఇద్దరు యువకులు కొద్దిరోజులుగా వెంటపడి వేధిస్తున్నారని మేదరమెట్లకు చెందిన సురేంద్ర కుమార్తె తన తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసింది. దాంతో శుక్రవారం వేణును వడ్లమూడి సురేంద్ర పట్టుకొని చెట్టుకు కట్టేసి కొట్టాడని వేణు తండ్రి సుబ్బారావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. చెట్టుకు కట్టేసి తీవ్రంగా కొట్టడంతో పాటు సిగరెట్లతో కాల్చారని తెలిపాడు. తాము వెళ్లి బతిమాలగా తమ కుమారుడిని వదిలిపెట్టాడని తెలిపారు. మూడు రోజులుగా అవమానంతో ఇంటి నుండి బయటకు రాని వేణు ఆదివారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఫిర్యాదు చేశారు. తమ కుమారుడు మరణానికి సురేంద్ర చెట్టుకు కట్టేసి కొట్టడమే కారణమని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దళిత సంఘం పరిరక్షణ రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు సంఘటనా స్థలానికి వచ్చి ఆర్డీవో శ్రీనివాసరావుతో, దర్శి డీఎస్పీ రాంబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. అద్దంకి సీఐ హైమారావు, ఎస్ఐ సుబ్బరాజు, కొరిశపాడు ఏఎస్ఐ హరిబాబు సంఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకికి తరలించారు. ఏఎస్ఐ హరిబాబు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వేణు తల్లి దండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించడం కాలనీ వాసులను కలచివేసింది.

# కొలుపు పేరిట మాతంగితో నృత్యాలు

● **వై.పాలెంలో అడ్డుకున్న పోలీసులు - కేసు నమోదు**

**ఎర్రగొండపాలెం రూరల్:** పాతకాలపు ఆచారాలు, సంప్రదాయాలు ఇంకా పల్లెలను వీడటం లేదు. ప్రభుత్వం మాతంగి, జోగిని వ్యవ స్థలపై నిషేదం పెట్టి నిలువరిస్తున్నా గ్రామాల్లో ఆచారాల పేరుతో వాటిని చాటుమాటుగా కొనసాగిస్తున్నారు. ఆదివారం ఎర్రగొండపాలెం పట్టణంలో ఒక సామాజిక వర్గానికి చెందిన కొందరు కొలుపు పేరుతో మాతంగిని తీసుకువచ్చి వారి ఆచారాలను నిర్వహించేందుకు కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకోసం పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానాన్ని ఎంపిక చేసుకుని సాయంత్రం నెల్లూరుజిల్లా నాయుడుపేట నుంచి తీసుకువచ్చిన మాతంగి మహిళతో నృత్యాలు చేయిస్తున్నారు. ఎల్లమ్మ దేవత జాతర పేరుతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఇక్కడకు వచ్చిన మాతంగి కల్లుతాగి అక్కడకు చేరినవారిపై ఊస్తూ ముందుకు కదులుతూ ఉంది. వారి సంప్రదాయ ప్రకారం నిర్వర్తించాల్సిన కార్యక్రమాలు ఇంకా ఉండగా ఈ విషయం పోలీసులకు చేరింది. పోలీసులు అక్కడకు చేరి కార్యక్రమాన్ని నిలిపివేసి మాతంగిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై కార్యక్రమ నిర్వాహకులు కొందరు సమాచారం ఎవరిచ్చారంటూ పోలీసులతో వాదోపవాదాలకు దిగి వారి వాహనాన్ని చుట్టుముట్టారు. నేతల సిఫారసుకోసం యత్నించారు. కానీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇటువంటి ఆచారాలు నిషేధం అంటూ పోలీసులు వారిపని వారు చేసుకుపోయారు. పలు పల్లెల్లో ఇప్పటికీ కొలుపుల సమయంలో చాటుమాటుగా ఇటువంటివి జరుపుతున్నారు. కొన్ని సమయాల్లో పోలీసులకు తెలిసి నా తమకు ఫిర్యాదు వస్తే చూద్దామంటూ మౌనందాల్చుతూ వారిసంప్రదాయంకదా అని సరిపెట్టుకుంటున్నారు. అన్నిటా మార్పు వస్తున్న ప్రస్తుత తరుణంలో ఇటువంటివి రూపు మారాల్సిన అవసరం ఉంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సుబ్బయ్య తెలిపారు.



మాతంగితో నృత్యాలు చేయిస్తున్న దృశ్యం



అడ్డుకుంటున్న పోలీసులు

# తనిఖీ పేరిట ఎక్సయిజ్ కానిస్టేబుల్ వీరంగం

● **ప్రైవేట్ వ్యక్తులతో కలసి వ్యాపారిపై దాడి**



బాధిత వ్యాపారి కాశీం

**గిద్దలూరు :** తనిఖీ పేరిట ఓ ఎక్సయిజ్ కానిస్టేబుల్ వీరంగం సృష్టించాడు. మిర్చి వ్యాపారి నంద్యాల కాశీం రైల్వేస్టేషన్‌లో ఉండగా మరో ఇద్దరితో కలిసి దాడి చేశాడు. ఈ సంఘటన శనివారం రాత్రి స్థానిక రైల్వేస్టేషన్‌లో జరిగింది. బాధితుడు రైల్వే పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం... పొదలకొండపల్లికి చెందిన కాశీం శనివారం రాత్రి అనంతపురం వెళ్లేందుకు గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో ఉండగా లగేజీ తనిఖీ చేయాలని, గంజాయి ఉంది అంటూ ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎం.సిహెచ్.వెంకటేశ్వర్లు, అతని వెంట ఉన్న ఇరువురు ప్రైవేట్ వ్యక్తులు రంగస్వామి, మురళి వేధించడం మొదలుపెట్టారు. బ్యాగ్‌లో మిర్చి కొనుగోలు డబ్బు ఉందని పేర్కొనగా వినకుండా ప్లాట్‌ఫారంపై దాడిచేసి కొట్టారు. దాంతో ఆ వ్యాపారి వెంటనే సెల్‌లో అతని ఫోటోలు తీసి స్టేషన్ ఆవరణలోని ఆర్పీఎఫ్ స్టేషన్‌లో, పెట్రోలింగ్ చేస్తున్న సివిల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. రైల్వేస్టేషన్‌లో సంఘటన జరిగింది కావున రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సివిల్ పోలీసులు సూచించగా బాధితుడు ఆదివారం నంద్యాలవెళ్లి ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు డబ్బులు డిమాండ్ చేశాడని, ప్రైవేట్ వ్యక్తులను వెంటపెట్టుకొని భయాందోళనకు గురిచేశాడని, ముగ్గురూ మద్యం మత్తులో దాడిచేసి కొట్టారని కాశీం ఫిర్యాదులో పేర్కొన్నారు.

## బైక్, ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

**చీరాలటౌన్:** వేగంగా వెళుతున్న ఆటో - బైక్ ఢీకొన్న సంఘటన చీరాల బైపాస్ రహదారిలో కొత్తపేట వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. పాపాయిపాలెంకు చెందిన గవిని వెంకటేశ్వర్లు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తోన్న ఆటో ఢీకొనడంతో అతడు కింద పడిపోయి గాయపడ్డాడు. 108లో క్షతగాత్రుడ్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

## అమ్మనబ్రోలులో యువతి ఆత్మహత్య

**అమ్మనబ్రోలు(నాగులుప్పలపాడు):** చీరతో ఉరివేసుకొని యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన అమ్మనబ్రోలు గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు దుంపల రమ్యక్రిష్ణ(24) వివాహమై నాలుగేళ్లయింది. ఇద్దరు పిల్లలున్నారు. అత్తింటి నుంచి విడిపోయి వేరే కాపురం పెట్టాలని భర్తతో తన పుట్టింటివారితో తెలియజేసింది. తన మాటను ఇరుకుటుంబాలు అంగీకరించక పోవడంతో మనస్థాపానికి గురై శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరేసుకుంది. ఒంగోలు రూరల్ సిఐ యం. మురళీకృష్ణ, ఎస్సై అజయ్‌బాబులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఆదివారం పోస్టుమార్టంకు ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**చినగంజాం :** చినగంజాం - కడవకుదురు రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. చీరాల జీఆర్పీ ఎస్ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చినగంజాం - కడవకుదురు రైల్వేస్టేషన్ల మధ్య 322/18-22 కిలోమీటరు వద్ద డౌన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుని వయస్సు 40సంవత్సరాలు ఉంటుందని, 5.4 అంగుళాల ఎత్తు, ఛామనిఛాయరంగులో ఉన్నట్లు తెలిపారు. ఆకుపచ్చరంగు గడుల లుంగీ, బ్లూకలర్ చొక్కా ధరించినట్లు తెలిపారు. గుర్తు తెలియని రైలు నుండి పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గ్రామీణ ప్రాంతాలపై ఆర్టీసీ చిన్నచూపు

**కంభం :** గ్రామీణ ప్రాంతాలపై ఆర్టీసీ చిన్నచూపు చూస్తోంది. అందువల్లే గ్రామీణులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్ని గ్రామాలకు ఇప్పటికీ సరైన రహదారి లేకపోవడంతో ఆర్టీసీ బస్సులు నడపలేకపోతుంది. కొన్నిచోట్ల రోడ్డు బాగున్నా, బస్సులు నడపడం లేదు. శనివారం సాయంత్రం రావిపాడు నుంచి కంభం వస్తున్న ఆటో బోల్తా పడడంతో 10మంది గాయపడ్డారు. కందులాపురం, లింగోజిపల్లి, యల్.కోట, సైదాపురం, నడింపల్లి, ఔరంగబాద్ తదితర గ్రామాలకు బస్సులు నడవడం లేదు. గతంలో కొన్ని గ్రామాలకు తిరిగిన పల్లె వెలుగులు నిలిచిపోయాయి.



గిద్దలూరులో తపాలా ఉద్యోగుల ధర్నా

## కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

**గిద్దలూరు :** గ్రామీణ తపాల ఉద్యోగుల సమ్మె ఆదివారం నాటికి 5వ రోజుకు చేరుకున్నది. సబ్ పోస్టాఫీస్ ఎదుట వారంతా ధర్నా చేశారు. రైట్స్ ఇన్‌ఫర్మేషన్ యాక్ట్ గిద్దలూరు శాఖ అధ్యక్షులు కందూరి నాగేశ్వరరావు శిబిరానికి హాజరై వారికి సంఘీభావం ప్రకటించారు. గ్రామీణ డాక్ సేవక్స్‌ను సివిల్ సర్వెంట్స్‌గా గుర్తించాలని 1977లో సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వగా ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. దాంతో సరైన జీతభత్యాలు లేక హక్కులను కాపాడుకునేందుకు ఉద్యోగులు రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. ముండ్లపాడు పోస్టుమాస్టర్ గాదంశెట్టి శ్రీనివాసులు హాజరై ఉద్యోగుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పఠాన్ అబ్దుల్ ఆజాద్ ఖాన్, యూనియన్ నాయకులతో పాటు రాచర్ల, యడవల్లి, కొమరోలు,రాజుపాలెం తదితర పోస్టాఫీస్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ విగ్రహాలకు తగ్గిన గిరాకీ



విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

**కొమరోలు :** వినాయక విగ్రహాల తయారీదారులు నష్టాల ఊబిలో చిక్కుకున్నారు. మూడేళ్ల నుంచి కరువు పరిస్థితులు నెలకొనడంతో విగ్రహాలకు పెద్దగా డిమాండ్ లేకపోయింది. అందువల్లే ఈ పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. కొమరోలులోని చెక్ పోస్టు ఆవరణలో శిల్పులు రంగురంగుల వినాయక విగ్రహాలను తయారు చేశారు. పంటలు పండక అప్పులపాలైన రైతులు గణనాథుని విగ్రహాల కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. అంతేకాక ప్రస్తుతం విగ్రహాల తయారీ, ముడిసరుకు ధరలు భారీగా పెరగడంతో విగ్రహాల ధరలు కూడా పెరిగాయి. ఆశించిన స్థాయిలో కొనుగోలు జరగకపోవడంతో వ్యాపారులకు పాలుపోవడం లేదు. కరువు పరిస్థితుల వల్ల విగ్రహాల విక్రయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

## రేపు అవగాహన సదస్సు

**గిద్దలూరు :** గిద్దలూరు షాదీఖానా ఆవరణలో ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ముస్లిం మైనార్టీ సంక్షేమ సొసైటీ కన్వీనర్ షేక్ గుడిసె మహబూబ్ బాష ఒక ప్రకటనలో తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న లక్ష్మీ సుధ



డీడీకి వినతి పత్రం ఇస్తున్న ఎస్సీ హక్కుల సంఘం నేత

# కంభం ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై వేటు

### నిర్లక్ష్యంగా జవాబు ఇచ్చిన వంటమనిషిపై కూడా చర్యలు : డీడీ లక్ష్మీసుధ

**కంభం :** కంభం ఎస్సీ హాస్టల్‌లో విధులు సక్రమంగా నిర్వహించని వార్డెన్, వంట మనిషిపై వేటు తప్పదని జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీసుధ హెచ్చరించారు. హాస్టల్ బాలికలను వేధిస్తున్న సిబ్బందిపైన, అక్కడ చోటు చేసుకున్న అక్రమాలపై రాష్ట్ర ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘ అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మీ సుధ ఆదివారం హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో వార్డెన్ సుజాత కుమారి లేకపోవడంతో డీడీ ఆరా తీశారు. ఆమె ఒంగోలులో ఉంటారని వారంలో 2,3 రోజులు మాత్రమే వస్తారని చెప్పడంతో మండిపడ్డారు. తరువాత విద్యార్థులందర్నీ సమావేశపరచి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఏడాది నుంచి తమకు మెను ప్రకారం భోజనం పెట్టటం లేదని, చాలీ చాలని అన్నం, నీళ్ళ చారు పెడతారని ఆరోపించారు. అన్నమడిగితే వంటమనిషి బీబిజాన్ చేయి చేసుకుంటున్నారని వివరించారు. కాస్మోటిక్ చార్జీలు కూడా ఇవ్వడం లేదన్నారు. గతంలో పని చేసిన వార్డెన్ విమలమ్మ కూడా తమకు నరకం చూపించేదని వారు తెలిపారు. హాస్టల్‌లో వంట మనిషి పెత్తనం ఎక్కువయ్యిందని విద్యార్థినులు ఆరోపించారు. దీనిపై బీబిజాన్‌ను నిలదీయగా, నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో డీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటానని డీడీ హెచ్చరించారు. అనంతరం ఎస్సీ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు, కంభం ఎస్సీ హాస్టల్ తీరును, అర్ధవీడు మండలం భీమరాయుని చెరువు గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల వ్యవహారాన్ని డీడీకి వివరిస్తూ వినతి పత్రం అందజేశారు.

## హాస్టల్ పనితీరుపై ఆరా

**అర్ధవీడు(బేస్తవారపేట):** అర్ధవీడు గిరిజన వసతి గృహాన్ని ఆదివారం సాయంత్రం జిల్లా సాంఘిక సంక్షేమాధికారి లక్ష్మీసుధ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. సరైన భోజనం అందకపోతే నిర్భయంగా తెలియజేయాలని ఆమె విద్యార్థులకు సూచించారు. సదుపాయాలు సక్రమంగా లేవని ఆమె దృష్టికి విద్యార్థులు తీసుకెళ్ళారు. వెంటనే మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటానన్నారు.

## కంభం చెరువు పరిశీలన

**కంభం :** వినాయక విగ్రహాల నిమజ్జనానికి కంభం చెరువు అనువుగా ఉందా, లేదా అన్న దానిపై ఎస్ఐ రామానాయక్ ఆదివారం పరిశీలించారు. గత నాలుగు రోజుల కిందట "వినాయక నిమిజ్జనం కంభం చెరువులో సంబరంగా జరిగేనా" అని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఆయన స్పందించి చెరువు అలుగు వద్ద ఉన్న కొద్దిపాటి నీటిని పరిశీలించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో కంభం చెరువు చాలావరకూ ఎండిపోయింది. అయితే ఉన్న కొద్దిపాటు నీటిలో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల నుంచి వచ్చే వందలాది విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు అవకాశం ఉందా, లేదా అన్న దానిపై ఎస్ఐ ఆరా తీశారు. అందు కోసం వివరాలు సేకరించారు.



మోహన్‌రెడ్డికి స్వాగతం పలికిన పందిళ్లపల్లె గ్రామస్థులు

# పందిళ్లపల్లె స్కూళ్ల దత్తత

### సైయెంట్ కంపెనీ వ్యవస్థాపకునికి సర్పంచ్ మోహన్‌రెడ్డి వినతి

**బేస్తవారపేట :** పందిళ్లపల్లెలో ప్రాథమిక పాఠశాలను, హైస్కూల్‌ను దత్తత తీసుకోవాలని సైయెంట్ కంపెనీ వ్యవస్థాకుడు, ఎగ్జిక్యూటీవ్ చైర్మన్ బోధనపు వెంకట మోహన్‌రెడ్డిని గ్రామ సర్పంచ్ కర్నాటి మోహన్‌రెడ్డి కోరారు. మోక్షగుండం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్‌ను ఆదివారం ఆయన కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రైవేట్ స్కూళ్ల తాకిడిని తట్టుకోలేక పందిళ్ళపల్లె స్కూల్ ఎత్తివేతకు సిద్ధమవుతున్న సమయంలో గ్రామ పూర్వ విద్యార్థులు, యువకులు, గ్రామస్థులు రూ.50 లక్షలు అందజేశారనిచెప్పారు. పాఠశాలకు కార్పొరేట్ హంగులు సమకూరడంతో ఈ ఏడాది 120 మంది విద్యార్థులు పాఠశాలలో ఉన్నారని చెప్పారు. 5తరగతి గదులు నిర్మించి హైస్కూల్‌ను దత్తత తీసుకోవాలని గ్రామ సర్పంచ్ కర్నాటి మోహనరెడ్డి, యం.శ్రీనివాసుల రెడ్డి,బాలకృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు కోరారు. అనంతరం వారు మోహన్‌రెడ్డిని సన్మానించారు.

## ఇద్దరికి నవోదయ సీట్లు

**గిద్దలూరు :** కలుజువ్వలపాడు నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి తమ పాఠశాలకు చెందిన ఇద్దరికి సీట్లు లభించాయని స్థానిక విశ్వభారతి పాఠశాల డైరక్టర్ గోపవరం రంగస్వామిరెడ్డి, ప్రిన్సిపాల్ బండారు ఆదిలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత ఓపెన్ కేటగిరిలో తమ పాఠశాల విద్యార్థి పీవీ దినేష్ జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించగా, తాజాగా, పి.భవ్య, ఎన్.సాత్విక సీట్లు సంపాదించారని చెప్పారు.

## అంకితభావంతోనే గుర్తింపు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ నాయబ్ రసూల్ తదితరులు

**రాచర్ల :** అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని మండల వైస్ ఎంపీపీ షేక్ నాయబ్‌రసూల్ అన్నారు. గుడిమెట్ట ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యా యులు షేక్ మహమ్మద్ రఫి, షేక్ బెనెజీర్, సుధాకర్, గౌరీకోటేశ్వర్లు బదిలీ కావడంతో ఆదివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేడంవారిపల్లె ప్రధానోపాధ్యాయుడు మదిరె వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గుడిమెట్ట పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు నాణ్యత గల విద్యను అందించారనే పేరొందని చెప్పారు. బదిలీ ఉపాధ్యాయులు గుడిమెట్ట గ్రామప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కోటా శ్రీనివాసులు, మౌళాలి, ఉస్మాన్, నాగూర్, వెంకటేశ్వర్లు, కాశయ్య, పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సిలిండర్లు

**రాచర్ల :** మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రభుత్వం మంజూరు చేసిన సిలిండర్లను జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు ఆదివారం పంపిణీ చేశారు. 47 కుకింగ్ ఏజెన్సీలకు చెరో 2 సిలిండర్లను చొప్పున అందచేశారు. ఇక నుంచి వంటగ్యాస్ ఉపయోగించి భోజనాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కాశీశ్వరరావు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కాకర్ల ఈశ్వరరావు, ఉలాపు పిచ్చయ్య, టి.రమణారెడ్డి పాల్గొన్నారు.

## నిమజ్జనానికి నీళ్లు కరువు

**కొమరోలు :** వినాయక విగ్రహాల నిమజ్జనానికి నీటి సదుపాయలు లేకపోవడంతో వినాయక పందిళ్ల నిర్వాహకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ ఏడాది నిమజ్జనోత్సవాలు నిర్వహించేదెలా అని తలలు పట్టుకుంటున్నారు.వినాయక చవితి పర్వదినం సందర్భంగా మండపాల వద్ద ఏర్పాటు చేయనున్న గణపతి విగ్రహాలకు మూడు రోజులపాటు పూజలు అందిస్తారు. అయితే కొమరోలు మండలంపై వరుణుడు కరుణించకపోవడంతో వర్షాభావ పరిస్థితులు చెరువులు ఎండిపోయాయి.

## పేదలకు మరిన్ని సేవలు

**బేస్తవారపేట :** బేస్తవారపేట లయన్స్ క్లబ్ పేదలకు మరిన్ని సేవలు అందిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పిక్కిలి హుస్సేనయ్య చెప్పారు. ఆదివారం రాత్రి బేస్తవారపేట మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన 4వ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు.బేస్తవారపేట క్లబ్ ఆధ్వర్యంలో మారుమూల ప్రాంతంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం, దుప్పట్లు, దోమతెరలు, దుస్తులు పంపిణీ చేసినట్టు చెప్పారు. మరింత సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు వి.శరత్‌బాబు, కె.రమణారావు, తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

## వేగవంతంగా బోరు బావుల మూసివేత

■ ఇప్పటి వరకూ 158 పూడ్చివేత

■ సమాచారం కోసం ప్రత్యేక ఫోన్ నెంబర్‌లు

**ఒంగోలు కలెక్టరేట్ :** జిల్లావ్యాప్తంగా బోరు బావుల మూసివేత కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటి వరకూ అధికారులు గుర్తించిన 198లో 158 బావులను మూసి వేయించారు. మరో 40 పెండింగ్‌లో ఉన్నాయి. ఒంగోలు డివిజన్‌లో తవ్వి వదిలేసిన బోరుబావులు 83 ఉన్నట్లు గుర్తించగా అందులో 53 పూడ్చి వేయించారు. కందుకూరు డివిజన్‌లో 57 ఉండగా అన్నింటినీ బంద్ చేశారు. మార్కాపురం డివిజన్‌లో వదిలివేసినవి బోర్లు 58 ఉండగా 48 మూసి వేయించారు. ఎక్కడైనా పూడ్చివేయకుండా ఉన్న బోరు బావులు ఉన్నట్లు ప్రజలు గుర్తిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ ఎన్. ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఒంగోలు కలెక్టరేట్ 08592- 281400, ఒంగోలు ఆర్డీవో ఆఫీస్ 88866 16051, 88866 16044, కందుకూరు 88866 16055, మార్కాపురం 08596 222008 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇస్తే సత్వరమే ఆ బోరు బావులను మూసి వేయిస్తామని చెప్పారు.

# మైనింగ్‌లో భద్రతకు ప్రాధాన్యం

### వారోత్సవాల ముగింపు సభలో సౌత్ సెంట్రల్ జోన్ డీడీజె స్వప్నకుమార్

**ఒంగోలు క్రైం :** మైనింగ్‌లో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సౌత్‌సెంట్రల్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్వప్నకుమార్ దత్తు సూచించారు. మైనింగ్ 18వ భద్రత వారోత్సవాల ముగింపు సభ స్థానిక విష్ణుప్రియ కన్వెషన్ హాలులో ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమానికి మిడ్‌వెస్ట్ ఛైర్మన్ కె. రాఘవరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్వప్నకుమార్ దత్తు మాట్లాడుతూ మైనింగ్ క్వారీల్లో భద్రత ప్రమాణాలు పెంపొందించేందుకు క్వారీయజమానులు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్మికులు క్వారీయింగ్ చేసే సమయంలో భద్రతా నిబంధనలు పాటించాలని, నిత్యం భద్రత ప్రమాణాలపై పర్యవేక్షణ ఉండాలని ఆయన తెలిపారు. మైన్స్ ఒంగోలు అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో చీమకుర్తి, గురిజేపల్లిల్లో జరుగుతున్న మైనింగ్ క్వారీల్లో భద్రతా ప్రమాణాలు చాలా బాగున్నాయని తెలిపారు. జిల్లా నుంచి మైనింగ్ ద్వారా గత ఏడాది రూ. 217 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందని తెలిపారు. తొలుత 18వ మైన్స్ భద్రత సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన కార్మికులు, యజమాన్యాలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మైన్స్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ నీరజ్‌కుమార్, గెలాక్సీ గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.సుబ్బారెడ్డి, జనరల్ సెక్రటరీ అజీమ్, మిడ్‌వెస్ట్ జనరల్ మేనేజర్ డి.వి. అనిల్‌కుమార్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త శిద్దా వెంకటేశ్వరరావు, పి. లక్ష్మీనారాయణ, సుభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భద్రతా వారోత్సవాల ముగింపు సభలో సెంట్రల్ జోన్ డీడీజే స్వప్నకుమార్



మైన్స్ భద్రత సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

## తొలి ఇన్నింగ్స్‌లో గుంటూరుకు భారీ ఆధిక్యం

■ పోరాడుతున్న విజయనగరం జట్టు

**ఒంగోలు కార్పొరేషన్ :** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని శర్మా కళాశాల మైదానం వేదికగా గుంటూరు, విజయనగరం మధ్య జరుగుతున్న అండర్ -16 క్రికెట్ మ్యాచ్‌లో గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం సాధించింది. మూడు రోజుల మ్యాచ్‌లో రెండోరోజైన ఆదివారం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన గుంటూరు 79.2 ఓవర్‌లలో 161 పరుగులు చేసింది. షేక్ రషీద్ 59 పరుగులు, సాల్మన్‌జాయ్ 24 పరుగులతో రాణించారు. విజయనగరం బౌలర్ వి. వాసు 32 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టారు. దీపు భార్గవ్ మూడు వికెట్లు సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో విజయనగరం 50 పరుగులకు అలౌట్ అయిన విషయం విదితమే. దీంతో గుంటూరు జట్టుకు 111 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 53 పరుగులతో ఎదురీదుతోంది. గుంటూరు బౌలర్లు పి. అక్షయ్, పి. హరీష్ చెరో వికెట్ తీశారు.



59 పరుగులతో రాణించిన గుంటూరు బ్యాట్స్‌మెన్ రషీద్



ఆరు వికెట్లు తీసిన విజయనగరం బౌలర్ వాసు

## పాఠశాలలకు 3252 గ్యాస్ కనెక్షన్లు

**ఒంగోలు విద్య :** జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న 3252 పాఠశాలలకు ఇప్పటి వరకూ గ్యాస్ కనెక్షన్‌లు అందజేసినట్లు డీఈవో విజయభాస్కర్ తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలన్నింటినీ గ్యాస్ ఏజెన్సీలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. ఇందుకోసం ఇప్పటి వరకూ 1.25 కోట్లు ప్రధానోపాధ్యాయులు చెల్లించినట్లు చెప్పారు. వారికి ఆ డబ్బును ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందన్నారు. పాఠశాల గ్రాంటుతో పాటు ఈ మొత్తాలను కూడా ఎస్ఎంసీ ఖాతాలకు జమచేస్తుందని తెలిపారు. మిగిలిన పాఠశాలలకు సోమవారం సిలిండర్లు సరఫరా చేస్తారని చెప్పారు.

### నేడు కేంద్ర మంత్రి సుజనా చౌదరి రాక

**ఒంగోలు కలెక్టరేట్ :** కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి సుజనా చౌదరి సోమవారం ఒంగోలు రానున్నారు. ఆయన ఉదయం 8.30 గంటలకు విజయవాడలో బయల్దేరి 10.20కు ఒంగోలు చేరుకుంటారు. 10.30 గంటలకు స్థానిక ఏ-1 కన్వెన్షన్ హాలులో జరిగే సంకల్ప్-2022 చర్చా వేదికలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు గుంటూరు బయల్దేరి వెళ్తారు.

### పోలీసు కార్యాలయంలో నేటి గ్రీవెన్స్ రద్దు

**ఒంగోలు క్రైం :** జిల్లా ఎస్పీ కార్యాలయంలో వారంవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను ఈ సోమవారం రద్దు చేశారు. సోమవారం ఎస్పీ అందుబాటులో ఉండని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన కార్యాలయం అధికారులు ప్రకటించారు. ఎస్పీకి ఫిర్యాదులు చేసేందుకు, అర్జీలు ఇచ్చేందుకు ఎవ్వరూ ఒంగోలు రావద్దని వారు సూచించారు















## జంబ్లింగ్ వర్డ్స్

1. WLKA ▸ ......................
2. NGKI ▸ ......................
3. DMBU ▸ ......................
4. MEUT ▸ ......................

## జంతర్‌మంతర్

1. ద్భుఅతం ▸ ......................
2. తణంక్ష ▸ ......................
3. త్తిడిఒ ▸ ......................
4. సంవికా ▸ ......................

## చెప్పగలరా?

పాలులో ఉన్నా కానీ వేలులో లేను
యతిలో ఉన్నా కానీ గతిలో లేను
సందులో ఉన్నా కానీ విందులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

## సూక్తి

మనం ఉన్నతంగా ఎదగడానికీ, నష్టపోవడానికీ కారణం మన ఆలోచనలే.

# రోబోల రికార్డ్ బ్రేక్ డ్యాన్స్

**రోబో స్టెప్పు వేస్తే.. అదిరి పోతుంది కదూ! మరి ఒకేసారి వెయ్యికి పైగా రోబోలు కదం తొక్కితే.. డ్యాన్సులు చేసి అదరగొడితే అద్భుతం కదా! ఒకే సైజులోని రోబోలన్నీ కాలంలో ఒకే రీతిలో డ్యాన్స్ చేసి 'గిన్నిస్ పుటల్లో' స్థానం పొందాయి.**

సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి పరిచిన 1069 రోబోలు విభిన్నంగా డ్యాన్స్ చేసి చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రపంచ రికార్డును సాధించి గిన్నిస్ పుటలకెక్కాయి. డబ్ల్యు.ఎల్ ఇంటిలెజెంట్ టెక్నాలజీ కంపెనీ లిమిటెడ్ వీటిని రూపొందించింది. 'వన్ గ్రూప్ కంట్రోల్ సిస్టమ్' ప్రోగ్రామ్ ఆధారంగా ఇవి ఏకకాలంలో డ్యాన్స్ చేశాయి. చిందులతో కదం తొక్కిన ఆ రోబోల పేరు 'దోబి'. చైనాలో గతంలో జరిగిన బీర్ ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో 1007 రోబోలు బ్రేక్ డ్యాన్స్ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించాయి. ఆ రికార్డును 'దోబి' రోబోలు ప్రస్తుతం బద్దలుకొట్టాయి. ఈ దోబి రోబోల ఎత్తు - 47.3 సెంటిమీటర్లు. ఇవి పాటలు పాడటంతో పాటు, ఫుట్‌బాల్ కూడా ఆడతాయి. కుంగ్‌ఫూ కూడా చేయడం విశేషం. వీటి డ్యాన్సింగ్ వీడియోను యూట్యూబ్‌లో గంట వ్యవధిలోనే లక్షల మంది చూశారు.



**మీకు తెలుసా?**

షాంగై ఎక్స్‌పో పార్క్‌లో గత సంవత్సరం జరిగిన 'ఫ్రాన్స్ నేషనల్ పెవిలియన్ డే'లో సందర్శకులను అలరించేందుకు నిర్వాహకులు 20 రోబోలతో డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాదు వాటితో సాకర్ కూడా ఆడించారు.



### 'రోబో' స్టెప్పుల రికార్డు

ప్రభుదేవా డ్యాన్స్ మెరుపులు, చిరంజీవి స్టెప్పులు అందరికీ తెలుసు. మరి చిందులేసే రోబోలు తెలుసా? చైనా కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా 540 రోబోలు ఒకే వేదికపై డ్యాన్సులు చేసి అలరించాయి. అంతేకాదు ప్రపంచంలోనే అత్యధిక మంది వీక్షించిన టీవీ ప్రోగ్రామ్‌గా అది రికార్డులకెక్కింది. రోబోలు చిందేస్తుంటే 26 డ్రోన్లు ఆ నృత్యాన్ని వీడియో తీశాయి. చైనా సెంట్రల్ టెలివిజన్(సీసీటీవీ) ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేయగా 70 కోట్ల మంది వీక్షించటం విశేషం. ప్రపంచంలోనే అత్యధిక ప్రజలు చూసిన కార్యక్రమంగా రోబో డ్యాన్స్ నిలిచింది. సాహిత్యాన్ని, సంగీతాన్ని అనుసరించి కొరియోగ్రాఫర్లు డ్యాన్స్ కంపోజ్ చేస్తారు. అదే విధంగా రోబోలు సంగీతానికనుగుణంగా నృత్యం చేసేలా వీటిని రూపొందించారు. 'ప్రతి రోబోలో 16 స్టీరింగ్ ఇంజిన్లు ఉన్నాయి. మానవుడి తల, కాళ్లు, చేతులు ఏ విధంగా అయితే కదుపుతారో అదే విధంగా రోబోలు కదలడానికి వీలుగా ఈ స్టీరింగ్ ఇంజిన్స్ ఉపయోగపడతాయి.

### రోబోట్ డ్యాన్స్

రోబోలను ఇమిటేట్ చేస్తూ చేసే డ్యాన్సే 'రోబోట్ డ్యాన్స్'. మైఖేల్ జాక్సన్‌తో ఈ డ్యాన్స్ బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 'డ్యాన్సింగ్ మెషిన్' పాటలో - మైఖేల్, తన సోదరులతో కలిసి 'రోబోట్ డ్యాన్స్' చేశారు. 'బిల్లి జీన్' అనే పాటలో కూడా 'రోబోట్ డ్యాన్స్' చేసి అలరించాడు.


మెల్‌బోర్న్ యూనివర్సిటీలో 'రోబోగాల్స్' అనే బృందం, 318 మంది 'రోబోట్ డ్యాన్స్' చేసి వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు.

## ఔనా!



వాసన పసిగట్టే శక్తి శునకాల కన్నా, చీమలకే ఎక్కువ.

## బొమ్మ గీయండి



## దారి కనుక్కోండి



## రంగులు అద్దండి



## నవ్వుల్ నవ్వుల్

**అప్పారావు :** ఏరా! వెళ్లినప్పుడు నాలుగు గంటల్లో విజయవాడ వెళ్లావు కదా! వచ్చేటప్పుడు ఎనిమిది గంటలు పట్టిందేం?

**సుబ్బారావు :** కారు తయారు చేసిన వెధవ ఎవడో గానీ, ముందుకు వెళ్లడానికి నాలుగు గేర్లు ఇచ్చాడు. వెనక్కి రావడానికి రెండు గేర్లు మాత్రమే ఇచ్చాడు రా!

**అప్పారావు :** !!!!!!!!!

## టంగ్ ట్విస్టర్స్

1. Upper roller lower roller Upper roller lower roller. ..
2. Swan swam over the sea,
   Swim, swan, swim!
   Swan swam back again
   Well swum, swan!
3. I saw a saw that could out saw any other saw I ever saw.

## చుక్కలు కలపండి



## మీకు తెలుసా?



ప్రపంచంలో రెండు శాతం మందికి మాత్రమే ఆకుపచ్చ రంగు కళ్లు ఉంటాయి.

## జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ : 1. WALK 2. KING 3. DUMB 4. MUTE
జంతర్‌మంతర్ : 1. అద్భుతం 2. తక్షణం 3. ఒత్తిడి 4. వికాసం
చెప్పగలరా? : పాయసం

# మున్సిపాలిటీల్లో కంపుకంపు

● అస్తవ్యస్తంగా పారిశుధ్యం ● ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు ● పొంచివున్న అంటువ్యాధుల ముప్పు ● ముందస్తు చర్యలు పట్టని యంత్రాంగం ● వేధిస్తున్న పందులు, కుక్కలు, కోతల బెడద ● ఆందోళనలో ప్రజలు

## కందుకూరులో మురుగు కాలువలు అస్తవ్యస్థం



కందుకూరు పోస్టాఫీసు సెంటర్‌లో రోడ్డుపై పేరుకున్న చెత్త

**కందుకూరు :** కందుకూరు మున్సిపాలిటీలో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్త వ్యస్థంగా ఉంది. పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నగా మారింది. దీంతో అంటువ్యాధులు ప్రబలుతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధాన వీధులు చెత్తకుండీలుగా మారుతున్నాయి. చిన్నచిన్న టిఫిన్ బండ్ల నిర్వాహకులు వ్యర్థాలను రోడ్లపైనే కుప్పగా పోస్తుండగా పందులు, కుక్కలు వాటిలో పొర్లాడుతూ అపరిశుభ్రతను సృష్టిస్తున్నాయి. చెత్త వేసేందుకు పలుచోట్ల కుండీల ఏర్పాటు కూడా జరగకపోతుండటంతో రోడ్లపైనే చెత్త దర్శనమిస్తుంది. పట్టణంలో ప్రధాన డ్రైనేజిగా ఉన్న గాజులకాలువ పొడిగింపు పనులను అస్తవ్యస్థంగా చేయటంతో వర్షాల సమయంలో కాలువ పొంగి ఇళ్లలోకి మురుగునీరు వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కొద్దిపాటి వర్షాలకే ఈ కాలువ పొంగి కూరగాయల మార్కెట్ సెంటర్‌లో మురుగు రోడ్లపై ప్రవహించింది. దిగువనున్న తూర్పుపాలెం, అభ్యుదయ పాఠశాల ఏరియా తదితర ప్రదేశాల్లో ఇళ్లలోకి మోకాటిలోతున మురుగునీరు నిలిచిన దుస్థితి ఏర్పడింది. గాజుల కాలువ డ్రైనేజి పరిమాణాన్ని చివర్లో సగం చేసి నిర్మించటంతో ఈ పరిస్థితి తలెత్తింది. గాజుల కాలువను నేరుగా ఎర్రవాగులోకి పోయేలా నిర్మించాల్సిన అధికారులు ఆపని చేయకుండా రెండు వైపులకు తిప్పి వంకలు వంకలుగా నిర్మించటం ఇబ్బందిగా మారింది.

## అద్దంకిలో ముందుకు కదలని మురుగు

**అద్దంకి:** అద్దంకి పట్టణంలో పలు ప్రాంతాలలో మురుగునీరు ప్రవాహం లేక దుర్గంధం వెదజల్లుతోంది. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధానంగా అభ్యుదయనగర్, వాసవీ నగర్, రామ్ నగర్ ప్రాంతాల గుండా ప్రవహించే ఎన్ఎస్‌పీ అద్దంకి మేజర్ కాలువ నిరుపయోగంగా మారి మురుగునీటి నిల్వకు కేంద్రంగా మారింది. పందుల ఆవాసంగా ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. స్థానిక ఆంధ్రాబ్యాంక్ వెనుకబజారు, భవానీసెంటర్‌లోని దూదేకులపాలెం తదితర ప్రాంతాల్లో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు తప్పడం లేదు. కుక్కల బెడదతో పలు రోడ్లలో వెళ్లాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



అద్దంకి షాదీఖానా వద్ద బోరింగ్ పక్కనే ఉన్న చెత్త కుండీ

## కనిగిరిలో కోతులు.. కుక్కల బెడద





**కనిగిరి :** కనిగిరి నగర పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాలు తూతూమంత్రంగా జరుగుతున్నాయి. ఆరు నెలలుగా శానిటరీ ఇనిస్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఏటా పారిశుధ్యంపై సుమారుగా కోటి వర కు వెచ్చిస్తున్నట్లు చెప్తున్నా పారిశుధ్యం పరిస్థితి మాత్రం మెరుగుపడటం లేదు. శివనగర్‌కాలనీ, ఎన్జీవోకాలనీ, ఇందిరాకాలనీ, బీసీకాలనీ, కొత్తూరు, నక్కలతిప్ప, శంఖవరం, మాచవరం, కాశీపురం తదతర ప్రాంతాల్లోని వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంథం వెదజల్లుతోంది. ఇక శంఖవరం, చింతపాలెం, మాచవరం, కాశీపురం ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది అసలు కనిపించరు. బ్లీచింగ్, ఫెనాయిల్ ఏనాడు చల్లిన పాపాన పోలేదు. పందులు గుంపులుగుంపులుగా తిరుగుతున్నాయి. కనిగిరి పట్టణం, కొత్తపేటలో కోతుల బెడదతతో ప్రజలు బెంబేలు ఎత్తుతున్నారు. ఇటీవల కాశీనాయన ఆశ్రమ ప్రాంతంలో పది మంది పిల్లలు కుక్కగాటుకు గురయ్యారు. కొత్తూరు, కాశిరెడ్డినగర్‌లో కుక్కల భయం నెలకొంది.

## చీరాల పట్టణంలో పారిశుధ్యం అధ్వానం



చెరువును తలపిస్తున్న బలహీనవర్గాల కాలనీ

**చీరాల :** చీరాల మున్సిపల్ పరిధిలో పలు చోట్ల పారిశుధ్యం పడకేసింది. దీంతో ఆ యా ప్రాం తాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఒక్క రో జు చెత్త కుప్పలు తీయకున్నా దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధానంగా లోతట్టు కాలనీలు వారు ఇబ్బంది పడుతున్నారు. బలహీనవర్గాల కాలనీలో కొన్ని ప్రయివేటు స్థలాలలో నీరు చెరువును తలపిస్తూ నిల్వ ఉంటోంది. దీంతో దోమల బెడద పెరిగింది. కొన్ని చోట్ల చె త్తకుప్పలు అలానే దర్శనమిస్తున్నాయి. పందులకు, కుక్కలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అసలే మాగుడు రో జులు ఇలాంటి పరిస్థితులతో ఎప్పుడు ఏ రకమైన వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజ లు ఆందోళన చెందుతున్నారు. కోర్టు రోడ్డులో బాలాజీ ఫంక్షన్‌హాలు సమీపంలో కూడా చెత్తకుప్పలు, మురుగు సమస్య పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎల్‌బీఎస్ నగర్‌లోర కుందేరు పక్కనున్న వారు దోమకాటుతో అల్లాడుతున్నారు. పాలకులు,అధికారులు స్పందించిపారిశుధ్యం మెరుగు పరిచేలా చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు.



కనిగిరి ప్రధాన వీధిలో పేరుకున్నచెత్త

**ఆంధ్రజ్యోతి ఫోకస్**

జిల్లాలోని ఒంగోలు నగరంతో పాటు పలు మున్సిపాలిటీలు, నగరపంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంటోంది. ప్రస్తుతం కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు చెత్తాచెందారం కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. దీనికితోడు పందులు,కోతులు, కుక్కల బెడదతతో పట్టణవాసులు ఇబ్బందిపడుతున్నారు. సైడు కాలువలు అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. అధికార యంత్రాంగం మిన్నకుండడం విమర్శలకు తావిస్తోంది..

## ఒంగోలు నగరం మురికి కూపం

**ఒంగోలు-కార్పొరేషన్ :** ఒంగోలు నగరానికి డంపింగ్ యార్డు సమస్య తీరినా చెత్త సమస్య తీరడం లేదు. దీంతో మురికి కూపంగా మారింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. కచ్చా కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోగా, ప్రధాన కాలువల్లో మురుగు తొలగించే మార్గం లేకుండా ఇళ్ళముందు, దుకాణాల ముందు సిమెంటు కట్టడాలు నిర్మించడంతో నగరం కంపుకొడుతూ ప్రజలు ముక్కు మూసుకోకుండా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఖాళీ స్థలాల్లో మురుగు నిల్వ లేకుండా చేసేందుకు అధికారులు అండుగు ముందుకు వేయడం లేదు. ఫలితంగా కొద్దిపాటి వర్షాలు వచ్చినా వ్యాధుల బారిన పడుతున్నారు. దీనికితోడు దోమల దాడులు తీవ్రమయ్యాయి. నగరంలో పలు స్థలాలల్లో మురుగునీరు నిలిచి కంపుకొడుతుంది. అంతే కాకుండా ఎటువంటి వ్యాధులు రాకుండా నగరాన్ని సుందరంగా తీర్చి దిద్ది, బ్లీచింగ్, ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఆయిల్ బాల్స్ విడుదల, మురుగు చెరువుల్లో గంభూషియా చేపల విడుదల చేయకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మరోవైపు అధ్వానంగా ఉన్న వీధుల్లో పందుల సంచారం తీవ్రమైంది. నివాసాల మధ్య పందులు తిరగడం వల్ల మలేరియా, మెదడు వ్యాపు వ్యాధుల భయంతో నగర ప్రజానీకం ఆందోళన చెందుతోంది.



ఒంగోలులో రోడ్డుపై పేరుకున్న చెత్తాచెదారం



రోడ్డుపై పారుతున్న మురుగు

## మార్కాపురంలో పడకేసిన పారిశుధ్యం



చెరువుకట్ట సమీపంలో సంచరిస్తున్న పందులు

**మార్కాపురం:** మార్కాపురం పట్టణంలో ఎటు చూసిన పందులు, కోతులు, ఆవులు సంచరిస్తూనే ఉన్నాయి. ఏ వీధిలో చూసిన వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పందులు, కోతులు, ఆవుల సంచారం నివారించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకపోవటంతో ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. రోడ్లపై, కాలువల్లో చెత్త పేరుకుపోయింది. కాలువల్లో మురుగు నిలిచి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పందులు పట్టణ వాతావరణాన్ని మరింత కలుషితం చేస్తున్నాయి. శివారు కాలనీల్లో కొద్దిపాటి వర్షానికి మురుగు ఎ క్కడ పడితే అ క్కడ నిలబడి పోవటంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పట్టణంలో ప్రధాన రహదారులు, వీధుల్లో, మురుగుకాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారాలతో నిండి వర్షపు నీరు రోడ్లపై పారుతున్నాయి. కాలేజి రోడ్డులో మురుగు కాలువల నిర్మాణం సక్రమంగా లేకపోవటంతో ప్రధాన రహదారి పైకి మురుగు నీరు చేరుతోంది. పట్టణంలో పందులు వ్యర్థాలను తింటూ యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. కోతుల దాడులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.



పట్టణంలో పారుదల లేని మురుగు కాలువ

## గిద్దలూరులో పందులు, కుక్కల బెడద

**గిద్దలూరు :** గిద్దలూరు మున్సిపల్ ప్రజలు పందులు, కుక్కలు, కోతుల బెడదతో అల్లాడిపోతున్నారు. రోడ్లపై యథేశ్చగా తిరుగుతూ మురికినీటి కాలువల్లో, మురుగు గుంతల్లో పొర్లాడుతూ ప్రజలను ఇక్కట్లకు గురిచేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పట్టణ శివార్లలోని కొండపేటరోడ్డులో మున్సిపల్ డంపింగ్ యార్డ్‌కు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పట్టణంలో సుమారు 400కు పైగా వీధి కుక్కలు ఉండగా వీటిలో 30కి పైగా పిచ్చి కుక్కలు ఉన్నట్లు సమాచారం. ఎప్పుడు ఎవరిని కరుస్తాయో తెలియక చిన్నపిల్లలను, వృద్ధులను ఇళ్లకే పరిమితం చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. కుక్కలకు పునరుత్పత్తి ఇంజక్షన్లు(పుట్టకుండా) వేయించాల్సి ఉండగా మున్సిపల్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పందుల విషయానికి వస్తే పట్టణంలో 300 కు పైగా సంచరిస్తున్నాయి. అలాగే పలు వీధుల్లో, రైల్వేస్టేషన్‌లో కోతుల బెడద అధికంగా ఉంది. ఇళ్లలోకి వచ్చి అందిన వస్తువులను, ఆహారాన్ని తీసుకుని పరుగులు తీస్తూ ప్రజలను అష్టకష్టాలు పెడుతున్నాయి.



డంపింగ్ యార్డ్‌లో ఉన్న పందులు

# దినఫలాలు

## అదృష్టసంఖ్యలు : 2, 3




**మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20):** విద్యా విషయాల్లో ఆటంకాలు ఎదురవుతాయి. ప్రేమ బెడిసి కొట్టే అవకాశం ఉంది. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. పొదపు పథకాలు, పెట్టుబడుల విషయంలో ఆచితూచి ముందడుగు వేయండి.



**వృషభరాశి: (ఏప్రిల్21-మే20):** కుటుంబ వ్యవహారాలు మనస్తాపం కలిగిస్తాయి. బదిలీ ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. కార్యాలయంలో కొంత అసౌకర్యానికి గురవుతారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు.



**మిథునరాశి: (మే21-జూన్21):** విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాల్సి ఉంటుంది. వాహనాల కారణంగా అసౌకర్యానికి గురవుతాయి. రిప్రజెంటేటివ్‌లు, ఏజెంట్లకు శ్రమాధిక్యం. సమావేశాల్లో మాటపడాల్సి వస్తుంది.



**కర్కాటకరాశి: (జూన్22-జూలై23):** బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులకు అటంకాలు కలిగే అవకాశం ఉంది. డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు. రుణప్రయత్నాలు ఫలించకపోవచ్చు. ఖర్చులు అదుపులో పెట్టుకోవాలి.



**సింహరాశి: (జూలై24-ఆగస్ట్23):** మనసును ఏదో వెలితి బాధిస్తుంది. చేపట్టిన పనులకు ఆటంకాలు ఎదురువుతాయి. కొత్తగా చేపట్టే పనుల ప్రారంభాన్ని వాయిదా వేయండి. అన్ని విషయాల్లో శ్రమాధిక్యం తప్పకపోవచ్చు.



**కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23):** ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో అవాంతరాలు ఎదురవుతాయి. దీర్ఘకాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రహస్య సమాచారం అందుకుంటారు.



**తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23):** మ్యూచువల్ ఫండ్స్, బ్యాంక్ డిపాజిట్లు, పొదుపు పథకాల వ్యవహారాలకు అనుకూల సమయం కాదు. సన్నిహితుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. స్నేహానుబంధాలు బలపడతాయి.



**వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22):** ఉద్యోగ, వ్యాపారాల్లో అనుకోని చికాకులు ఎదురవుతాయి. పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ద చూపించాలి. గౌరవ, ప్రతిష్ఠలకు భంగం కలిగే అవకాశం ఉంది. సంకల్ప సాధనకు పట్టుదలతో కృషి చేస్తారు.



**ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21):** ప్రణాళిక లోపించడం వల్ల లక్ష్యాలు సాధించలేకపోతారు. న్యాయపరమైన వివాదాలకు ఆస్కారం ఉంది. సమావేశాలు, చర్చలు, వ్యూహారచనలకు అనుకూలం. విద్యార్థులకు శుభప్రదం.



**మకరరాశి(డిసెంబర్22-జనవరి21):** ఆస్పత్రులు, బ్యాంకులు, చిట్‌ఫండ్‌లు, మ్యూచ్యువల్ ఫండ్ రంగాల వారికి ఆర్థికంగా నిరుత్సాహకరం. గ్రాట్యుటీ, బీమా, పింఛన్ వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. బాధాకరమైన సమాచారం అందుకుంటారు.



**కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18):** ఆర్థిక విషయాల్లో భాగస్వామి వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వేడుకల్లో ఖర్చులు అంచనాలు మించుతాయి. స్పెక్యులేషన్లు, పెట్టుబడుల్లో నష్టాలు తప్పకపోవచ్చు. సమావేశాల్లో కీలకపాత్ర పోషిస్తారు.



**మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20):** వ్యవసాయం, పరిశ్రమలు, హోటల్ రంగాల వారు లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాలి. విందుల్లో పరిమితి పాటించాలి. ఇంటర్వ్యూలలో నిరాశ తప్పకపోవచ్చు. ఆస్పత్రులు సందర్శించాల్సి రావచ్చు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

# బదిలీ అయిన టీచర్ల జీతాల సమస్యకు పరిష్కారం

**ఒంగోలు విద్య :** జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులందరికీ సెప్టెంబరు 1న జీతాలు చెల్లించేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి.విజయ భాస్కర్ తెలిపారు. రేషనలైజేషన్‌లో ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేయబడిన ఉపాధ్యాయ పోస్టుల వివరాలతో తాజా క్యాడర్ స్ట్రెంగ్త్ వివరాలను సిద్ధం చేసినట్లు ఆయన చెప్పారు. తాజా కేడర్ స్ట్రెంగ్త్ మండలాలు , పాఠశాలల వారీగా జిల్లా ఖజానాధికారి కార్యాలయానికి సోమవారం సమర్పించనున్నట్లు డీఈవో తెలిపారు. ఈ వివరాలు డీటీవో కార్యాలయానికి అందితే వారు ఈ వివరా లను సంబంధిత ఉపఖజానా కార్యాలయాలకు పంపిస్తారు. దీంతో జిల్లాలోని అన్ని మండలాల్లో కొత్త పోస్టుల్లో చేరిన ఉపాధ్యాయులకు కూడా జీతాల చెల్లింపులో ఎటువంటి సమస్యలు రావని డీఈవో తెలిపారు.

### కొత్తపాఠశాలలోనే భాషా పండితులకు జీతాలు

పదోన్నతులు పొందిన భాషా పండితులు, రీకౌన్సిలింగ్‌లో కొత్త పాఠశాలలు కోరుకున్న భాషా పండితులకు ప్రస్తుతం వారు పనిచేస్తున్న పాఠశాలల్లోనే ఆగస్టు నెల జీతాలు చెల్లించాలని విజయభాస్కర్ స్పష్టం చేశారు.

పదోన్నతులు పొందిన భాషా పండితులు తాము పనిచేసిన పాత పాఠశాలలనుంచి ఎల్.పి.సి, ఎస్ఆర్‌లను తీసుకొని ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల ప్రధానో పాధ్యాయులకు అందజేయాలి. బదిలీ అయిన భాషా పండితులు కొత్త పాఠశాలలో తాము పనిచేసిన రోజులకు అక్కడి హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు/మండల విద్యాధికారి నుంచి డ్యూటీ సర్టిఫికెట్, జీతం నాన్‌డ్రాయల్ సర్టిఫికెట్ తీసుకొని ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందజేస్తే నెల మొత్తానికి ఆపాఠశాలలోనే జీతం డ్రా చేస్తారు. అదేవిధంగా రీకౌన్సిలింగ్‌లో కొత్త పాఠశాలలు కోరుకున్న భాషా పండితులు కూడా తాము పనిచేసిన పాత పాఠశాలలనుంచి ఎల్‌పిసి, ఎస్ఆర్ తీసుకొని రీకౌన్సిలింగ్‌కు ముందు పనిచేసిన పాఠశాల ప్రదానోపాధ్యాయుడు/ఎంఈవో నుంచి డ్యూటీ సర్టిఫికెట్, నాన్ డ్రాయల్ సర్టిఫికెట్ తీసుకొని ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాల హెచ్ఎంకు అందజేస్తే నెలమొత్తానికి ప్రస్తుత పాఠశాలనుంచే జీతం డ్రాచేస్తారని డీఈవో విజయభాస్కర్ తెలిపారు.

# యాదవులు ఐక్యంగా ముందుకు సాగాలి

● మాజీ మంత్రి

**డాక్టర్ పాలేటి రామారావు**



చీరాలలో బీసీ ఐక్యతా ర్యాలీ దృశ్యం

**చీరాల :** యాదవులు కలిసికట్టు గా ఐకమత్యంతో ముందుకు సాగితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని మాజీమంత్రి డాక్టర్ పాలేటి రామారావు అన్నారు. ఆదివారం పేరాల గోలిసదాశివ రావు కళ్యాణమండపంలో యాదవ జీవితచరిత్ర -దేశభక్తియుతవీరోచితచరిత్ర అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథులుగా హాజరైన మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ తిరుమలరావు, బాపట్ల మున్సిపల్‌ఛైర్‌పర్సన్ తోట మల్లేశ్వరి, ఎంపీపీ గవిని శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ చరిత్రపుటల్లో యాదవులకు ప్రత్యేకస్థానం ఉందన్నారు. చైతన్యవంతులుగా, పాలకులుగా సమయస్ఫూర్తి కలిగిన వ్యక్తులుగా చరిత్ర చెబుతోందన్నారు. అలాంటి అంశాలను స్ఫూర్తిగా తీసుకుని బీసీలందరూ ఐక్యంగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. చీరాల నియోజకవర్గంలో యాదవులు అత్యధికసంఖ్యలో ఉన్నారన్నారు. అందరిదీ ఒకే మాట, ఒకే బాట కావాలని అభిప్రాయపడ్డారు. సంఘటితంగా ముందుకు సాగితే అన్ని సమస్యలకు పరిష్కారం సుగమమం అవుతుందని పేర్కొన్నారు. ముందుగా ఎంపీపీ కార్యాలయం నుండి బీసీ ఐక్యత వర్థిల్లాలి అనే జెండాలను పట్టుకుని బీసీల ఐక్యత వర్థిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ గోలి సదాశివరావు కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గపరిధిలోని యాదవ ప్రముఖులు, సంఘీయులు హాజరయ్యారు.

# లక్ష ఆపరేషన్లు చేసిన వెంకయ్యకు ఘన సన్మానం

**ఒంగోలు కలెక్టరేట్ :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, అస్సాం రాష్ట్రాలలో ఫ్యామిలీ ప్లానింగ్, జనరల్ సర్జరీ (ఆపరేషన్లు), గైనిక్ సర్జరీలు గ్రామీణ, గిరిజనులకు సుమారు లక్ష ఆపరేషన్లు చేసిన డాక్టర్ మాదాసి వెంకయ్యను పలువురు వక్తలు కొనియాడారు. గుంటూరులోని జిమ్‌కానా ఆడిటోరియంలో ఆదివారం జరిగిన శస్త్ర చికిత్స నిపుణుల రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుబ్బారావు, రాష్ట్ర శస్త్ర చకిత్స నిపుణుల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ భాస్కరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ శ్రీనివాసరావులు పాల్గొని మాట్లాడారు. డాక్టర్ వెంకయ్య గుంటూరు మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థి అని వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాల ఆపరేషన్లతో పాటు మరో రెండువేలకు పైగా హెచ్‌బిఎస్(ఎజి) పాజిటివ్, హెచ్‌ఐవి పేషెంట్లు, దివ్యాంగులు, వితంతువులకు సుమారు రెండువేల సర్జరీలు చేశారని తెలిపారు. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, రాష్ట్రముఖ్యమంత్రులు నారాచంద్రబాబు నాయుడు, కొణిజేటి రోశయ్య, ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డిల చేతుల మీదుగా రాష్ట్ర, కేంద్ర వార్డులను కూడా అందుకున్నారని కొనియాడారు. మదర్ చారిటబుల్ ట్రస్టును స్థాపించి దాని ద్వారా వివిధ రకాల వైద్య సేవలను వెంకయ్య అందిస్తున్నారని తెలిపారు. తనను సత్కరించిన ప్రతినిధులకు ఈ సందర్భంగా వెంకయ్య కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టర్ వెంకయ్యను సత్కరిస్తున్న దృశ్యం

# హైదరాబాద్‌లో అద్దంకి మహిళ విద్యుత్ షాక్‌తో మృతి

**అద్దంకి:**అద్దంకిలో నివాసముండే విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ దారం రాంబాబు సతీమణి సీతారావమ్మ (44) హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందారు. కుటుంబసభ్యుల కథనం మేరకు ఇటీవల వివాహం జరిగిన రాంబాబు చిన్న కుమార్తె, అల్లుడు ఉద్యోగ రీత్యా ఆదివారం సాయంత్రం విదేశాలకు వెళ్ళాల్సి ఉంది. దాంతో కుటుంబ సభ్యులు అందరూ హైదరాబాద్‌లోని నిజాంపేటలో అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న పెద్ద కుమార్తె వద్దకు వెళ్ళారు. అపార్టుమెంట్‌లో ఉతికిన చీర ఆరవేస్తుండగా సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో షాక్‌కు గురై మృతిచెందింది. విషయం తెలుసుకున్న అద్దంకిలోని బంధువులు, కుటుంబ సభ్యుల ఇంట విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని ఆదివారం రాత్రి హైదరాబాద్ నుండి అద్దంకి తీసుకొచ్చారు. అమెరికాలో చదువుతున్న కుమారుడు రావడానికి రెండు రోజులు పట్టనుండడంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించే అవకాశం ఉంది.



సీతారావమ్మ(ఫైల్)

# ఆర్‌సీఎస్ వేధింపులపై 23న భవిష్యత్ కార్యాచరణ

● పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ఈదర మోహన్ వెల్లడి

**ఒంగోలు విద్య :** రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ (ఆర్‌సిఎస్) వేధింపులపై ఈనెల 23న భవిష్యత్ కార్యాచరణను ఖరారుచేయనున్నట్లు పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ఈదర మోహనబాబు తెలిపారు. ఆర్‌సిఎస్ బ్యాంకుపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బ్యాంకులో అవినీతి, అవకతవకలు జరిగాయంటూ అవాస్తవాలతో ఫిర్యాదులను ప్రోత్సహిస్తున్నారన్నారు. బ్యాంకుకు సంబంధం లేనివారు అవాస్తవాలతో పిటీషన్లు పెట్టినా వాటిపైవిచారణకు ఆదేశిస్తూ బ్యాంకు ప్రతిష్టను దెబ్బతీస్తున్నారన్నారు. పిర్యాదులు ,విచారణలకు సమాధానం చెప్పుకొనేందుకే తమ విలువైన కాలాన్ని వెచ్చిస్తున్నామని దీంతో బ్యాంకు అభివృద్ధిపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టి పనిచేయలేక పోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌సీఎస్ వేధింపులగురించి సొసైటీ అధ్యక్షులందరికీ తెలియజేసి వారి అభిప్రాయాలను తీసుకొని భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించేందుకు ఈనెల 23న ఉదయం 10గంటలకు స్థానిక వేమూరి లక్ష్మణ కళ్యాణ మండపంలో సొసైటీ అధ్యక్షుల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మోహన్‌బాబు తెలిపారు. ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా జిల్లాలోని సొసైటీ అధ్యక్షులందరికి సమాచారం పంపించినట్లు ఆయన తెలిపారు.

# నేటి నుంచి టీచర్లకు టెలీకాన్ఫరెన్స్‌లు

**ఒంగోలు విద్య :** జిల్లాలోని ప్రాథమిక ,ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎస్‌సీఈఆర్‌టి ఆధ్వర్యంలో టెలికాన్ఫరెన్సు సోమవారం నుండి జరుగుతుందని డీఈవో విజయభాస్కర్ తెలిపారు. 21, 22 తేదీల్లో ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానంపై టెలికాన్ఫరెన్సు పద్ధతిలో శిక్షణ ఇస్తారు. మొదటి రోజు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులలో 21న సగం మంది, 22 మిగతా సగంమంది టెలీకాన్ఫరెన్సు శిక్షణకు హాజరు కావాలి. 23న హైస్కూళ్ళలో పనిచేస్తున్న భాషా పండితులు, స్కూలు అసిస్టెట్లకు తెలుగు, గణితం, సైన్సు, సోషల్ స్టడీస్ సబ్జెక్టులో టెలికాన్ఫరెన్సు జరుగుతుంది. ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా వారు పనిచేస్తున్న మండాల్లోనే శిక్షణకు హాజరు కావలని డీఈవో తెలిపారు.

# వేడుకకు ఆహ్వానించిన వ్యక్తిపైనే దాడి

**చీరాలటౌన్ :** ఇంట్లో జరిగే శుభకార్యక్రమానికి ఆహ్వానించిన వ్యక్తిపైనే కొందరుదాడి చేసి గాయపరిచిన వైనమిది. చీరాల అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల హారీస్‌పేటకు చెందిన సీహెచ్.నాగరాజు తన కుమార్తె ఓణీల వేడుకకు ఆదివారం ఇరుగుపొరుగు వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంగీత విభావరి కూడా ఏర్పాటు చేశారు. అయితే మైకు ఆపడంతో హారీస్‌పేటకు చెందిన సూరి, నాని, మిలటరీ అనే వ్యక్తులు గొడవకు దిగి నాగరాజుపై పచ్చుడిబండతో దాడి చేసి గాయపరిచారు. వైద్యచికిత్స కోసం చీరాల ఏరియా వైద్యశాలలో చేరిన బాధితుడు నుండి పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
మార్కాపురం
ప్రకాశం • సోమవారం 21 ఆగస్టు 2017


## గౌడల అభివృద్ధే లక్ష్యం

**మార్కాపురం:** గౌడలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకొని అన్ని రంగాల్లో రాణించాలని గౌడ సంఘ అధ్యక్షుడు రంగస్వామి అన్నారు. ఎన్జీవో హోంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి సమావేశంలో రంగస్వామి గౌడ్ మాట్లాడు తూ గౌడలు 11 నుంచి 15 మంది వరకు గ్రూపుగా ఏర్పడి బీసీ వెల్ఫేర్‌లో నమోదు చేయించుకుంటే ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కీర్తి సాయిన్న, రమణ, శ్రీనివాస గౌడ్, కృష్ణ, హనుమయ్య, బాలనాగయ్య, వెంకటేశ్వర్లు, కంచర్ల రవి పాల్గొన్నారు.

## పుచ్చకాయలపల్లిలో జల కష్టాలు

- అధ్వానంగా రోడ్లు, కాలువలు
- ఒట్టి పోయిన బోర్లు
- నిరుపయోగంగా ట్యాంకర్లు

**పెద్దారవీడు:** పుచ్చకాయలపల్లిలో సమస్యలకు నిలయంగా మారింది. గ్రామంలో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. సైడుకాలువలు ఉన్నా కూడా కాలువలలో పూడిక తీయకపోవటంతో ప్రజలు వ్యాధుల భారిన పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్లలో సైడుకాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మంచినీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న బోర్లన్నీ ఒట్టిపోవటంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినప్పటికీ అవి సరిపోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. అవి కూడా ట్యాంకర్ల ద్వారా వచ్చే నీరు చాలీ చాలక ఉంటున్నాయంటున్నారు. ట్యాంకర్ల వద్ద తోపులాటతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామానికి మొత్తం 20 ట్యాంకర్లు నీరు వస్తున్నా గ్రామానికి సరిపోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలలో ఉదయం, సాయంత్రం రావాల్సిన ట్యాంకర్లు రాత్రి వేళల్లో వస్తున్నాయని దీనితో గ్రామాలలో ప్రజలు పనులకు వెళ్ళి వచ్చే సమయానికి నీరు పట్టుకోవటానికి ఇబ్బంది కరంగా ఉందంటున్నారు. గ్రామాలలో 5 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నా అవి నిరుపయోగంగా మారాయి. గ్రామానికి సంబంధించిన 7 బోర్లు ఉన్నా కూడా బోర్లన్నీ ఒట్టిపోవటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎక్కువగా పాడి సంపదపై ఆదారపడి జీవనం సాగిస్తున్న పశువులకు కూడా నీరు దొరకకపోవటంతో పశువులు ఇబ్బందులు పడుతున్నాయి. గ్రామంలో సైడు కాలువలు ఉన్నా కూడా కాలువలలో ఏ నాడు మురుగు తొలగించిన పాపాన పోలేదు. రహదారులు మొత్తం గులకరాళ్ళతో లేచి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిని గుర్తించి అధికారులు నూతన రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటిని, రోడ్లు, సైడుకాలువలలో మురికిని తొలగించి ప్రజలను పలు రోగాల నుంచి కాపాడాలని వారు కోరారు.

### సినిమాలు

**మార్కాపురం**

జగదీశ్వరీ - జయజానకి నాయక
విజయా - రారండోయ్
శ్రీనివాస - నేనేరాజు నేనే మంత్రి
రాధాకృష్ణ - ఆనందోబ్రహ్మ
సాయిబాలాజి - ఫిదా
విశ్వేశ్వర - లై

**పొదిలి**

వెంకటేశ్వర - లై
హరికృష్ణ - నేనే రాజు నేనే మంత్రి
రాఘవేంద్ర - జయ జానకి నాయక

# ఈ రోడ్లకు మోక్షమెప్పుడు?

**తర్లుపాడు:** మండలంలోని అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు మోక్షమెప్పుడు కలుగుతుందోనని ప్రజలు వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. తర్లుపాడు నుంచి నాయుడుపల్లి వెళ్ళే రహదారి, నాగెళ్ళముడుపు నుంచి పత్తేపురం, తాడివారిపల్లి నుంచి కొత్తూరు, మంగళకుంట నుంచి కొత్తూరు, సీతానాగులవరం నుంచి గోరుగుంతలపాడు, తర్లుపాడు నుంచి తుమ్మలచెరువు, గానుగపెంట నుంచి రాగసముద్రం, పోతలపాడు నుంచి కందళ్ళపల్లి, బుడ్డపల్లి నుంచి తుమ్మలచెరువు, కేతగుడిపి నుంచి సూరేపల్లి రోడ్లు మోకాళ్ళ లోతు గుంతలు ఉండటంతో ఈ రోడ్లపై ప్రజలు ప్రయాణించాలంటే నరక యాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్ల గురించి పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవు. తర్లుపాడు నుంచి కలుజువ్వలపాడుకు రోడ్డుకు ఇరువైపుల చిల్ల చెట్లు అలుముకొని ఉన్నాయి. తర్లుపాడు నుంచి నాయుడుపల్లి వెళ్ళే రహదారి కూడా చిల్లచెట్లు అలుముకొని ఉండటంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. నాయుడుపల్లి వెళ్ళే రహదారి మరమ్మత్తులకు నిధులు మంజూరు అయినట్లు చెబుతున్నా గత 6 నెలల నుంచి పనులు పెట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మండలంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు మరమ్మత్తులు చేయించి ప్రజల కష్టాలు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన నాయుడుపల్లి రోడ్డు

## కరాటేలో విద్యార్థుల ప్రతిభ

**మార్కాపురం:** జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రియోషిన్ కరాటే ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టును ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలలో 40 మంది విద్యార్థులు పాల్గొనగా వైట్ టు ఎల్లో 10 సంవత్సరాలు పైబడినవారిలో ఎం.యశ్వంత్ ప్రథమ స్థానంలో నిలచగా, కె.సాయి సమీర్ ద్వితీయ స్థానం సాధించాడు. 10 సంవత్సరాల లోపు వారిలో వై. రిగ్విద మొదట స్థానం సాధించగా, కె.జయంత్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఎల్లో టు ఆరెంజ్ పోటీలలో ఎ.అవినాష్ ప్రథమ స్థానం సాధించగా, ఎ.రేవంత్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఆరెంజ్ టు బ్లూ పోటీలలో ఆర్. ప్రణవ్ ప్రథమస్థానంలో నిలువగా, బి.సాయిపవన్ ద్వితీయ స్థానం సాధించారు. పోటీలను కరాటే ఇన్‌స్పెక్టరుగా తోట ప్రసాదు (టుడాన్), చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు.

## వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

### ఆర్డీవో కిశోర్

**మార్కాపురం:** పట్టణంలో ప్రజలందరూ కులమతాలకు అతీతంగా శాంతియుతంగా, ఐకమత్యంతో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఆర్డీవో పెంచల కిశోర్ అన్నారు.

స్థానిక నెహ్రూబజారులోని సాయిబాబా గుడిలో విఘ్నేశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక ఉత్సవ కమిటీ కార్యవర్గ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గోపాలుని హరిహరరావు అధ్యక్షత వహించగా ఆర్డీవో, డీఎస్పీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. డీఎస్పీ రామాంజనేయులు మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు నిర్వహించే వారు బలవంతంగా చందాలు వసూలు చేయకుండా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసుకునే వారు పోలీసుల అనుమతి తప్పని సరిగా పొందాలన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా విగ్రహాలను ఏర్పాటు చేస్తే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. వినాయక మండపాలు, ఎన్ని రోజులు నిర్వహిస్తున్నదీ, మైక్ సౌండ్, నిమజ్జన సమయాలపై పోలీసులకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం పోలీసుల అనుమతి మేరకే ఉత్సవాలు నిర్వహించాలని ఆయన నిర్వాహకులను కోరారు. అలాగే విద్యుత్‌కు సంబంధించి కూడా సంబంధిత శాఖ నుంచి అనుమతి పొందాలని సూచించారు. కార్యక్రమంలో దేవిశెట్టి చంద్రశేఖర్, దేవతి రాములు, ఉత్సవ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో కిశోర్


తెలుగు నాడు విద్యుత్ కార్మికుల సంఘం నాయకులు

## విద్యుత్ కార్మిక సంఘం నూతన కమిటీ

**మార్కాపురం:** స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన తెలుగు నాడు విద్యుత్ కార్మికుల సంఘం సమావేశం ఏర్పాటు చేసుకొని రీజనల్ నాయకులు ఆర్.సంజీవరావు, కె.నాగయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మార్కాపురం తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడిగా కంచర్ల మల్లికార్జున, కార్యదర్శిగా నక్కా రమేష్ బాబు, కోశాధికారిగా కనమర్లపూడి శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.ఏలియాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రీజనల్ నాయకులు ఆర్.సంజీవరావు మాట్లాడుతూ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టర్ కార్మికుల సమస్యలపై ఈ నెల 23వ తేదీన విజయవాడలోని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం కార్యాలయంలో జరగబోవు జేఏసీ సమావేశంలో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

## ముగిసిన వయోజనుల పరీక్షలు


పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్ జ్యోతి

**పొదిలి :** అక్షరాస్యత నిర్ధారణ పరీక్షలు విజయవంతంగా ముగిసినట్లు వయోజన విద్యా సూపర్‌వైజర్ కె.జ్యోతి చెప్పారు. ఆదివారం స్థానిక నేతపాలెం వయోజన విద్యా కేంద్రంలో నిర్వహించిన పరీక్షాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ 15వ విడత జరుగుతున్న విచారణ పరీక్షాలలో మండలంలో 800 మంది వయోజనులు పరీక్ష రాయవలసి ఉందని చెప్పారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులయిన వయోజనులకు 3 వ తరగతి ఉత్తీర్ణత ధృవపత్రాలు అందజేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, అక్షరాస్యత అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న వయోజన విద్యా కేంద్రాలన సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గ్రామస్థాయి కో-ఆర్డినేటర్లు వయోజన కేంద్రాలను సమర్థవంతంగా పనిచేయించాలని సూచించారు. ఆమె వెంట మండల కో-ఆర్డినేటర్ అనిత, వీసీవో ఇందిరమ్మ తదితరులు ఉన్నారు.

## నత్తనడకన వంతెన నిర్మాణం

**దొనకొండ :** చందవరం సమీపంలోని గుండ్లకమ్మ వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇటీవల వర్షాలు కురవడంతో వరద నీరు చప్టాలపై నుంచి ఉధృతంగా ప్రవహించాయి. దీంతో వాహనాల చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పశ్చిమ ప్రాంత ప్రజల రాకపోకలను దృష్టిలో పెట్టుకొని గత కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. టెండరు పొందిన గుత్తేదారు 7 పిల్లర్లు నిర్మించారు. తరువాత గిట్టుబాటు కాదన్న నెపంతో పనులను అర్ధాంతరంగా నిలుపుదల చేశారు. మంత్రి శిద్దా ప్రజల ఇబ్బందులు గుర్తించి వంతెన నిర్మాణం కోసం రూ.7కోట్లు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి 2016 ఆగస్టు 9న మళ్లీ పనులు ప్రారంభించి ఏడాది అయినా పనులు ముందుకు సాగడం లేదు.

## ఉపఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే డేవిడ్‌రాజు

పెద్దారవీడు: నంద్యాల ఉప ఎన్నికలలో ప్రచారంలో ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్ రాజు ఆది వారం నంద్యాల 8వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పట్టణంలో పలు ప్రాంతాలలో ఇంటింట ప్రచారం చేపట్టామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చేపడుతున్న పలు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ప్రచారం నిర్వహించారు. ఆ యన వెంట పెద్దారవీడు మండల కన్వీనర్ వెన్నా వెంకటరెడ్డి, మాజీ చంద్రగుంట్ల నాగేశ్వర రావు, మాజీ సర్పంచ్ వెన్నా మల్లారెడ్డి, రాములు, అనిల్ కుమార్, కోటిరెడ్డి పాల్గొన్నారు.

# నిరుపయోగంగా మరుగుదొడ్లు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు

పెద్దారవీడు: మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు వినియో గించకపోవటంతో నిరుపయోగంగా మారా యి. గతంలో ప్రభుత్వ పాఠశాలకు మరుగు దొడ్లు లేవని సుప్రీం కోర్టు ప్రభుత్వానికి ఉత్త ర్వులు ఇవ్వటంతో తప్పని పరిస్థితులలో ప్రతి పాఠశాలలకు మరుగుదొడ్లను ని ర్మించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13 ఉండ గా, ఉన్నత పాఠశాలలు 4, ప్రాథమిక పాఠశా లలు 46 ఉన్నాయి. వీటిలో అరకొర మరుగుదొడ్లు నిర్మించారే తప్ప, సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వాటికి నీటి సరఫరా లేకపోవటం, శుభ్రం చేసేందుకు సిబ్బంది లేకపో వటంతో వాటిని వాడటం లేదు. ప రిసరాల పరిశుభ్రతతో బహిరంగ మల విసర్జన నిర్మించాలన్న కేంద్ర ప్రభుత్వం మాటలు నీటి బుడగలా మారుతు న్నాయి. ఆచరణ సాధ్యం కావటం లేదు. మా ర్పు ప్రజల్లో కంటే విద్యార్థుల్లో చురుకుగా ఉం టుందన్న విషయంతో మొదట పాఠశాలలో మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. పాఠశాలలో విద్యుత్ మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ నీటి సరఫరా అంతంత మాత్రంగా ఉం డటంతో నిరుపయోగంగా మారా యి. పంచాయతీ నిధులతో మరు గుదొడ్లు నీటి సరఫరా కల్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నా స ర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవటం లేదని చెప్తున్నారు. తంగిరా లపల్లి, పెద్దారవీడు, పెద్దారవీడు ఎస్సీ, ప్రగ ళ్ళపాడు తదితర పాఠశాలలో మరుగుదొడ్లు ఉన్నా నీటి వసతి లేక నిరుపయోగంగా మా రాయి. కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరి ఉప యోగించేందుకు వీలులేకుండా ఉన్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు చెప్తున్నారు. ఇ లా పాఠశాలల్లో అనేక సమస్యలతో మరుగు దొడ్ల వినియోగం జరగడంలేదు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మా త్రమే మరుగుదొడ్ల వాడకం జరుగుతున్నదని అంటున్నారు. వాటికి కూడా నీటి సమస్య ఉన్నా సర్దుకుపోతున్నారు. బాలురు మాత్రం ఆరుబయటే మలవిసర్జన చేయాల్సి వస్తోంది. అధికారులు మరుగుదొడ్ల వినియోగంపై దృ ష్టిసారించాలని, వాటి నిర్వహణకు తగిన ఏ ర్పాట్లు చేయాలి.



ఎస్సీపాలెంలో నిరుపయోగంగా మరుగుదొడ్లు



శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు



మూతలేని బోరు బావి

## వామ్మో బోరు బావులు

పెద్దారవీడు: మండలంలోని వివిధ ప్రాంతాలలో బోరు బావులు నోళ్ళు తెరు చుకొని నరకానికి నకళ్ళుగా మారుతు న్నాయి. మండలంలోని పలు చోట్ల పొ లాల్లో, గ్రామాలలో ఉన్నాయని గ్రా మాల ప్రజలు అంటున్నారు. కొంత మంది రైతులు పొలాల్లో బోరు బావులు వేశారు. కానీ నీరు పడని వాటిని అలాగే వదిలేశారు. కొన్ని చోట్ల అంగన్ వాడీ స్కూళ్ళలో కూడా చుట్టూ ముళ్ళ కంచెతో బోరు బావులకు ఏర్పాటు చేసి అలాగే ఉంచారు. దీంతో పిల్లల పాలిట మృత్యుపిలుపుగా మారుతున్నాయి. స్థా నిక మండల కేంద్రంలోని నిత్యం అధికా రులు ఎప్పటికప్పుడు మండలం కార్యా యాలకు వస్తుంటారు కానీ ఈ బోరు బావులు ఎవరికీ పట్టనట్లు కనిపించటం లేదు. ఎస్సీ పాలెంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద బోరు వేసి దాని చుట్టు కం ప వేశారు. కాని నిత్యం అంగన్‌వాడీ కేం ద్రంలోని చిన్నపిల్లలు ఆటలాడుకుం టారు. కానీ ఏ సమయంలో ఏమి జరు గుతుందోనని పిల్లల తల్లిదండ్రులు భ యాందోళన చెందుతున్నారు. ఈ మధ్య కాలంలో ప్రమాదం జరగటంతో ఇంకా భయాందోళనకు గురవుతున్నారు. అధి కారులు మాత్రం చెప్పినా రెండు రోజు లు మాత్రమే హడావుడిగా చేస్తారు. ఆ తరువాత ఇటు వైపు కన్నెత్తి చూడని వైనంగా మారింది.

రైతుల అవసరాల కొరకు కొన్ని చోట్ల పొలాల్లో బోర్లు వేశారు కాని ఇందులో నీరు పడకపోవటంతో కనీసం దానిపై చిన్న బండరాయి కూడా పెట్టని వై నంగా మారింది. కొన్ని చోట్ల అ లాగే వ దిలేశారు. ఇలాంటివి పొలాల్లో వేల సం ఖ్యలో బోరు బావులు మూతలు లేకుం డా ఉన్నాయని మండలంలో పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బోరు బావులపైదృష్టి సా రించి బోరు బావులను మూసివేయా లని ప్రజలు కోరుతున్నారు.

## చంద్రన్న బీమా పంపిణీ

త్రిపురాంతకం: మండల కేంద్రం లోని షేక్ మౌలాలి చంద్రన్న బీమాలో పేరు నమోదు చేసుకొని ఆదివారం అ నారోగ్యంతో మృతి చెందాడు. వెలుగు ఆ ధ్వర్యంలో బీమా మిత్ర గురవమ్మ మౌ లాలి కుటుంబ సభ్యులకు రూ.5 వేల నగదును చంద్రన్న బీమా ద్వారా అం దజేశారు. మిగిలిన నగదును త్వరలోనే అందజేస్తామని గురవమ్మ తెలిపారు.



నీరు వస్తున్నా బాగుచేయని బోరు

## మరమ్మతులకు నోచుకోని బోర్లు

- నీటి సమస్యలతో ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

పెద్దారవీడు: మండలంలోని 19 పం చాయతీల్లో గ్రామీణ ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు, ఇంటి అవసరాల ని మిత్తం ప్రభుత్వం చేతి పంపులను ఏ ర్పాటు చే సింది. చేతి పంపులు పాడై ఏళ్ళు గడు స్తున్నా సంబంధిత అధికారులు పట్టన ట్లుగా వ్యవహరిస్తున్నారు. తా గునీటి పథకాల నుంచి సక్రమంగా నీరు రాక పోగా, చేతి పంపులు కూడా పని చేయ కపోవడంతో ప్రజలు నీటి కోసం నానా పాట్లు పడుతున్నారు. వివిధ గ్రామాల లో దాదాపు 25 నుంచి 30 గ్రామాలు ఉ న్నాయి. వేసవిలో చాలా గ్రామాల్లో తా గునీటి సమస్య అధికంగా ఉంది. అధి కారులు ట్యాంకర్ల ద్వారా రైతుల బోర్ల వద్ద నుంచి నీటిని సరఫరా చేస్తున్నా సరిపోవటం లేదు. చేతి పంపులు ఉంటే ఇంటి అవసరాలకు వాడుకొని ట్యాంకర్ల ద్వారా వచ్చే నీటిని తాగుతుంటారు. ప్ర స్తుతం గ్రామాలలో చేతి పంపులు పని చేయటం లేదు. పై పంచాయతీలలో దా దాపు 270 చేతి పంపులు పని చేయటం లేదు. చాలా చోట్ల దిష్టి బొమ్మల్లా దర్శన మిస్తున్నాయి. ఏళ్ల గడుస్తున్నా వాటి మరమ్మతులు చేయటంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. కొన్ని బో ర్లలో స్వల్పంగా నీరు వస్తున్నా మరమ్మ తులు చేయకుండా విడిచిపెట్టారు. సమ స్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప ట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# విజయవంతంగా ఎన్ఐవోఎస్ పరీక్షలు

త్రిపురాంతకం: గ్రామాలలో సాక్షరభారత్ ఆధ్వర్యంలో నేషనల్ లిటరసీ ఓపెన్ సొసైటీ పరీక్షలను ఆదివారం ని ర్వహించారు. ఈ పరీ క్షలలో 717 మంది హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో సాక్షరభారత్ కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా ఆయా గ్రామాల వీసీవోలు, ఉ పాధ్యాయులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరిం చారు. మం డల కోఆర్డినేటర్ నీలం సురేష్ పరీక్షలను పర్యవేక్షించారు. పాసైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

పెద్ద దోర్నాల: చిన్న దోర్నాల గ్రామంలో నేషనల్ ఇనిస్ట్యూషన్ ఆఫ్ ఓపెన్ స్కూల్‌లో భాగంగా అభ్యాసకులు ఆదివారం పరీక్షలు రాశారు. ఈ పరీక్షల్లో 11 పంచాయతీలకు గాను 132 మంది అభ్యాసకులు పరీ క్షలు రాశారు. 15 సంవత్సరాలు నిండిన వయోజనులు, నూతన అక్షరా స్యులు, బడి మానివేసిన వారు పాల్గొన్నట్లు సాక్షర భారత్ మండల కో ఆర్డినేటర్ ఇ. శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్య దర్శి శివకోటేశ్వరరావు, ట్రైనర్ వెంకటేశ్వరరావు, సాక్షరభారత్ కార్యక ర్తలు గాలిరాజు, బి. వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పెద్దారవీడు: సాక్షరభారత్ వయోజన కేంద్రాలలో అభ్యాసకులకు ఆదివారం పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు ఎర్రగొండపాలెం ని యోజకవర్గ సాక్షరభారత్ సూపర్ వైజర్ ఎ.చెన్నారెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. మండలంలోని మొత్తం 38 వయోజన కేంద్రాలు ఉండగా 663 మంది అభ్యాసకులకు పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కుందురు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ బత్తుల నాగమ్మ, ఎంపీటీసీ రిప్కా, వీవోసీ జయరావు, నారాయణమ్మ, విజ యమ్మ పాల్గొన్నారు.



త్రిపురాంతకంలో పరీక్షలు రాస్తున్న వయోజనులు

# పాఠశాలలకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

త్రిపురాంతకం: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికో న్నత, ఉన్నత పాఠశాలలకు మధ్యా హ్న భోజనం వండేందుకు గాను గ్యాస్ సిలిండర్లను ఎంఈవో కేటీ మల్లికార్జున నాయక్ ఆదివారం పంపిణీ చేశారు. మండలంలోని 60 పాఠశాలలకు 60 సిలిండర్లు మం జూరు కాగా ఆయా పాఠశాలల ప్ర ధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు, గ్యాస్ డీలర్లు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠ శాలలకు మంజూరైన 43 గ్యాస్ కనెక్షన్లను ఆదివారం ఎంఈవో పి.ఆంజనే యు లు ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. సోమవారం నుం చి ప్రతిపాఠశాలలో గ్యాస్ స్టౌవ్ పై పైనే వంట చేసేలా చర్యలు తీసుకో వాలని ఎంఈవో ఆదేశించారు. మం డలంలో మొదట విడతగా 43 పాఠశాలలకు 114 గ్యాస్ సిలిండర్లు మంజూరు అయ్యా యని తెలి పా రు. రెండవ విడతలో మిగిలిన పా ఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు మం జూరు అవుతాయని తెలిపారు. కా ర్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: గ్యాస్ పొయ్యిపై నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో సీహెచ్‌పీ వెంకటరెడ్డి అన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు గ్యా స్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయులు వై. వెంకటరామిరెడ్డి, వై. సత్యనారాయ ణరెడ్డి, శ్రీనివాసులు, శ్రీరాములు, యన్‌యంసి ఛైర్మన్ అబ్దుల్లా, సి ఆర్‌పి మస్తాన్, వంట సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల: శివమణికంఠ ఏజెన్సీ కార్యాలయం వద్ద ప్రభుత్వ పాఠశాలలకు ఎంఈవో బి.మస్తాన్ నాయక్ ఆదివారం గ్యాస్ సిలిండ ర్లను పంపిణీ చేశారు. మండలం లోని 42 పాఠశాలలకు గాను 84 సి లిండర్లను ఆయా పాఠశాలల ప్రధా నోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఏజెన్సీ ప్రొప్రైటర్ రావికింది లక్ష్మి నరసింహారావు, ఎన్ ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖరరావు, హెచ్‌ఎంలు జవహర్‌లాల్ నాయక్, ఆదిలక్ష్మి, ఆ యేషాబేగం, రామసు బ్బారెడ్డి, కాసా సుబ్బారెడ్డి, వెం కయ్య, కో ఆర్డినేటర్ సాయి పాల్గొ న్నారు.



త్రిపురాంతకంలో గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో

# ఈవారంలో మూడు రోజులే బ్యాంకులు

**ఒంగోలు, ఆంధ్రజ్యోతి :** బ్యాంకు ఖాతాదారులకు మరోసారి ఇక్కట్లు తప్పని పరిస్థితి కనిపిస్తున్నది. ఈ వారంలో కేవలం మూడు రోజులు మాత్రమే పని చేయనుండటంతో ఆపరిస్థితి కనిపిస్తున్నది. సాధారణంగా బ్యాంకులకు వారంలో ఒక్క ఆదివారమే సెలవు అయితే గత కొంతకాలంగా నెలలో ఒకటవ, మూడవ శనివారాలు సెలవులు ఇస్తున్నారు. అలా నెలలో సాధారణంగా ఉండే నాలుగు వారాలలో రెండు వారాలు ఆరురోజులు, మరో రెండువారాలు ఆయిదు రోజులు పనిచేస్తున్నాయి. అయితే ఈనెల 21 నుంచి 27 వరకు ఉన్నవారంరోజులలో బ్యాంకులు కేవలం మూడు రోజులు మాత్రమే పనిచేయనున్నాయి. మిగిలిన నాలుగురోజులు బ్యాంకులు మూతపడతాయి. అందులో 25నుంచి 27వరకు వరుసగా మూడు రోజులు సెలవులువచ్చాయి. సోమవారం (21వతేదీ) బ్యాంకులు యథావిధిగా పనిచేస్తాయి. 22న ఉద్యోగులు సమ్మె నిర్వహిస్తున్నారు. బ్యాంకింగ్ రంగ పరిరక్షణ, నూతనబ్యాంకింగ్ విధానంపై పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టనున్న బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా అన్ని ఉద్యోగ సంఘాల ఉమ్మడిగా ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో ప్రభుత్వ రంగంలోని ఏఒక్క బ్యాంకు 22న పనిచేసే అవకాశం లేదు. మరోవైపు ఈనెల 25న వినాయకచవితి పర్వదినం, 26న నాల్గవ శనివారం , 27న అదివారం వరుసగా మూడురోజులు సెలవులు వస్తున్నాయి. దీంతో ఆమూడురోజులు బ్యాంకులు పనిచేసే అవకాశం లేదు. కాగా వారంలో నాలుగు రోజులు బ్యాంకులు మూత పడే అకాశం ఉండడంతో ఖాతాదారులు సాధారణ లావాదేవీలతో పాటు నగదు కోసం తీవ్రంగా ఇబ్బందులు పడే పరిస్థితి కనిపిస్తున్నది. ఏటీఎంలలో అవసరం అయిన మేర నగదు నిల్వలు ఉంచడం ద్వారా ప్రజలకు నగదు ఇక్కట్లు తీర్చే మార్గం ఉన్నా బ్యాంకులు ఆ పని చేయడం లేదు. ఈనెల 12నుంచి 15 వరకు ఒకసారి వరుసగా నాలుగు రోజులు వివిధ కారణాలతో బ్యాంకులకు సెలవులు వచ్చాయి.

ఆ సమయంలో ఏటీఎం కేంద్రాలలో ప్రధాన బ్యాంకులు నగదు నిల్వలు సక్రమంగా ఉంచలేదు. దీంతో ప్రజలు అసమయంలో నగదు కోసం తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అదే పరిస్థితి మళ్లీ ఈ వారంలో ఏర్పడే అవకాశం కనిపిస్తున్నది. ఈ సారి అయినా బ్యాంకర్లు ముందు జాగ్రత్తతో వ్యవహరించి ఏటీఎం కేంద్రాలలో నగదు నిల్వలు అవసరాలకు సరిపడా ఉంచాల్సి అవసరం ఎంతైనా ఉంది.

# దర్శి సబ్‌ట్రెజరీలో నిధుల గోల్‌మాల్

(మొదటిపేజీ తరువాయి)

చేయించుకొని ఆమె పేరుతో బ్యాంకు అకౌంట్ తీసి ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేసినట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి 2016 మార్చి వరకు రూ. 23లక్షల 84వేల 331 రూపాయాలను ఈ అకౌంట్ ద్వారా డ్రా చేశారు. మరో అకౌంట్ ద్వారా రూ. లక్షా 16వేలు, ఇంకో అకౌంట్ ద్వారా రూ. 5లక్షల 70వేల నిధులను మధ్యాహ్నం భోజన పథకం కింద డ్రా చేసినట్లు వెల్లడైంది. ఇందులో ఒక అకౌంట్ ప్రభుత్వ ఉద్యోగిది కావడం గమనార్హం. ఇందులో పద్మావతి అనే మహిళ పేరుతో తెరచిన అకౌంట్ గురించి అమెకు తెలియకపోవడం ఆశ్చర్యకరం. ఈ నిధుల స్వాహాలో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి. దర్శి సబ్ ట్రెజరీ కార్యాలయంపై సమగ్ర విచారణ చేస్తే ఇంకా అవినీతి, అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### అవినీతి వెలుగులోకి వచ్చింది ఇలా..

దర్శి సబ్ ట్రెజరీ కార్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలు ఓ ఉపాధ్యాయుడి ద్వారా వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగి ఏడాదికి ఒక సారి 15రోజులు సరెండర్ లీవులను ప్రభుత్వానికి అమ్ముకోవచ్చు. అయితే ఆ ఉపాధ్యాయుడికి తెలియకుండానే సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఆ ఉద్యోగి సరెండర్‌లీవులను అమ్ముకొని అతని అకౌంట్‌లో డబ్బులు జమ చేశారు. ఒక ఉద్యోగి ఏడాదికి ఒక సారి మాత్రమే సెలవులు అమ్ముకోవాల్సి ఉండగా ఒకే ఏడాది రెండు సార్లు విక్రయించినట్లుగా రికార్డులు సృష్టించారు. ఆ ఉపాధ్యాయుడు ఈ విషయాన్ని గుర్తించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో దర్శి సబ్ ట్రెజరీ కార్యాయలంలో జరిగిన అవినీతి, అక్రమాలు బహిర్గతం అయ్యాయి. మరో ఉద్యోగి పశువైద్యశాలలో అటెండర్‌గా పని చేసి పదవీ విరమణ చేశారు. ఆ ఉద్యోగికి జీపీఎఫ్ పేమెంట్ దర్శి సబ్ ట్రెజరీ ద్వారా రూ. 5,78,981 రూపాయలు వచ్చింది. అయితే అదే అకౌంట్‌కు రెండో సారి కూడా అదే అకౌంట్‌కు రూ. 5,78,981 లు జమ చేశారు. తిరిగి ఆ డబ్బులు ఇవ్వాలని రిటైర్డ్ ఉద్యోగిని కోరడంతో ఆయన నిరాకరించారు. దీంతో ఒక పశువైద్యాధికారి జోక్యం చేసుకొని ఆ రిటైర్డ్ ఉద్యోగి ద్వారా బ్యాంకులో విత్‌డ్రా చేయించి తిరిగి ఇచ్చారు. అయితే ఆ డబ్బులు కూడా ఇంత వరకు జమ చేయనట్లు తెలిసింది.

### డీడీవో నిధులు రూ 1.07 లక్షల స్వాహా

రాష్ట్ర విభజన అనంతరం కొత్త రాష్ట్రం ఏర్పడుతున్న రోజున రాష్ట్రంలోని జిల్లా, సబ్ ట్రెజరీ కార్యాలయాల్లోని డీడీవో అకౌంట్లలో ఉన్న నగదును డ్రా చేసి ఆ నగదును మరుసటి రోజు జమ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ సమయంలో దర్శి సబ్ ట్రెజరీ కార్యాలయంలో లక్షా 07వేల 28పైసలను అప్పటి ఎస్‌టీవో డ్రా చేశారు. డ్రా చేసిన ఆ నిధులను రాష్ట్ర వ్యాప్తంగా డ్రాయింగ్ ఆఫీసర్లు డీడీవో అకౌంట్‌కు జమ చేయగా, దర్శి సబ్ ట్రెజరీలో మాత్రం ఇంత వరకు జమ చేయలేదని సమాచారం. దర్శి సబ్ ట్రెజరీ కార్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేసి ఇంకా అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

# కృష్ణానదిలో స్నానాలకు దిగి విద్యార్థి మృతి

## సురక్షితంగా బయటపడిన మరో ముగ్గురు

### మృతుడు మార్కాపురంకు చెందిన తూపాటి హరప్రసాద్‌గా గుర్తింపు

**మోపిదేవివార్పు (మోపిదేవి):** మోపిదేవిలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనానికి వస్తూ కృష్ణానదిలో పుణ్యస్నాన మాచరించేందుకు దిగి ఓ విద్యార్థి మృతి చెందగా, మరో ముగ్గురు విద్యార్థులు సురక్షితంగా బయటపడిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం మోపిదేవి వార్పు వద్ద జరిగింది.

అవనిగడ్డలో పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసిస్తూ హాస్టల్‌లో ఉంటున్న ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన తూపాటి హరిప్రసాద్, గుంటూరుకు చెందిన సరళ యుగంధర్, అమరావతికి చెందిన గాలం వెంకటేశ్వరరావు, విజయవాడకు చెందిన దిగమర్రు సాయిలు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు సైకిళ్లు మీద హాస్టల్ నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో కృష్ణానదిలో స్నానం చేసి గుడికి వెళ్దామనే ఆలోచనతో స్నానానికి దిగారు. మూడుసార్లు స్నానమాచరించి ఒడ్డుకు వచ్చి మళ్లీ నాల్గవ పర్యాయం హరిప్రసాద్ ఒక్కడే దిగినట్లు తోటి విద్యార్థులు అధికారులకు తెలిపారు. స్నానమాచరించేందుకు దిగి ఎంత సేపటికీ ఒడ్డుకు రాకపోవటంతో అప్పటికే బయటకు వచ్చిన సహచర విద్యార్థులు కేకలు వేసి పరిసర ప్రాంతంలోని వారికి సమాచారం అందించటంతో వారు పోలీసులకు సమాచారమందించారు.

ఎస్సై మణికుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది వార్పు వద్దకు చేరుకుని కృష్ణానదిలో విద్యార్థులు స్నానమాచరించిన ప్రదేశాన్ని జాలర్ల సహాయంతో వెతుకులాట ప్రారంభించగా, వార్పు వద్ద నుంచి నాగాయితిప్ప సరిహద్దులో వలలో చిక్కగా, అప్పటికే మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. జాలర్ల సాయంతో బోటులోకి ఎక్కించి మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న అవనిగడ్డ డీఎస్పీ ఖాదర్‌బాషా విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. హాస్టల్ నుంచి విద్యార్థులు అనుమతి తీసుకునే వచ్చారా....? లేదా? అని ఆ ప్రాంతానికి వచ్చిన హాస్టల్ సిబ్బందిని డీఎస్పీ విచారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పొగాకు బోర్డు మీనమేషాలు

(ఆంధ్రజ్యోతి-ఒంగోలు)

వ్యాపారుల ప్రయోజనాల కోసం చట్టాలను, రైతులను ఫణంగా పెట్టేందుకు ఏ మాత్రం వెనుకాడ ని పొగాకు బోర్డు, కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖలు రైతులకు ప్రయోజనాలు కాకపోయినా కనీసం అండగా ఉండేందుకు కూడా చొరవ చూపడం లేదు. ఈ ఏడాది రైతుల వద్ద కొద్దిమేర మిగిలి ఉన్న పొగాకు కొనుగోలు విషయంలో మీనమేషాలు లెక్కిస్తుండటమే అందుకు నిదర్శనం. ఇచ్చిన పరిమితి కన్నా స్వల్పంగా అధిక ఉత్పత్తి కొద్ది మంది రైతులకు రాగా గతంలో వలే అపరాధ రుసుంతో కొనుగోలు జరిగేలా చూడటంలో ఈ ఏడాది పొగాకు బోర్డు ఘోరంగా వైఫల్యం చెందింది. ఆయా వేలం కేంద్రాలలో నెల క్రితం నుంచే అధికారిక కొనుగోళ్లు పూర్తి అయినా కొద్దిపాటి అధిక పంట కొనుగోలుపై ఇంత వరకు ఇటు పొగాకు బోర్డు,. అటు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖలలో కదలిక లేదు. ఇప్పటికే సమయం మించి పోయిందని, దీని వల్ల పొగాకు నాణ్యత తగ్గిపోయి ఎందుకూ పనికి రాకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొగాకు పంటపై ప్రభుత్వ నియంత్రణ ఉండగా ఏ ప్రాంతంలో ఏ తరహా నేలల్లో ఎంత విస్తీర్ణంలో సాగు చేయాలి, ఎంత పంట ఉత్పత్తి చేయాలి అనే దానిపై రైతువారీ, బ్యారన్ వారీ పొగాకు బోర్డు అనుమతి ఇస్తుంది. అలా అనుమతించిన దాని కన్నా అధికంగా పంట పండితే అదనపు పంటకు కొంత అపరాధ రుసుంను పొగాకు బోర్డు వసూలుచేసి వేలంకు అనుమతి ఇస్తుంది. సాధారణ పొగాకు వలే దానిని కూడా వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అయితే అధికంగా పండిన పంటకు సంబంధించి రైతులు తమకు లభించిన ధరలో కొంత మొత్తాన్ని బోర్డుకు చెల్లించాలి. అదుపు లేకుండా అధికోత్పత్తి చేయకుండా రైతులను నియంత్రించేందుకు ఈతరహా విధానాన్ని పొగాకు బోర్డు అమలు చేస్తున్నది. సాధారణంగా అధికారిక పంట కొనుగోలు పూర్తయ్యే లోపుగానే అపరాధ రుసుంతో వేలం నిర్వహణపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ నుంచి పొగాకు బోర్డు అనుమతి పొంది వెంటనే ఆ పంటను కూడా కొనుగోలు జరిగేలా చూస్తారు. అయితే ఈ ఏడాది దక్షిణాదిలో పొగాకు వేలం ప్రక్రియ పూర్తయి పక్షం గడిచినా ఉన్న కొద్దిపాటి అధిక పంట కొనుగోలుపై ఎలాంటి చర్యలు లేవు. ఎప్పటి నుంచి కొనుగోలు చేస్తారో కూడా చెప్పలేని పరిస్థితి బోర్డు అధికారులలో కనిపిస్తున్నది. సాధారణంగా అధిక ఉత్పత్తి రెండు రకాలుగా ఉంటుంది. పొగాకు పంటకు మంచి ధరలు ఉండటం అలాగే ఇతర పంటల సాగుకు వాతావరణం అనుకూలించక పొగాకు సాగు విస్తీర్ణం పెరగడం వల్ల కొన్ని సందర్భాలలో అధిక ఉత్పత్తి జరుగుతుంది. అలాగే ఇచ్చిన విస్తీర్ణంలోనే పంట సాగు చేసినా వాతావరణం అనుకూలించి ఒక్కో సారి పంట బాగా వస్తుంది. అలా ఏటా కొంత మంది రైతులకు అధికంగా పంట ఉంటుంది. ఇచ్చిన ఉత్పత్తి పరిమాణానికి అదనంగా 10శాతం వరకు పండే పంటను యథావిధిగా వేలంకు బోర్డు అనుమతిస్తుంది. అంత కన్నా ఎక్కువ పంట పండితే అలాంటి వారి నుంచి 7.5 శాతం అపరాధ రుసుం వసూలు చేస్తారు. ఈ ఏడాది పరిస్థితి పరిశీలిస్తే రాష్ట్రంలోనూ, ప్రత్యేకించి దక్షిణాదిలోనూ అనుమతి ఇచ్చిన పంటలో రెండు వంతులు పంట మాత్రమే పండింది. అయితే కొద్ది మంది రైతులకు మాత్రం బ్యారన్‌కు రెండు, మూడు క్వింటాళ్ల మేర అధికంగా పండినట్లు సమాచారం. దక్షిణాదిలో మన జిల్లా , నెల్లూరు జిల్లాల్లోని 14 పొగాకు వేలం కేంద్రాలలో ఈ ఏడాది 82.56 మిలియన్లు పంటకు అనుమతి ఇవ్వగా అధికారికంగా 57.54 మిలియన్ల పంట కొనుగోళ్లు జరిగాయి. అంటే అనుమతి ఇచ్చిన దాని కన్నా దక్షిణాదిలో దాదాపు 25 మిలియన్లు మేర పంట ఉత్పత్తి తగ్గింది. అదే సమయంలో కొద్ది మంది రైతులకు ఇచ్చిన దాని కన్నా స్వల్పంగా అధిక ఉత్పత్తి జరిగింది. అందుతున్న సమాచారం మేరకు అలాంటి పొగాకు సుమారు 0.80 మిలియన్ల నుంచి ఒక మిలియన్ లోపుగానే ఉండవచ్చు. ఒంగోలు, కం దుకూరు, టంగుటూరు ప్రాంతాల్లోని వేలం కేంద్రంలో నాల్గవ వంతు మంది రైతులకు సంబంధించి ఒక్కొక్కరి వద్ద ఒకటి, రెండు బేళ్లు ఉండగా వెల్లంపల్లి, కొండపి ఇతర కేంద్రాల్లోను స్వల్పంగా ఉన్నట్లు సమాచారం. గతంలో పలు సందర్భాలలో ఇచ్చిన మొత్తం పరిమాణం కన్నా 10నుంచి 15 మిలియన్లుకు పైగా కూడా అధికోత్పత్తి జరిగిన పరిస్థితి ఉంది. అయితే అతి తక్కువ పంట ఈ ఏడాది ఉన్నా దానిని కొనుగోలు చేయడంలో పొగాకు బోర్డు అధికారులు ఇంత వరకు చర్యలు తీసుకోలేదు.

### కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖకు నెలన్నర క్రితమే ప్రతిపాదనలు

అందుతున్న సమాచారం మేరకు పొగాకు బోర్డు నుంచి గతంలో వలే అనుమతి కోసం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు నెలన్నర క్రితమే వెళ్లినా అక్కడి నుంచి ఇంత వరకు అనుమతి వచ్చిన దాఖలాలు లేవు. ఉత్తరాదిలో ఇంకా కొనుగోళ్ళు జరుగుతుండగా అక్కడ కూడా అధికారిక పంట కొనుగోళ్లు పూర్తయ్యేంత వరకు వాణిజ్య మంత్రిత్వ శాఖ నుంచి స్పష్టత వచ్చే అవకాశంలేదని కూడా కొంత మంది చెప్తున్నారు. అదే జరిగితే తాము తీవ్రంగా నష్టపోతామని దక్షిణాది రైతాంగం ఆందోళన చెందుతున్నది. ఆగస్టు ఆఖరు వరకు పంట నిల్వ ఉంచితే నాణ్యత పూర్తిగా తగ్గడంతో పాటు వర్షాలు పడితే ఎందుకు పనికిరాకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు. అయినా గతంలో వలే అధికారిక కొనుగోళ్ల పూర్తయ్యే లోపు అధికోత్పత్తిపై నిర్ణయం తీసుకోకపోవడం ఏమిటన్న ప్రశ్న పొగాకు రైతులలో వ్యక్తం అవుతున్నది. ఈ విషయంలో అటు పొగాకు బోర్డు అధికారులు ఇటు రైతు ప్రతినిధుల పైనా రైతులు విమర్శలు చేస్తున్నారు. రానున్న సీజన్ పంట సాగు, ఉత్పత్తి ఖరారుపై నిర్ణయం తీసుకోనేందుకు పొగాకు బోర్డు మరో నాలుగు రోజులలో సమావేశం కానుంది. ఇందుకు సంబంధించి ఈనెల 23న హైదరాబాద్‌లో కీలక సమావేశం జరగనుంది. ఆ సందర్భంగా తమ సమస్యను బోర్డు దృష్టికి తీసుకెళ్ళేందుకు దక్షిణాదిలోని పొగాకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

# స్మార్ట్ విలేజ్‌గా మోక్షగుండం

### సైయెంట్ కంపెనీ చైర్మన్, పద్మశ్రీ మోహన్‌రెడ్డి హామీ

### స్వగ్రామంలో ఘన సన్మానం

**బేస్తవారపేట :** బేస్తవారపేట మండలంలోని మోక్షగుండం గ్రామాన్ని స్మార్ట్ విలేజ్‌గా తీర్చిదిద్దుతానని సైయెంట్ కంపెనీ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బోధనపు వెంకట మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటికే గ్రామాన్ని దత్తత తీసుకున్న తాను అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. మున్ముందు వీటిని విస్తృతం చేస్తానన్నారు. ఈ ఏడాది జనవరిలో పద్మశ్రీ అవార్డు అందుకున్న మోహన్‌రెడ్డిని ఆదివారం స్వగ్రామమైన మోక్షగుండంలో గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తనకు తాత, తండ్రి ఆదర్శమన్నారు. వారు చూపిన మార్గంలోనే పయనించడం వలన ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. సైయెంట్ ట్రస్టు ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే పలు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అందులోనూ విద్య, వైద్యం, తాగునీటికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని శేరిలింగంపల్లె మండలంలో 100 స్కూళ్లను దత్తత తీసుకొని వాటిలో మౌలిక వసతుల కల్పనతోపాటు, పుస్తకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. స్వగ్రామమైన మోక్షగుండంను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. గ్రామంలోని స్కూల్‌లో సూమారు రూ. 25లక్షలతో డిజిటల్ తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ. 3లక్షలతో రక్షత నీటి పథకం నిర్మాణంతోపాటు, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వం నుంచి రూ. 3 కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. మోక్షగుండం స్కూల్‌కు హైస్కూల్ హోదా కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందుకు కావాల్సిన స్థలం, భవనం, ఆట స్థలం కొనుగోలు చేసి ఇస్తానన్నారు.

మరో ముఖ్యఅతిథి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన ఇంజనీర్ విశ్వేశ్వరయ్య మోక్షగుండం గ్రామానికి చెందిన వారన్నారు. ఆయనకు అప్పట్లో భారత రత్న, ప్రస్తుతం బోధనపు వెంకట మోహన్ రెడ్డి పద్మశ్రీ అవార్డు లభించడం జిల్లాకు గర్వకారణమన్నారు. గిద్దలూరు నియోజక వర్గం మొత్తాన్ని దత్తత తీసుకొన్ని పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని మోహన్‌రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో బేస్తవారపేట ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, సైయంట్ వైస్ చైర్మన్ బోధనపు అశోక్‌రెడ్డి, సర్పంచ్ కె. గోవిందమ్మ, గిద్దలూరు ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, ఏపీ స్మార్ట్‌సిటీ ప్రతినిధి లక్ష్మి, ఎంఈవో జింకా వెంకటేశ్వర్లు, చెట్టిచెర్ల, పందిళ్లపల్లె, బేస్తవారపేట సర్పంచ్‌లు తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి, కర్నాటి మోహన్‌రెడ్డి, దూదేకుల మాబు తదితరులు పాల్గొన్నారు.





పద్మశ్రీ అవార్డు గ్రహీత మోహన్‌రెడ్డిని సభా స్థలికి ర్యాలీగా తీసుకెళ్తున్న గ్రామస్థులు, పక్కన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి



వరుణ యాగం సందర్భంగా నీరు పోసి పూజలు చేస్తున్న దంపతులు

# మార్కాపురంలో ముగిసిన వరుణ యాగం

### చివరి రోజు సహస్ర జల ఘటాభిషేకం

### భారీగా హాజరైన ప్రజలు

**మార్కాపురం :** వర్షాలు కురవాలని, సాగు, తాగునీటి సమస్య తీరాలన్న సంకల్పంతో మార్కాపురంలో మూడు రోజులపాటు నిర్వహించిన వరుణయాగం ఆదివారంతో ముగిసింది. కంచి, శృంగేరి పీఠాలకు చెందిన మనోహర శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మంటప దేవతాపూజ, మహన్యాస పారాయణ, సహస్రజల ఘటాభిషేకం, వరుణ, మహా మంత్ర అనుష్టానాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఇందులో భాగంగా వేదపండితులు నాభివరకు నీటిలో నిల్చొని వరుణ దేవుని ప్రార్థిస్తూ మంత్రాలు జపించారు. అనంతరం సర్వమత ప్రార్థనలు చేశారు. పూజా కార్యక్రమాల తర్వాత చెన్నకేశవునికి క్షీర, జలాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్నదానం చేశారు. అంతకు ముందు మహిళలు బోణాలతో ఊరేగింపుగా చెన్నరాయునిపల్లి వద్ద ఉన్న యాగశాలకు చేరుకున్నారు. చెన్నకేశవునికి నైవేద్యం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రతువులో ఆర్డీవో పి. కిశోర్, డీఎస్పీ ఎస్.వి. రామాంజనేయులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వక్కలగడ్డ రాధిక, చెన్నకేశవ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథం, మార్కండేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కాళంరాజు శ్యాం సుందర్, ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నయ్య

# వల్లాపల్లిలో విజృంభించిన విష జ్వరాలు

### వంద మందికి పైగా పీడితులు

### పలువురికి గున్యా, డెంగ్యూ లక్షణాలు

### పత్తాలేని వైద్య, ఆరోగ్యశాఖ

### ఆందోళనలో ప్రజలు



**బల్లికురవ :** మండలంలోని వల్లాపల్లిలో విష జ్వరాలు విజృంభించాయి. గ్రామంలో ఇప్పటికే వంద మందికి పైగా మంచం పట్టారు. జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండగా వారిలో కొందరికి డెంగ్యూ, మరికొందరికి గున్యా లక్షణాలు కన్పిస్తుండంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పత్తాలేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కూతవేటు దూరంలో వల్లాపల్లి ఉంటుంది. ఇక్కడి ప్రజలు పది రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నారు. వీరిలో కొందరు కాళ్లు, చేతులు, కీళ్ల నొప్పులు వంటి గున్యా లక్షణాలతో మంచానికే పరిమితమయ్యారు. కొన్నిచోట్ల కుటుంబంలోని సభ్యులందరూ జ్వరాలతో బాధపడుతున్నారు. కొందరు స్థానికంగా చికిత్సలు తీసుకుంటుండగా, మరికొందరు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. గ్రామానికి చెందిన చింతల అమర్‌నాథ్‌రెడ్డి అనే రైతుకు డెంగ్యూ ఉన్నట్లు నిర్ధారణవడంతో ఆయన్ను చికిత్స నిమిత్తం బంధువులు హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం గ్రామంలో వంద మందికి పైగా జ్వరపీడితులు ఉన్నారు. వారం రోజులుగా విష జ్వరాలు విజృంభించి ప్రజలు అల్లాడుతున్నప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పత్తాలేరు. అపరిశుభ్రతే వ్యాధులకు కారణంగా కన్పిస్తోంది.

### పది రోజులుగా బాధపడుతున్నాం



మా ఇంట్లో అందరికీ విష జ్వరాలు సోకాయి. పది రోజుల నుంచి బాధపడుతున్నాం. మంచం నుంచి లేవలేకపోతున్నాం. ఇప్పటి వరకూ వైద్య సిబ్బంది గ్రామవైపు కన్నెత్తి చూడలేదు. ఉన్నతాధికారులైనా స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి.

**- అవిశన సూర్యప్రకాశ్‌రెడ్డి, వల్లాపల్లి**

### పట్టించుకున్న వారు లేరు



మా వీధిలో ప్రతి ఇంట్లో ఇద్దరికి జ్వరాలు ఉన్నాయి. అనేక మందికి కాళ్లూ, చేతులు వాసి కదలలేకపోతున్నారు. తీవ్రమైన జ్వరం, తల నొప్పితో బాధపడుతున్నారు. కొన్ని కుటుంబాలకు మంచానికే పరిమితమమైనా పట్టించుకున్న వారే లేరు.

**- బాదం శేషమ్మ వల్లాపల్లి**

## నీరుపడని బోర్లు పూడ్చివేత

**ముండ్లమూరు :** నీరు పడని బోరు బావులను పూడ్చివేయకపోతే క్రిమికల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ గంగాధరరావు చెప్పారు. ముండ్లమూరులోని పొలాల్లో ఉన్న బోరుబావి గుంతలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు నీరు పడని బోర్లను పూడ్చివేస్తున్నట్లు చెప్పారు. తక్షణమే రైతులు స్పందించి వాటిని పూడ్చివేయాలన్నారు. ఏ రైతు అయిన పూడ్చివేయకుండా ఉంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.వివిధ గ్రామాల్లో దీనిపై దండోరా వేయించినట్టు చెప్పారు. పూడ్చివేతపై అలక్ష్యం చేయకూడదని ఆయన సూచించారు.

## ఇంటర్వ్యూ



బి. చూడామణి, ఈవో పీఆర్డీ, ముండ్లమూరు,

## పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

ప్ర : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

**జ :** గ్రామాల్లో వర్షాలు పడుతున్నందున పారిశుధ్యం మెరుగుదలకు ఆయా గ్రామసర్పంచులతో సమావేశం నిర్వహించాం. కాల్వల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం.

ప్ర : పరిసరాల పరిశుభ్రతకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

**జ :** ఇప్పటికే పెద ఉల్లగల్లు, మారెళ్ళ, ఉమామహేశ్వర అగ్రహారం, ఈదరలో చెత్త కుప్పలను తొలగించాం.

ప్ర : మండలంలో ఎన్ని డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు?

**జ :** ముండ్లమూరులో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశాం.మిగతా పంచాయతీల్లో వాటి ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్నాం.

ప్ర : ఇంటిపన్నుల వసూలు ఎలా ఉంది?

జ : మండలంలో రూ.15లక్షలు ఇంటిపన్ను వసూలు కావలసి ఉంది. అందుకోసం పంచాయతీ కార్యదర్శులతో ప్రతి సోమవారం సమావేశం నిర్వహిస్తున్నాం.

ప్ర : మండలంలో గృహాల జియోట్యాగింగ్ ఎంతవరకూ వచ్చింది?

**జ :** ప్రతి గ్రామంలో ఇంటి యాజమాని వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. ఇక నుంచి ఏ సమాచారమైన ఆన్‌లైన్‌లో చేసుకొవచ్చు. ఇప్పటికే 40శాతం జియో ట్యాగింగ్‌ను పూర్తి చేశాం. **- ముండ్లమూరు**

## నేడు యూటీఎఫ్ సమావేశం

**దర్శి :** స్థానిక గౌతమి గ్రామర్ స్కూల్‌లో సోమవారం సాయంత్రం 5గంటలకు యూటీఎఫ్ మండల సమావేశం ఉంటుందని యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు వి. రామిరెడ్డి తెలిపారు. సమావేశానికి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గోనున్నందున యూనియన్ నాయకులు,ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆయన కోరారు.

## దర్శి సినిమాలు

| | | |
|---|---|---|
| వెంకటేశ్వర | : | ఫిదా |
| శ్రీనివాస | : | లై |
| శివశంకర్ | : | జయ జానికి నాయక |
| భాస్కర్ | : | నేనే రాజు నేనే మంత్రి |

# సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

### ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘుబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘుబాబు

**దర్శి :** అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ఐక్య ఉద్యమాల ద్వారానే పరిష్కరించుకోవడం జరుగుతుందని ఎపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘుబాబు పేర్కొన్నారు. స్థానిక ఎపీటీఎఫ్ జోనల్ కార్యాయలంలో ఆదివారం జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మూడేళ్ళు గడిచినా ఉపాధ్యాయుల, ఉద్యోగుల పీఆర్‌సీ బకాయిలు చెల్లించలేదని చెప్పారు. రూ.398 వేతనంపై పనిచేసిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ బదిలీలు ఇష్టానుసారంగా చేస్తున్నారని విమర్శించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగులకు మంజూరు చేసిన హెల్త్‌కార్డుల ద్వారా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపీటీఎఫ్ ఉపాధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సెల్ సభ్యుడు వై. చౌడిరెడ్డి, ఎపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, ఎస్.రామారావు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రితో భేటీ అయిన రామాపురం సర్పంచ్

## సీఎంతో రామాపురం సర్పంచ్ భేటీ

**దొనకొండ :** రామాపురం సర్పంచ్ కామేపల్లి నారాయణమ్మ, చెంచయ్య ఆదివారం ముఖ్యమంత్రి చాంబర్‌లో చంద్ర బాబునాయుడుతో భేటీ అయ్యారు. మంత్రి శిద్దా రాఘవరావు నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించినట్టు వారు తెలిపారు. రామాపురం గ్రామ సమీపంలో గుండ్లకమ్మ నీరు వృధా అవుతుందని, ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తే దాదాపు వెయ్యి ఎకరాల్లో భూమి సాగులోకి వస్తుందని అందుకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేశామన్నారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుకు హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో కొచ్చర్లకోట మాజీ సర్పంచ్ యోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలలో రిమ్స్ డైరెక్టర్ ప్రచారం



మంత్రితోపాటు ప్రచారం చేస్తున్న రిమ్స్ డైరెక్టర్ మల్లికార్జునశర్మ

**దొనకొండ :** నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తరపున రాష్ట్ర మంత్రి శిద్దా రాఘవరావుతోపాటు జిల్లా రిమ్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ ఎం.మల్లికార్జునశర్మ ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. నంద్యాల పుర వీధుల్లో మంత్రితోపాటు పర్యటించిన ఆయన టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## వృద్ధులకు అన్నదానం

**దర్శి :** దర్శి పట్టణ సమీపంలోని షిర్డీ సాయిబాబా ఆశ్రమంలోని వృద్ధులకు దర్శి పట్టణానికి చెందిన గోసుల నాగేంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం అన్నదానం చేశారు. ఆయన వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుటుంబస సభ్యులు, ఆశ్రమ నిర్వహకులు షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ కార్యవర్గం

**దర్శి :** ఏపీటీఎఫ్ దర్శి మండల శాఖ నూతన కార్యవర్గానికి ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా షేక్ మీరావలి, అధ్యక్షునిగా పి. గోవిందయ్య, ఉపాధ్యక్షులుగా ఎంవీ నరసింహం, షేక్ బాషా, పి. చెంచయ్య, పి. నాగమణి, ప్రధాన కార్యదర్శిగా బి. శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులుగా వి. చక్రధారి, ఎ. రమణారెడ్డి, ఎన్. జాన్, ఎన్. వెంకటేశ్వరరెడ్డి, కేవీ శ్రీదేవి, జిల్లా కౌన్సెలర్లుగా ఎస్. రామారావు, ఎ. శ్రీనివాసులు, వి. రమణయ్య, జి. వేణు, ఎం. శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు, వై. రాజశేఖరెడ్డి, ఎంవీ కృష్ణ, ఎస్. గోవిందయ్య, వై. శ్రీశైలం, జి. సులోచన, డి. గిరి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కె. ప్రసాదరావు, సభ్యులుగా సీహెచ్ బసవయ్య, సీహెచ్ ఎస్‌వీ రమణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## గుంటిగంగలో ప్రత్యేక పూజలు

**తాళ్లూరు :** జిల్లాల్లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గంగమ్మతల్లికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తమను చల్లగా చూడమని వేడుకున్నారు. పలువురు పశుసంపదను గంగమ్మతల్లి చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. పలువురు వాహనచోదకులు పూజలు చేయించగా, మరికొందరు భక్తులు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ పూజారులు ప్రకాష్‌రావు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు చేశారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ చౌడిరెడ్డి

## దర్శిలో ఎన్ఐవోఎస్ పరీక్షలు

**దర్శి :** వయోజన విద్యాశాఖ, జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ(ఎన్ఐవోఎస్) ఆదివారం నిర్వహించిన అక్షరాస్యత పరీక్షకు అపూర్వ స్పందన లభించింది. నియోజకవర్గంలో 5 మండలాల పరిధిలో మొత్తం 2,108 మంది పరీక్షకు హాజరు కావాల్సిఉండగా, 1,890 మంది హాజరైనట్టు వయోజనక విద్యా నియోజకవర్గ సూపర్‌వైజర్ వై. చౌడిరెడ్డి తెలిపారు. కొత్త ఆంజనేయస్వామి వీధి పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని మహిళా సమత సొసైటీ మండల కో-ఆర్డినేటర్ భారతి, కార్యకర్త దిల్ షాద్ పరిశీలించారు. ముండ్లమూరు మండలంలో 560మందికి 540 మంది, కురిచేడు మండలంలో 178 మంది, దొనకొండ మండలంలో 304, తాళ్ళూరు మండలంలో 544 మంది పరీక్ష రాసినట్టు అధికారులు తెలిపారు.

## దేవవరం సర్పంచ్ వెంకటేశ్వర్లు మృతి

**దర్శి :** దేవవరం సర్పంచ్ సానె వెంకటేశ్వరు(55) ఆదివారం మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఆయన తన నివాసంలో మృతిచెందారు. మాజీ ఎంఎల్ఏ నారపుశెట్టి పాపారావు, దర్శి ఎంపీపీ పూసల సంజీవయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మారం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ బి. బాలయ్య, మండల సర్పంచులగా సంఘం అధ్యక్షుడు గొర్రె సుబ్బారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నారపుశెట్టి పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శి మారెళ్ళ వెంకటేశ్వర్లు, బొట్లపాలెం సర్పంచ్ శాగం అంజిరెడ్డి, నాగూర్‌వలి తదితరులు మృతదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు.

## ఘనంగా ఛాయా చిత్ర దినోత్సవం



రాగురే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఫొటోగ్రాఫర్లు

**దర్శి :** దర్శిలో ఛాయా చిత్ర దినోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కెమేరా సృష్టికర్త లూయిస్ జాగ్రూస్ మండే రాగురే చిత్రపటానికి పట్టణ ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్స్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు విద్యాధరరావు పాల్గొన్నారు.

## పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు

**దొనకొండ :**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు మంజూరైన గ్యాస్ కనెక్షన్స్‌ను స్థానిక సాధియా ఇండేన్ గ్యాస్ నిర్వాహకులు ఆదివారం పంపిణీ చేశారు. రూ.4720 చెల్లించిన హెచ్‌ఎంలకు రెండు సిలిండర్లు, రెగ్యులేటర్, పైప్ అందజేశారు. మండలంలో మొత్తం 66 కుకింగ్ ఏజన్సీలకు గాను 62 మంది హెచ్‌ఎంలు గ్యాస్ కనెక్షన్స్ పొందారు. ఈ సందర్భంగా ఎంఈవో ఎన్.సాంబశివరావు మాట్లాడుతూ కుకింగ్ ఏజన్సీలు గ్యాస్ పొయ్యిపై వంట చేసేలా హెచ్‌ఎంలు చర్యలు చేపట్టాలని, కొత్తగా బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంలు వారి బ్యాంక్ అకౌంట్‌లు మార్చుకొవాలని తెలిపారు.

## వివాదాస్పద భూమిని పరిశీలించిన తహసీల్దార్

**వలేటివారిపాలెం:** మండలంలోని తూర్పుపోలినేనిపాలెంలో గత కొన్ని రోజులుగా ఇరువురి మధ్య జరుగుతున్న వివాద భూమిని తహసీల్దార్ ఎస్‌వి సుబ్బారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూత ఇరువురూ వివాదాలకు దిగవద్దని ఇద్దరికి సమన్యాయం చేస్తానని ఆయన తెలియజేశారు. వివాద స్థలాన్ని సర్వే చేయాలని సర్వేయరుకు సూచించారు.

# కౌంటర్ స్టాప్‌లాక్ గేట్ల నిర్మాణంపై నిర్లక్ష్యం

- 16 ఏళ్లుగా పట్టించుకోని అధికారులు
- వరద ఉధృతి పెరిగితే ప్రమాదమే

**లింగసముద్రం:** రాళ్లపాడు ప్రాజెక్టు కొత్తస్పిల్ వే గేట్ల లోతట్టు భాగంలో ఏర్పాటు చేయాల్సిన స్టాప్ లాక్ గేట్ల నిర్మాణాన్ని అధికారులు అటకెక్కించారు. 1994-96 సంవత్సరాలలో రాళ్లపాడు ప్రాజెక్టుకు ఒకే చోట రెండు సార్లు గండ్లు పడ్డ విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం గండి పడిన చోట 5 గేట్లతో ఒక స్పిల్‌వేను నిర్మించారు. ఈ కొత్తస్పిల్‌వేలో మన్నేరుకు నీటి విడుదల కోసం రేడియల్ గేట్లను ఏర్పాటు చేశారు. అయితే ఈ గేట్లు మరమ్మత్తులకు గురైన సమయంలో వాటిని బాగు చేసేందుకు గేట్ల ముందుభాగంలో స్టాఫ్‌లాక్ గేట్ల నిర్మాణానికి అధికారులు కట్టడాలు నిర్మించారు. కానీ చెక్క గేట్లను ఏర్పాటు చేయలేదు. వీటిని స్టాఫ్‌లాక్ గేట్లని పిలుస్తారు. రేడియల్ గేట్లు మరమ్మత్తులకు గురైన సమయంలో ఈ చెక్క గేట్ల ద్వారా నీటి ప్రవాహాన్ని నిలిపి వేసి రేడియల్ గేట్లను బాగు చేస్తారు. అయితే 2000వ సంవత్సరంలో కొత్తస్పిల్‌వే నిర్మాణ పనులు పూర్తికాగా సుమారు 16సంవత్సరాల పాటు స్టాప్‌లాక్ గేట్ల నిర్మాణాన్ని అధికారులు పట్టించుకోలేదు. వాస్తవానికి కొత్తస్పిల్‌వేలోని ఒక్కో రేడియల్ గేట్ల నుంచి సుమారు 30వేల క్యూసెక్కుల వరద నీరు మన్నేరుకు విడుదల చేస్తారు. దీంతో 5 రేడియల్ గేట్ల నుంచి సుమారు లక్ష యాభైవేల క్యూసెక్కుల వరద నీటిని మన్నేరుకు విడుదల చేయొచ్చు. సుమారు 7,8 సంవత్సరాల నుంచి పాతస్పిల్‌వేలోని 10 గేట్ల నుంచి మన్నేరుకు నీటిని విడుదల చేయడం లేదు. ఈ గేట్ల కౌంటర్ వెయిట్లు ప్రమాదకర పరిస్థితిలో ఉండడంతో అధికారులు వీటిని ఉపయోగించకుండా కొత్తస్పిల్‌వేలోని 5 గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు వరద నీరు ఉధృతంగా వస్తే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. సంబంధిత అధికారులు స్పందించి స్టాప్‌లాక్ గేట్లను ఏర్పాటు చేయడంతో పాటు పాతస్పిల్‌వేలోని గేట్లను ఆపరేట్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



కొత్తస్పిల్‌వేలో స్టాప్‌లాక్ గేట్ల ఏర్పాటుకు నిర్మించిన కట్టడాలు


కొత్తస్పిల్‌వేలోని రేడియల్ గేటు

## ట్రిపుల్ ఐటీలో సీటు

**వలేటివారిపాలెం:** మండలంలోని చుండి మోడల్‌స్కూల్‌లో పదవ తరగతిలో 9.7 గ్రేడ్ సాధించిన కామినేని శ్రావణికి ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీ సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఉషశ్రీ తెలిపారు. ఆ విద్యార్థినీని ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు అభినందించారు.

## బోరు బావులన్నీ పూడ్చించాలి

**వలేటివారిపాలెం:** మండలంలోని అన్ని గ్రామాలలో రైతులు తమ పొలాలలో బోర్లు వేసి నీళ్ళు పడకపోవడంతో వదిలేసిన బోరుబావులన్నీ వెంటనే పూడ్చించాలని తహసీల్దార్ ఎస్‌వి సుబ్బారావు తెలిపారు. ఆ నేపథ్యంలో విఆర్‌ఓలందరూ పొలాల్లోకి వెళ్ళి బోరు బావులను గుర్తించి పూడ్చేలా చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు.

## టెలీకాన్ఫరెన్స్‌కు హాజరుకావాలి

**వలేటివారిపాలెం:** మండలంలోని నాలుగు కాంప్లెక్స్‌లలో సోమ, మంగళ వారాల్లో జరగనున్న టెలికాన్ఫరెన్స్ కార్యక్రమానికి పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరూ తప్పక హాజరుకావాలని ఇన్‌ఛార్జ్ ఎంఈఓ కాంతారావు తెలిపారు. సోమవారం సగం మంది ప్రధానోపాధ్యాయులు, మిగిలిన సగం మంది ప్రధానోపాధ్యాయులు మంగళవారం హాజరుకావాలన్నారు. ఆయా కాంప్లెక్స్‌లలో టెలికాన్ఫరెన్స్ అందుబాటులో లేకపోతే వలేటివారిపాలెం ఎంఆర్‌సికి హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

## ● సినిమాలు

### కందుకూరు

| | |
|---|---|
| రాజ్ | - ఫిదా |
| యువరాజ్ | - వైశాఖం |
| ప్రశాంతి | - ఆనందోబ్రహ్మ |
| కోటేశ్వర | - నేనే రాజు నేనే మంత్రి |
| రాఘవ స్క్రీన్-1 | - జయ జానకి నాయక |
| రాఘవ స్క్రీన్-2 | - లై |

## దారకానిపాడు వద్ద ఇసుక రీచ్‌ని అడ్డుకున్న స్థానికులు


ట్రాక్టర్లను మన్నేరులో నిలిపివేసి ఉన్న దృశ్యం


ఆందోళన చేస్తున్న దారకానిపాడు గ్రామస్తులు

**కందుకూరు :** గుడ్లూరు మండలం దారకానిపాడు వద్ద మన్నేరులో ఉన్న ఇసుకరీచ్‌లో ఇసుక తవ్వకాలను ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. రాళ్లపాడు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రైతులు, దార కానిపాడు గ్రామ యువకులు మన్నేరులోని ట్రాక్టర్లకు ఇసుక పోయకుండా అడ్డుకుని ఆదివారం ఆందోళన నిర్వహించారు. నూతన ఇసుక విధానంలో మన్నేరులో దారకానిపాడు వద్ద ఇసుక నిల్వలు ఉన్నట్లు గుర్తించిన మైనింగ్, రెవిన్యూ శాఖ అధికారులు అధికారిక ఇసుకరీచ్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. కందుకూరు చుట్టపక్కల వారు తమ అవసరాలకు ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లతో ఇక్కడి నుండి ఇసుక తీసుకెళ్లవచ్చునని చెప్పటంతో కొంతకాలంగా దారకానిపాడు వద్ద నుంచి ఇసుక తీసుకెళ్తున్నారు. అయితే ప్రభుత్వం గుర్తించిన ఇసుక పరిమాణం కన్నా అనేక రెట్లు ఎక్కువగా ఇప్పటికే తవ్వుకుని తీసుకెళ్లినందున ఇక్కడ ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. దారకానిపాడు వద్ద మన్నేరులో 700 యూనిట్లు ఇసుక ఉందని గుర్తించిన అధికారులు ఆ మేరకు తీసుకెళ్లవచ్చని ప్రకటించగా ఇప్పటికే ఇక్కడి నుండి 10వేల యూనిట్లుకి పైగా తరలిపోయిందని దీంతో ఈ ప్రాంతంలోని బోర్లు, మంచినీటి పథకాలు కూడా నీరు లేక ఎండిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం ఇక్కడ ఇసుక తవ్వకాలను నిలిపివేయించి మరో ప్రాంతంలో అధికారిక రీచ్‌ని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ దారకానిపాడు గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. మన్నేరులో ట్రాక్టర్లకు ఇసుక పోయనివ్వకుండా అడ్డుకోవటంతో పాటు రోడ్డుపై అడ్డంగా మోటారు సైకిళ్లు ఉంచి ఆందోళన నిర్వహించారు. రాళ్లపాడు పరిరక్షణ కమిటీ కన్వీనర్ కాకుమాని మాధవరావు ఆధ్వర్యంలో దారకానిపాడు గ్రామస్తులు ఈ ఆందోళన నిర్వహించారు.

## సాహిత్య సేవలో 'మహతి' కృషి అభినందనీయం


మాట్లాడుతున్న గుడ్లూరి వెంకన్న కవి

**కందుకూరు :** తెలుగు పలు కుబడిలో కరుణరసాన్ని పండించిన కవి కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి అని ప్రముఖ కవి, విమర్శకులు గుడ్లూరి వెంకన్న కవి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మహతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి అమిరిశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సాహితీ స్రవంతి కార్యక్రమంలో గుడ్లూరి వెంకన్న కవి పాల్గొని జంధ్యాల పాపయ్య శాస్త్రి గొప్పతనాన్ని ఆయన కవితా ధోరణులను వివరించారు. విశ్రాంత ప్రధానో పాధ్యాయుడు ఐవీ మల్లిఖార్జునరావు మాట్లాడు తూ సాహిత్య పరిమళాలు వెదజల్లే కవి పుష్పాలు కందుకూరులో ఉన్నారన్నారు. మధురకవి మల్లవరపు జాన్ రచించిన సూక్తి శతకంపై జివి రాఘవరావు సమీక్ష చేస్తూ కత్తి కంటే కలం మిన్న అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు తమ కవితలతో సభను అలరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ సేవాసంస్థ నిర్వాహకులు తన్నీరు బాలాజీ, వి.వి.శేషయ్య, వెంకటస్వామి, భాస్కర శర్మ, సుబ్బారావు, సరస్వతి, సరోజిని, డా.అంకయ్య, శేషగిరి, మాల్యాద్రి, రవి, దాసు, ఆదినారాయణ, నాగేశ్వరరావు, అమీర్ బాషా, కృష్ణకుమార్, శ్రీనివాస మూర్తి, శిరోమణి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**లింగసముద్రం:** దివ్యాంగుల సంక్షేమ కోసం ప్రభుత్వం రూపొందించిన దివ్యాంగుల చట్టం 2016ను దివ్యాంగులందరూ అవగాహన చేసుకోని ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు కృషి చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం మాలకొండారెడ్డి చెప్పారు. ఆదివారం మొగిలిచర్లలో దివ్యాంగుల 2016 చట్టంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ చట్టాన్ని అందరికి తెలిసేలా తెలుగులోకి అనువాదం చేసి ముద్రించేలా కృషి చేసిన అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావుకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెన్నపూస వెంకటేశ్వర్లు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## రేపు మాలకొండ హుండీ లెక్కింపు

**వలేటివారిపాలెం:** మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి హుండీ లెక్కింపు కార్యక్రమం ఈ నెల 22వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు మాల్యాద్రి అతిథి భవనంలో జరగనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, దేవస్థానం ఛైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రిలు ప్రకటనలో తెలియజేశారు.

## కుకింగ్ ఏజెన్సీలకు గ్యాస్ కొనివ్వాలి

**వలేటివారిపాలెం:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కుకింగ్ ఏజెన్సీలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్కూల్ ఫండ్‌లో గ్యాస్ కనెక్షన్ కొనివ్వాలని ఇన్‌ఛార్జ్ ఎంఈఓ కాంతారావు తెలిపారు. ఈ నెల 22నుండి అన్నీ పాఠశాలల్లో గ్యాస్ పైనే వంట తయారు చేయాలని ఆయన సూచించారు. గ్యాస్‌పై వంట తయారు చేయని నిర్వాహకులు, హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు.

## 39 పాఠశాలలకు వంటగ్యాస్ కనెక్షన్లు పంపిణీ

**గుడ్లూరు:** మండలంలోని 39 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు వంట గ్యాస్ కనెక్షన్లు ఎంఈఓ సి కల్లయ్య ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక హెచ్‌పి గ్యాస్ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన వంట గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. మొత్తం 56 పాఠశాలలకు వంట గ్యాస్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోగా ప్రస్తుతం 39 పాఠశాలలకు మంజూరు కాగా మిగతా 17 పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు కానున్నట్లు ఎంఈఓ సి కల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమోహన్, జి.మధు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

**లింగసముద్రం:** వెలుగు, డిఆర్‌డిఏ, ఇజిఎంఎం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంప్యూటర్ శిక్షణకు యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని జాబ్స్ జెడిఎం రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణకు పదవ తరగతి ఇంటర్మీడియట్, డిగ్రీ చదివి ఉండి 18 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల లోపు వారు అర్హులని ఆయన చెప్పారు. ఈ కంప్యూటర్ శిక్షణాకాలం మూడు నెలల పాటు ఉంటుందని శిక్షణా కాలంలో అభ్యర్థులకు ఉచిత హస్టల్ వసతితో పాటు భోజన సౌకర్యం కూడా ఉంటుందన్నారు. ఈ ట్రైనింగ్ సెంటర్‌లు కందుకూరు, ఒంగోలులో కూడా ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మిగిలిన వివరాలకు 9052788200 నంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

## మాస శివరాత్రి సందర్భంగా అన్నదానం

**కందుకూరు :** మాస శివరాత్రి సందర్భంగా స్కంధపురి సోమేశ్వరాలయంలో ఆదివారం విశేష పూజలు, అభిషేకం నిర్వహించి పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాలడుగు రామస్వామి, రమణమ్మ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ చీతిరాల గోపాల్, పూజారి కుమారి స్వామి, చెక్కా వెంకట కేశవరావు తదితరులు పాల్గొన్నారు.


స్కంధపురి సోమేశ్వరాలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

## పాఠశాలలకు గ్యాస్ సిలిండర్ల అందజేత

**సింగరాయకొండ రూరల్:** పట్టణంలోని స్థానిక శివసాయి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో ఆదివారం డీఎస్‌వో టి.వెంకటేశ్వర్లు, ఎంఈవో బి.శివన్నారాయణ మండలంలోని 49 ప్రాథమిక పాఠశాలలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు 7 సిలిండర్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్యాస్ డీలర్ ఎం.విజయలక్ష్మి, పాకల జనరల్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లూరి వెంకయ్య, అంబటి బ్రహ్మయ్య, ఎన్.నరసింహరావు, వై.భగీరధరావు, మాలపాటి ప్రభాకర్‌రెడ్డి, పట్టణ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు దుంప భారతి పాల్గొన్నారు.

## 23న మెగా జాబ్‌మేళా

**సింగరాయకొండ రూరల్:** పీఎస్‌సీపీ కళాశాలలో బుధవారం ఎమ్మెల్యే డా.డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి సహకారంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌ఎస్‌డీసీ), పీఎస్‌సీపీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 23వ తేదీ బుధవారం మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ మెగా జాబ్‌మేళా కార్యక్రమం పీఎస్‌సీపీ విద్యాసంస్థల నందు ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు కొనసాగుతుంది. జాబ్‌మేళాలో వివిధ రంగాలకు చెందిన కంపెనీలు పాల్గొనున్నాయి. పదవ తరగతి పాస్, ఫెయిల్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్ పూర్తి చేసిన వారు ఈ మేళాలో పాల్గొని మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే స్వామి తెలిపారు. ఎంపికైన వారికి కనీసం జీతం నెలకు రూ.9 వేల నుంచి రూ.18వేల వరకు పొందే అవకాశముంటుంది. జి ల్లాలో ఉన్న 18 నుంచి 30 సంవత్సరాల లోపు వారు ఈ అవ కాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు. యువతీ యువకులు ఆధార్‌కార్డు జిరాక్స్, బయోడేటా ఫారాలు అందజేయాలని కోరారు. వివరాలకు 18004252422కు సంప్రదించాలన్నారు.

# రాకపోకలకు అంతరాయం

- ఆర్‌అండ్‌బీ సీసీ రోడ్డు నిర్మాణంతో ఇబ్బందులు
- గాయాలపాలవుతున్న వాహనదారులు
- వాహనాలకు డ్యామేజీ
- పట్టించుకోని అధికారులు



పెరిదేపిలో ఒకవైపు సీసీ రోడ్డు వేస్తుండటంతో ఒకవైపునే ప్రయాణిస్తున్న వాహనాలు

**పెరిదేపి (కొండపి):** మండలంలోని పెరిదేపి గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డును సీసీ రోడ్డుగా మార్చే కార్యక్రమం దాదాపు రెండు నెలలుగా జరుగుతూనే ఉంది. రోడ్డులో ఒకవైపు సీసీ రోడ్డు అరకొరగా వేశారు. మరో వైపు వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. సీసీ రోడ్డు నిర్మాణ కార్యక్రమం నత్త నడకన సాగుతున్నది. దీంతో రోడ్డులో వాహనాలన్నీ ఒకవైపునే తిరుగుతున్నాయి. గత పక్షం రోజులుగా అరకొరగా కురుస్తున్న వర్షాలకు వాహనాలు తిరిగే వైపు రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. భారీ వాహనాలు, ద్విచక్రవాహనాలు అన్నీ ఒకేవైపు నడవాల్సి రావడంతో పలువురు ద్విచక్రవాహన దారులకు వేసిన సీసీ రోడ్డులో నుంచి వెలుపలకు వచ్చిన చువ్వలు గుచ్చుకుని గాయపడ్డారు. పలు కార్లకు చువ్వలు గీసుకుపోయి నష్టం జరిగింది. వర్షాలకు ఏర్పడ్డ గుంతలతో వాహనాలు తిరిగే వీలు లేకుండాపోయింది. వాహన యజమానులు అల్లాడిపోతున్నారు. కనీసం గుంతలకు మట్టి కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు వేయలేదని వాహనదారులు వాపోతున్నారు.

మట్టి తోలకుండా వదిలేసిన కారణంగా వాహనాలు తిరిగే వీలు లేకుండాపోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు పూర్తయ్యే వరకు రోడ్డులో ఏర్పడ్డ గుంతలకు మట్టితోలాలని వాహనదారులు ఆర్‌అండ్‌బీ అధికారులను కోరుతున్నారు.

### గుంతలతో ఇబ్బందులు



మోటార్ సైకిస్టులు పలువురు గాయాల పాలయ్యారు. సీసీ రోడ్డులో నుంచి వెలు పలకు వచ్చిన చువ్వలు గుచ్చుకుంటున్నాయి. దీనికితోడు గుంతలు కారణంగా ప్రయాణించాలంటే ఇబ్బందికరంగా ఉంది. అధికారులు గుంతలకు తాత్కాలికంగా మెరకతోలకపోతే వాహనాలు తిరిగే వీలులేదు. - పి.బ్రహ్మయ్య,మోటార్ సైకిస్టు

## అణగారిన వర్గాల రాజ్యాధికారమే లక్ష్యం

**సింగరాయకొండ రూరల్:** పట్టణంలోని బహుజన చైతన్య యాత్రలో భాగంగా బహుజన రాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నక్కల వీరాంజనేయులు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, కృష్ణా జిల్లాలోనే బహుజన చైతన్య యాత్రల్లో భాగంగా ఆదివారం సింగరాయకొండకు రావడం జరిగిందన్నారు. ఈ చైతన్య యాత్ర ముఖ్య లక్ష్యం బహుజన రాజ్యం పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్ళి బలోపేతం చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింల రాజ్యాధికారం సాధించాలని ఉద్దేశంతో ఈ బహుజన యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ఈ పార్టీ 2019 ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని స్థానాలలో పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో ముస్లింలు, దళితులపై దాడులు పెరుగుతున్నాయని దాడులను ఎదుర్కోవాలంటే మనం ఏకం కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి షేక్ ఖాశిం, అంబేద్కర్ పీపుల్ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి కొండలరావు, కార్యదర్శి షేక్ అబ్దుల్ సత్తార్, ఎర్రమాల సుబ్బారావు, జమ్ములమడుగు రామకోటయ్య, మెడిసెల కోటయ్య, అంబటి తేజ, దాచూరి కొండయ్య పాల్గొన్నారు.

# పొందూరు పొలిమేర వాగుకు జలకళ



నీటితో నిండిన పొలిమేరవాగు

**పొందూరు(టంగుటూరు) :** మండలంలోని పొందూరులో పొలిమేర వాగుకు జలకళ వచ్చింది.ఇటీవల కురుస్తున్న వర్షాలకు పొలిమేవాగులో నీరు చేరింది.వాగు చుట్టూతా ఉన్న రైతులు ఆనంతం వ్యక్తం చేస్తున్నారు. పొందూరు రైతులు గత నెలలో నీరు చెట్టు పథకంలో పొలిమేరవాగును అభివృద్ధి చేశారు.పొలాల్లో పశువులకు త్రాగు నీటి అవసరాలు,పొగమొక్కలు వేసే సమయంలో నీటి ఇబ్బందులను ఈ వాగునీరు తీర్చగలదని చుట్టుప్రక్కల పొలాల రైతులు ఆశించారు.

రైతుల అవసరాల నిమిత్తం నీరు చెట్టులో వాగును అభివృద్ధి చేశారు. వాగు 800 మీటర్ల పొడవున,4మీటర్ల వెడల్పున, 7అడుగుల లోతున తవ్వారు. ప్రస్తుతం 5అడుగుల నీరు చేరింది.పొందూరు,కొణిజేడు పొలిమేరలో పొందూరు పరిధిలో ఉండే ఈవాగులో వర్షాల సందర్భంగా పొలాలలోని నీరు ఈవాగులోకి చేరింది.వాగు నేరుగా ఇనగలేరులో కలుస్తుంది.వాగుకు నీరు రావడం పట్ల నీరు చెట్టు లక్ష్యం నెరవేరిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఐతా రామయ్యశెట్టి సత్రం నిర్మాణానికి రంగం సిద్ధం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

**సింగరాయకొండ రూరల్:** ఐతా రామయ్యశెట్టి సత్రం, షాపుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని ఎమ్మెల్యే స్వామి తెలిపారు. పట్టణంలోని ఐతా రామయ్యశెట్టి సత్రం నిర్మాణ విషయమై ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి, ప్రజాప్రతినిధులు, ఆర్డీవో మల్లికార్జునరావు నాయుడుపాలెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో చర్చించారు. సమావేశంలో ఆర్డీవో మల్లికార్జునరావు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్మించాలని, అవసరమైతే మాలకొండ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నుంచి నిధులు అప్పుగా తీసుకొని సత్రం నిర్మాణం కోసం ప్రతి పాదనలు పంపుతామని ఆయన తెలిపారు. ఈ సత్రం నిర్మాణానికి రూ.2కోట్ల 95 లక్షలతో 42 షాపులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఆమోదం జరిగిన తరువాత నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామని అదేవిధంగా సింగరాయకొండ ఇనాం భూముల గురించి శాసనసభలో ప్రస్తావించామన్నారు. దేవాదాయ శాఖల వారు నివేదికలు కోరి ఈ నివేదికలో భూములు చాకిరి మాన్యాలుగా ఉన్నప్పటికీ దేవస్థానం ఆధీనంలో లేవు. దీనిలో క్రయవిక్రయాలు జరిగివున్నవి అని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి అంశాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నందున దీనిపైన మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. వరాహలక్ష్మీనర సింహస్వామి ఆల య కార్యనిర్వాహణాధికారి యడ్లపల్లి భైరాగి చౌదరి మాట్లాడుతూ ఈ సత్రం పనులు నిర్మాణమైతే జిల్లాలోని పెద్ద దేవాలయాలు ఏవైనా ఉంటాయో అక్కడి నుంచి నిధులు అప్పుగా తీసుకోవచ్చు. లక్ష్మీనరసింహస్వామి దేవాలయంకు సంబంధించి అకౌంట్‌లో అంత మొత్తంలో నగదు లేవు కాబట్టి ఎమ్మెల్యే సహకారంతో ఈ సత్రం నిర్మించేందుకు ప్రతి పాదనలు పంపిస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఇది ప్రధాన కూడళ్లలో ఉన్నందున అటు బస్టాండ్ ఇటు రైల్వే స్టేషన్ దగ్గరగా ఉండడంతో ప్రయాణికులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని ఆయన తెలిపారు. శ్రీనివాసులు నాయుడు, కూనపరెడ్డి సుబ్బారావు, బచ్చు కోటేశ్వరరావు, మురళీకుమార్, మండల ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి





సర్పంచ్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం

**సింగరాయకొండ రూరల్:** ఊళ్ళపాలెం గ్రామంలో మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుంజి రామకృష్ణయ్య ఆదివారం ఉపాధ్యాయ సిబ్బంది పాఠశాలలో ఆగస్టు మొదటి వారం నుంచి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి అని పిల్లల బయట తిరిగే పిల్లలను చేర్పించేందుకు ప్రభుత్వ పాఠశాలలు ముద్దు- ప్రవేటు పాఠశాలలు వద్దు అంటూ నినా దాలతో ఊళ్లపాలెం గ్రామ సర్పంచ్ ఆరేటి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో భవిష్యత్‌కు, విద్యకు హామీ ఇస్తూ నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో సిబ్బందితో పాటు సర్పంచ్ తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో 16 మంది విద్యార్థినీవిద్యార్థులను చేర్పించిన సందర్భంగా మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సర్పంచ్ ఆరేటి లక్ష్మీనారాయణను ఘనంగా అభినందించారు.

పాఠశాల అభివృద్ధి పట్ల ఆయన చూపిన చొరవకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పరిణి శ్రీను, పంచాయతీ వార్డు మెంబర్లు, తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే స్వామికి వివాహ శుభాకాంక్షలు



శుభాకాంక్షలు చెప్తున్న సర్పంచ్‌లు

**తూర్పునాయుడపాలెం(టంగుటూరు) :** ఎమ్మెల్యే స్వామి, రాజేశ్వరి దంపతులకు మహిళా సర్పంచ్‌లు ఆదివారం వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఎం.నిడమలూరు, మర్లపాడు, కాకుటూరివారిపాలెం సర్పంచ్‌లు పిడుగురాళ్ల గోవిందమ్మ, కొమ్ము రమాదేవి, లింగాల సంజీవ తూర్పు నాయుడపాలెంలోని ఎమ్మెల్యే స్వగృహంలో నూతన దంపతులను కలి ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు పిడుగురాళ్ల సురేష్, కొమ్ము వెంకట్రావు, లింగాల బాలకోటయ్య ఉన్నారు.

**సింగరాయకొండ రూరల్:** సోమరాజుపల్లి సర్పంచ్ పొనుగోటి చెంచమ్మ, జడ్పీటీసీ పొనుగోటి ఎస్తేరమ్మ, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు పొనుగోటి కొండయ్య, సుబ్బారావులు ఎమ్మెల్యే శ్రీడోలాబాలవీరాంజనేయస్వామిని కలిసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట మార్కెట్ యార్డు డైరెక్టర్ భైరపనేని సుబ్రమణ్యం ఉన్నారు.

# ఎన్ఐవోఎస్ కేంద్రాన్ని పరిశీలించిన డీడీ



వయోజన విద్య పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీడీ నారాయణమ్మ

**ఉలవపాడు** : మండలంలోని వీరేపల్లి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ పాఠశాలలో వయోజనులకు జాతీయస్థాయి ప్రాథమిక అక్షరాస్యతా పరీక్ష (ఎన్ఐఓఎస్) కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఆదివారం వయోజన విద్య జిల్లా డిప్యూటి డైరక్టర్ ఎంవిఎల్ నారాయణమ్మ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పదిహేనేళ్లు పైబడిన నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారేందుకు చేస్తున్న అభ్యాసంలోని అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలందరూ చదువుకోవాలని, అక్షరజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తద్వారా ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకుని ప్రయోజనం పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డివిజనల్ సూపర్‌వైజరు ఓ.నారాయణరావు, సాక్షరభారత్ మండల కో ఆర్డినేటర్ వై. యేసోబు, అంగన్‌వాడీ కార్యకర్త ఎం. ప్రసన్న, సాక్షరభారత్ గ్రామ కో ఆర్డినేటర్లు, అభ్యాసకులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

**ఉలవపాడు** : ఉలవపాడు మండలం పెద పట్టపుపాలెం గ్రామానికి చెందిన పోలంగారి పోలయ్య (35) అనే యువకుడు ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో పోలయ్య రొయ్యల చెరువుల వద్ద పరిశీలన చేస్తుండగా కట్టపై ఉన్న విద్యుత్ తీగ కాలికి తగలటంతో షాక్‌కి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలయ్య మృతితో ఆయన కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. ఉలవపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

## నేడు హెచ్ఎంలకు టెలీకాన్ఫరెన్స్

**లింగసముద్రం** : మొగిలిచర్ల, లింగసముద్రం, విఆర్‌కోట, పెదపవని గ్రామాలలోని జడ్పీ హైస్కూళ్లలో సోమ, మంగళవారాల్లో జరిగే టెలికాన్ఫరెన్స్‌కు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరు కావాలని ఎంఈవో టీవీఎల్ కాంతారావు ఆదివారం చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే ఈ టెలికాన్ఫరెన్స్‌కు ప్రధానోపాధ్యాయులు మొదటి రోజు సగం మంది, రెండవ రోజు సగం మంది హాజరు కావాలని ఆయన కోరారు. అలాగే ఈ నెల 22 నుంచి అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని గ్యాస్‌పైనే వండేందుకు రేపటితో ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని ఆయన చెప్పారు.

## వేడుకగా గంధ మహోత్సవం

**పామూరు** : ఇనిమెర్లలోని 18వ గంధ మహోత్సవాన్ని హిందూ, ముస్లిం భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా దర్గాను రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. హిందూ, ముస్లిం భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. స్వామివారి జండాను, గంధాన్ని మేళతాళాలతో తీసుకెళ్లారు. ఫకీర్ల గానా బజానాలతో స్వామి వారి దర్గా వద్దకు తీసుకెళ్లి గంధము, తాంబూలాన్ని భక్తులకు పంచిపెట్టారు. దర్గా కమిటీ భోజన వసతి కల్పించింది.

## రోడ్డు ప్రమాదంలో 13 మందికి గాయాలు



నుజ్జునుజ్జయిన వాహనం

**ఉలవపాడు** : ముందు వెళ్తున్న లారీని వేగంగా వస్తున్న కారు వాహనం ఢీకొనటంతో 13 మందికి గాయాలైన సంఘటన జాతీయ రహదారిపై ఉలవపాడు దక్షిణ బైపాస్ జంక్షన్‌లో ఆదివారం వేకువజామున జరిగింది. ఈ ప్రమాదంలో దర్శి మండలం బొట్లపాలెం గ్రామానికి చెందిన వారు గాయపడ్డారు. తిరుమలలో వివాహం చేసుకుని తిరిగి వస్తున్న కుటుంబం, వారి బంధువులు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. అదృష్ట వశాత్తు నూతన దంపతులు మక్కెన నాగరాజు, లక్ష్మీ తిరుపతమ్మ స్వల్ప గాయాలతో బయటపడగా వారి బంధువులైన సుబ్బారావు, మరో వ్యక్తి నాగరాజుకి తీవ్ర గాయాలయ్యాయి.

ఈ ప్రమాదంలో ఇంకా రమణమ్మ, అంజలి, తేజ, శ్రీనివాసులు,విజయలక్ష్మి, నవీన్, నాగమణి, లక్ష్మి, కారు డ్రైవర్ రమణా రెడ్డిలకు గాయాలయ్యాయి. డ్రైవర్ నిద్ర మత్తులో ముందు వెళ్తున్న లారీని గుర్తించ లేనందునే ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. గాయపడిన వారిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. ఉలవపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అలంకారప్రాయంగా బస్‌స్టేషన్

**వలేటివారిపాలెం:** మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో నిర్మించిన బస్‌స్టేషన్ నిరుపయోగంగా మారింది. దీంతో లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనం వృధా అయింది. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో గ్రామీణ ప్రాంతాలలోని ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రంలో బస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. అధికారుల పాలకుల నిర్లక్ష్యం కారణంగా బస్‌స్టేషన్ అలంకారప్రాయంగా మారింది. అప్పట్లో ప్రధాన కూడలిలో ప్రభుత్వ స్థలం లేకపోవడం, దీనికి తోడు అధికారులలో నెలకొన్న అవగాహనలోపంతో బస్‌స్టేషన్ ఊరిబయట నిర్మించారు. అప్పటి నుంచి ఆ భవనం నిరుపయోగమైంది. అటువైపు ప్రయాణికులు కన్నెత్తి కూడా చూడడం లేదు. ప్రధాన కూడలిలోనే ప్రయాణికులు బస్సు ఎక్కుతున్నారు. బస్‌స్టేషన్‌లోనే ప్రయాణికులు ఎక్కించడం, దించడం చేసి ప్రయాణికులతో బస్‌స్టేషన్ కళకళలాడాలని ఆర్టీసి అధికారులు విశ్వప్రయత్నం చేశారు. అయినప్పటికి ఫలించలేదు. దీంతో బస్ స్టేషన్ వినియోగంలో లేక విద్యుత్ మోటార్లు అపహరణకు గురయ్యాయి. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారాయి. ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా ఆర్టీసి అధికారులు ప్రయాణికులకు అన్ని వసతులు సమకూర్చి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం చేస్తే బస్‌స్టేషన్ వినియోగంలోకి వస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

## ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ర్యాలీ




ప్లాస్టిక్‌కి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ర్యాలీ

**కందుకూరు** : ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం, ఇతర ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆదివారం కందుకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ బ్యాగులు వద్దు - జ్యూట్ బ్యాగులు ముద్దు నినాదంతో స్థానిక కోవూరు రోడ్డులోని ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నుంచి పెద్ద బజారులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డా. తన్నీరు మల్లిఖార్జున ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్ధాలను, తలెత్తే ఆరోగ్య సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో వాసవీ సేవాదళ్ కోశాధికారి చెక్కా వెంకట కేశవరావు, స్కంధపురి సోమేశ్వరాలయ ఛైర్మన్ చీతిరాల గోపాల్, ఇస్కాల మధు, ఎస్‌పిజి మార్కెటింగ్ ఎండి ఎంవి బుచ్చయ్య గుప్తా, కార్తీక్, మనోహర్, తేజారెడ్డి, ఫణీంద్ర కుమార్, నవీన్, సురేంద్ర, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైటెన్షన్ విద్యుత్ తీగల పట్ల ఆందోళన

**లింగసముద్రం:** చినపవని గ్రామం ఎస్సీ కాలనీలో గుండా 11కేవి హైటెన్షన్ విద్యుత్ తీగలు వెళుతుండడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం కాలనీకి వెలుపల గల పొలాల్లో గుండా వేయాల్సిన విద్యుత్ తీగలను అప్పట్లో అధికారులు, కాంట్రాక్టరు ఎస్సీ కాలనీలో గుండా హైటెన్షన్ విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారని వారు చెప్పారు. ఈ హైటెన్షన్ విద్యుత్ తీగలు ఇళ్ళకు సమీపంలో చేతికందే ఎత్తులో వెళుతుండడంతో వారు తీవ్ర భయకంపితులవుతున్నారు. గతంలో ఈ హైటెన్షన్ విద్యుత్ తీగలు మూడుసార్లు తెగి కిందపడ్డాయని అయితే అప్పట్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద గృహాలు నిర్మించుకోవాలన్నా తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని చెప్పారు. ఇళ్ల స్లాబ్ వేసుకోవాలంటే విద్యుత్ అధికారులకు తెలియజేసి వారి ద్వారా సరఫరా నిలిపివేయాల్సి వస్తుందన్నారు. ఇటీవల ఎమ్మెల్యే పోతుల రామారావును కలిసి ఈ తీగలను పొలాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

## ప్రశాంతంగా వయోజనుల పరీక్షలు



జరుగుమల్లిలో పరీక్షలు రాస్తున్న వయోజనులు

**జరుగుమల్లి** : అక్షరాస్యత పెంపులో భాగంగా సాక్షర భారతి ఆధ్వర్యంలో ఆది వారం జరిగిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ పరీక్షలకు 836 మంది హాజరయ్యారు. చిరికూరపాడు కేంద్రాన్ని సందర్శించిన మండల కోఆర్డినేటర్ మాట్లాడుతూ మండలంలోని 20 పంచాయతీల్లో 7వ ఫేజ్ లో మొత్తం 860 మంది ఉండగా 836 మంది హాజరయ్యారని మండల సాక్షర భారతి కోఆర్డినేటర్ బెల్లం ప్రవీణ్ తెలిపారు. పరీక్షలకు సంభందించిన జవాబు పత్రాలను మండల విద్యా కేంద్రాలలో ఇవ్వనున్నట్లు వివరించారు.

**సింగరాయకొండ రూరల్:** మండలంలోని వయోజనులకు ఎన్ఐఓఎస్ పరీక్షలు ఆదివారం పాకల, కనుమళ్ళ, కలికవాయలో నిర్వహించారు. ఈ పరీక్షలకు జనశిక్షణ సంస్థ డైరెక్టర్ కె శ్యాంసునీల్ స్టేట్ పరిశీలకునిగా అడల్ట్ ఎడ్యుకేషన్ కందుకూరు ఏపిఓ పి ప్రసాదరావు ఈ పరీక్షలను తనిఖీ చేశారు. ఈ పరీక్షలకు మొత్తం వయోజనుల సంఖ్య 284 మందికి గాను 232 మంది హాజరయ్యారని సాక్షరభారతి మండల కో ఆర్డినేటర్ చిమట సుధాకర్ తెలిపారు. వీరి వెంట విసిఓలు అరుణ, క్రాంతి , రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభం వేయనిదే బిల్లులు చెల్లించం



బిల్ కలెక్టర్‌కు విద్యుత్ బిల్లులు ముప్పవరం గ్రామస్తులు

**ముప్పవరం (కొండపి):** విద్యుత్ స్తంభం వేయనిదే బిల్లులు చెలించబోమని ముప్పవరం గ్రామస్తులు విద్యుత్ బిల్లులు వసూలు చేయడానికి వచ్చిన బిల్ కలెక్టర్‌ను నిలదీశారు. ఆదివారంనాడు 'ఇక్కడ వెదురు బొంగే విద్యుత్ స్తంభం' అనే శీర్షికన గ్రామంలో బొంగుకు విద్యుత్ మెయిన్‌లైన్లను కట్టిన వార్తను ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. సరిగ్గా ఆదివారంనాడే విద్యుత్ బిల్లులు వసూలు చేసేందుకు బిల్ కలెక్టర్ గ్రామంలోని శివాలయంలో కూర్చున్నాడు.

గ్రామస్తులంతా ముక్తకంఠంతో విద్యుత్ స్తంభం వేయనిదే బిల్లులు చెలించబోమని ముక్తకంఠంతో అన్నారు. మూడునెలలుగా విద్యుత్ మెయిన్ లైన్ తీగలు వెదురు బొంగుకు కడితే మీకు కనిపించలేదా? అని గ్రామస్తులు ప్రశ్నించారు. ఇంతలో విద్యుత్ హెల్పర్ అక్కడకు చేరుకుని సిబ్బంది తగినంత మంది లేరని అందువల్లనే జాప్యం జరుగుతున్నదన్నారు. 8 గ్రామాలకు ఒకరే పని చేస్తున్నారని ఆయన తెలిపారు. విద్యుత్ స్తంభం వేశాకే బిల్లులు చెల్లించేదని గ్రామస్తులు తెగేసి చెప్పారు. దీంతో చేసేది లేక ఈ విషయాన్నే అధికారులకు తెలియపరుస్తానని బిల్ కలెక్టర్ వెనుదిరిగి వెళ్లారు.

## బ్రాహ్మణుల అభ్యున్నతికి ప్రత్యేక పథకాలు

**కనిగిరి టౌన్ :** బ్రాహ్మణ కార్పొరేషన్ అందించే రాయితీ రుణాలను పేద బ్రాహ్మణులు వినియోగించుకోవాలని కార్పొరేషన్ కో ఆర్డినేటర్ పరసు సత్యగోపాల్ కోరారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు కోసం కశ్యప పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. దీనిద్వారా ప్రతి నెలా రూ. 1000లు పింఛన్ లభిస్తోందన్నారు. గాయత్రి పథకం ద్వారా స్కూల్ ఫస్ట్‌వచ్చిన విద్యార్థికి 10వ తరగతి నుంచి పీజీ వరకు రూ. 10 నుండి 30వేల వరకు ప్రోత్సాహకం లభిస్తోందన్నారు. భారతి పథకం ద్వారా ఒకటో తరగతి నుంచి పీజీ చదివే వరకు విద్యార్థులకు రూ.7500 నుంచి 40వేల వరకు ఏటా ఉపకరా వేతనాలు అందజేస్తామన్నారు. అన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

# నరకయాతన

- కనిగిరిలో నీటికోసం ప్రజల అగచాట్లు
- అయిదు వేల బోర్లు ఎండిపోయాయి
- రోజూ ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా
- పూర్తిస్థాయిలో అందని నీరు
- వాడుక నీటికి అల్లాడుతున్న జనం



ట్యాంకర్ల వద్ద ఎగబడుతున్న జనం

**కనిగిరి :** కనిగిరి వాసులు నిత్యమూ నీటి కోసం ఆందోళన చెందుతునే ఉన్నారు. వీధుల్లోకి ట్యాంకర్లు వస్తే చాలా మహిళలు బిందెలు తీసుకొని పరుగులు తీస్తుంటారు. ఒక వైపు వర్షాభావం ...మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నిత్యమూ నీటి కోసం నరకయాతనే అనుభవిస్తున్నారు. నీరు దొరక్కపోవడంతో చాలామంది ఇళ్లు ఖాళీ చేసి వేరే ప్రాంతానికి వెళ్లిపోతున్నారు.

**ఫలించని ప్రయత్నాలు :** నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులు 45 వేల జనాభా, 12 వేల గృహాలు ఉన్నాయి. నివాసాల్లో సుమారు 8 వేల బోర్లు ఉన్నాయి. వాటిలో అయిదు వేలకు పైగా బోర్లల్లో నీరు రావడం లేదు. మరో వెయ్యి బోర్ల నుంచి అంతంత మాత్రంగా నీరు వస్తోంది. కొత్తపేట, నక్కలతిప్ప, శివారు కాలనీలు, కొత్తపేటలోని జవహర్‌లాల్ వీధి, నీలకంఠంవారి వీధి, ఆంధ్రాబ్యాంకు బజారు తదితర ప్రాంతాల్లో 500 అడుగులు పైబడి లోతు బోర్లు వేసినా నీరు పడడం లేదు. దీంతో కాశీనాయనగుడి ప్రాంతం, జూనియర్ కళాశాల వద్ద కొత్తగా భవనాలు ప్రజలు నిర్మించుకుంటున్నారు.నగరపంచాయతీ పరిధిలో 30 వరకూ డీప్‌బోర్లు ఉండగా 20 బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో కొత్తగా బోర్లు వేయడానికి చాలామంది వెనుకంజ వేస్తున్నారు. కాశీనాయన గుడి ప్రాంతంలో కొంత మేర నీరు ఉన్నా నగరపంచాయతీ బోర్లు వేసేందుకు స్థానికులు అభ్యంతరం పెడుతున్నారు. ప్రస్తుతం ఆరు బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా కొంతమేర నీరు అందిస్తున్నారు.

**13 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా :** నగర పంచాయతీలోని 20 వార్డుల్లో 13 ట్యాంకర్లు ద్వారా 200 ట్రిప్పులతో నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ల నీటికి ప్రతి రోజూ లక్ష వరకూ వ్యయం చేస్తున్నారు. పట్టణ వీధుల్లో ప్రజలు డ్రమ్ములు పెట్టుకొని ట్యాంకర్లు వచ్చిన వెంటనే నీటితో నింపుతున్నారు. డీప్ బోర్లు అడుగంటిపోవడంతో ట్యాంకర్లు నింపడం గగనమైంది. ఇటీవల బిల్లుల మంజూరులో జాప్యం చోటుచేసుకోవడంతో కాంట్రాక్టర్లు ట్యాంకర్లను రెండు రోజులపాటు నిలుపుదల చేశారు. దీంతో ప్రజలు నీటికోసం తహతహలాడిపోయారు. ఆర్థిక స్తోమత ఉన్నవారు రూ 200లు వెచ్చించి ట్యాంకర్ నీటిని కొనుగోలు చేస్తున్నారు.



ట్యాంకర్ల వద్ద క్యూ కట్టిన బిందెలు

**వ్యక్తిగత పరిశుభ్రత కరువు :** నీరు కరువవ్వడంతో చాలామంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించలేకపోతున్నారు. స్కూల్ విద్యార్థుల యూనిఫారం ఉతకడానికి నీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లలను విప్పిన దుస్తులనే ధరింపజేసి స్కూల్‌కు పంపిస్తున్నారు. నిత్యమూ ఇదే పరిస్థితి నెలకొనడంతో ఏ క్షణాన ఏ రోగం ప్రబలుతుందోనన్న భయం ఉపాధ్యాయులను వెంటాడుతోంది.

### సమ్మర్ స్టోరేజ్ ఏర్పాటుకు చర్యలు

షేక్ చినమస్తాన్, మున్సిపల్ ఛైర్మన్



కనిగిరి చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా మార్చాలి. అందుకోసం రూ 110 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేశాం. వాటికి సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే కదిరి బాబూరావు ద్వారా సీఎం దృష్టి తీసుకెళ్లాం. నిధుల మంజూరుకు సీఎం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు ప్రస్తుతం ట్యాంకర్లుద్వారా రోజూ 200 ట్రిప్పుల నీటిని సరఫరా చేస్తున్నాం.

## పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

**వెలిగండ్ల :** స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఆదివారం మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు గ్యాస్ సిలిండర్లు, స్టౌలను ఎంఈవో దాసు ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగండ్ల జెడ్పీహెచ్ స్కూల్, చెన్నంపల్లి, రాళ్ళపల్లి స్కూళ్లకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకి కట్టెల పొయ్యిలను నివారించి, గ్యాస్ ద్వారా రుచికరమైన భోజనాలను అందించాలన్న ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లెబోయిన రమణయ్య, రవి, హరి, భాస్కర్, ప్రసాద్ పాల్గొన్నారు.



పాఠశాలలకు చేరిన గ్యాస్ సిలెండర్లు, స్టౌ, రెగ్యులేటర్ తదితరులు

## వనితా ఫ్యామిలీ కార్డుల పంపిణీ



వనితా ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేస్తున్న ఆర్టీసీ సీఐ బేగం

**కనిగిరి :** ప్రయాణికులకు ఆర్టీసీ కల్పిస్తున్న వనితా ఫ్యామిలీ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి ఆర్టీసీ సీఐ షేక్ బేగం సూచించారు. చాకిరాల పంచాయతీలో ఆదివారం తెల్లరేషన్‌కార్డుల గల ఐదుగురు సభ్యుల గల కుటుంబాలకు వనితా ఫ్యామిలీ కార్డులను ఆదివారం అందజేశారు. ఆ కార్డు ఉన్న ప్రయాణికులకు రూ. లక్ష వరకు బీమాను వర్తింపజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కండక్టర్లు ఎం. రమేష్, షేక్ బడేషా, పీ. ప్రశాంతి పాల్గొన్నారు.

## ఒకటిన మిలీనియం మార్చ్

**కనిగిరి టౌన్ :** సెప్టెంబర్ ఒకటిన ఏపీసీపీఎస్ ఈఏ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎస్ ఉద్యోగ సంఘం కోరింది. పట్టణంలోని సీపీఎస్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్నడాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులు చేసిన పోరాటం ఫలితంగా గ్రాడ్యూ యూటీ, జీవో, ఫ్యామిలీ పెన్షన్ జీవోలను సాధించామన్నారు. ప్రతి సీపీఎస్ ఉద్యోగి విజయవాడలో జరిగే మిలీనియం మార్చ్‌లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక, ఓపీఎస్ సాధనకు రూపకల్పన చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాలకృష్ణ, ఏపీసీపీఎస్ రాష్ట్ర, జిల్లామండల నాయకులు రాజా, గురవయ్య, ఐ. వెంకటేశ్వర్లు, రామకృష్ణ, అమర్‌నాథ్, సూర్యనారాయణ, హరికేశవ, పూర్ణా, రమేష్, హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మిలీనియం మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



మిలీనియం మార్చ్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు

## క్షవర వృత్తిదారులను ఆదుకోవాలి

**కనిగిరి టౌన్ :** క్షవర వృత్తిదారులను ఆదుకోవాలని మంగళి మహాసభ నాయకులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ మంగలి జాతిని కించపరిచేలా ప్రభుత్వం చర్యలు చేపడితే సహించబోమని హెచ్చరించారు. వారిలో ఆత్మగౌరవాన్ని చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు మంగలి మహాసభ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మంగళి మహాసభ నాయకులు పాలూరి మాధవ, శ్రీనివాసరావు,పిచ్చయ్య,వెంకటేశ్వర్లు, కృష్ణలు పాల్గొన్నారు.

## ఉత్తమ డీటీ కిశోర్‌కు సన్మానం



డీటీ కిశోర్‌ను సన్మానిస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ నారాయణ తదితరులు

**కనిగిరి టౌన్ :** ఉత్తమ పురస్కారం అందుకున్న కనిగిరి డిప్యూటీ తహసీల్దార్ కెకె కిశోర్‌కుమార్‌ను పలువురు అభినం దించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ ఐవీ నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం కిశోర్‌కుమార్‌ను సన్మానించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమంలో జరిగిన ఎంపీపీ నం బుల వెంకటేశ్వర్లు, ఏఎంసీ వైస్ చైర్మన్ నారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో కిశోర్ రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చుకొని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, ఆర్ఐ ధర్మతేజ, తాళ్ళూరి రమణయ్య, నజముద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా గంధ మహోత్సవం

**పామూరు :** ఇనిమెర్లలోని 18వ గంధమహోత్సవాన్ని హిందూ, ముస్లిం భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. హిందూ, ముస్లిం భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారి జండాను, గంధాన్ని మేళతాళాలతో తీసుకెళ్లారు. ఫకీర్ల గానా బజానాలతో స్వామివారి దర్గా వద్దకు తీసుకెళ్లి గంధము, తాంబులాన్ని భక్తులకు పంచిపెట్టారు.గంధ మహోత్సవం సందర్భంగా భక్తులకు దర్గా కమిటీ భోజన వసతి కల్పించింది. రాత్రిపూట పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

### సినిమాలు

కనిగిరి

శ్రీనివాస : జయ జానకి నాయక

## ఇంకొల్లులో అంకమ్మతల్లికి పొంగళ్ళు

**ఇంకొల్లు :** ఇంకొల్లు గ్రామదేవత అంకమ్మతల్లికి ఆదివారం పొంగళ్లు పెట్టారు. అమ్మవారినిప్రత్యేకంగాఅలంకరించి పూజలు నిర్వహించారు. వానలు సకాలంలో కురవాలని, పాడిపంటలతో గ్రామస్తులు బాగుండాలని మహిళలు అమ్మవారికి పొంగళ్ళు సమర్పించి మొక్కుకున్నారు.



రోడ్డుపైకి వచ్చిన తుమ్మచెట్లు

## రోడ్డుకి ఇరువైపులా తుమ్మచెట్లు - రాకపోకలకు ఇక్కట్లు

**చినగంజాం :** చినగంజాం నుండి పల్లెపాలెం వెళ్ళే రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా తుమ్మచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. ఈ రోడ్డులో రామచంద్రానగర్, పెద్దపల్లెపాలెం, తూర్పుపల్లెపాలెం, బాపయ్యనగర్ గ్రామాలకు వెళ్ళే ప్రజలతో పాటు ఉప్పు కొఠారులు, రొయ్యల చెరువులకు వెళ్ళే వారు ప్రయాణం సాగిస్తుంటారు. రోడ్డుకి రువైపులాదట్టంగా తుమ్మచెట్లు పెరగటం వలన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో రోడ్డు పక్కకు వెళ్ళే అవకాశం ఉండటంలేదు. లారీలు ఎదురు వచ్చినప్పుడు ద్విచక్రవాహనచోదకుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. రోడ్డు పక్కన ఖాళీస్థలం లేకపోవటంతో రోడ్డుకు ముందుకు వచ్చి ద్విచక్ర వాహనదారులుగాయాలపాలవుతున్నారు. ఉప్పు లోడ్ చేసేందుకు లారీల్లో వెళ్ళే కూలీలకు తుమ్మచెట్లు తగిలి గాయపడిన సంఘటనలు అనేకం. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామచంద్రానగర్, పల్లెపాలెం గ్రామాలకు చెందిన విద్యార్థులు రాత్రి సమయాల్లో ట్యూషన్లకి వచ్చి వెళ్ళేటప్పుడు విషజీవులబారిన పడతామోనని భయపడుతున్నారు. రోడ్డుకి ఇరువైపులా పెరిగిన తుమ్మచెట్లను తొలగించి పాదచారులకు వాహనదారులకు అసౌకర్యం కలుగకుండా సంబంధితశాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నేటి నుంచి ఉపాధ్యాయులకు టెలీకాన్ఫరెన్స్

**చినగంజాం :** మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు సోమ, మంగళవారాలలో టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కె.వెంకటేశ్వరరావుతెలిపారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు టెలీకాన్ఫరెన్స్ జరుగుతున్నట్లు తెలిపారు. సోమవారం 50శాతం, మంగళవారం మిగిలిన 50శాతం ఉపాధ్యాయులు హాజరుకావాలని తెలిపారు. 23వ తేదీ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తామన్నారు.

**ఇంకొల్లు :** మండలంలోని ఇంకొల్లు, పావులూరు, దుద్దుకూరు, వంకాయలపాడు పాఠశాల సముదాయాల్లో సోమవారం నుండి ఆయా పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఎంఈఓ జయరాజు తెలిపారు. 21, 22 తేదీలలో ప్రాథమిక పాఠశాలల, 23వ తేదీ ప్రాథమికోన్నతపాఠశాలల ఉపాధ్యాయులు హాజరుకావాలని సూచించారు.

# సమస్యలకు ఆనవాలుగా చెరుకూరు

- అభివృద్ధికి నోచని చెరువులు
- కలుషిత నీటితో జనం బెంబేలు
- అధ్వానంగా పారిశుధ్యం
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- పట్టించుకోని అధికారులు



నాచు మొక్కలు, తుంగతో పేరుకు పోయిన మంచినీటి చెరువు

**పర్చూరు:** ప్రభుత్వం నిధులు వెచ్చిస్తున్నా కొన్ని గ్రామాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. పెద్ద పంచాయితీల సైతం చిన్న చిన్న సమస్యలను కూడా నోచుకోలేని దుస్థితి. ఇందుకు నిదర్శనం మండలంలో నియోజకవర్గ కేంద్రమైన పర్చూరు తరువాత రెండో పెద్దగ్రామంచెరుకూరు. ఈ గ్రామంలో సుమారు 10వేలకు పైగా జనాభా నివశిస్తున్నారు. అన్నీ వర్గాలకు చెందిన సన్నా, చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలే అత్యధికులు.ఇలాంటిగ్రామంలో సమస్యలు తిష్టవేశాయి.

### మాన్యం భూములున్నా...

గ్రామంలో మంచి నీటి చెరువుకు సంబంధించి 40ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. ఈభూముల ద్వారా వచ్చే ఆదాయంతో చెరువును అభివృద్ధి చేయాల్సి ఉంది. కానీ దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెరువు కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి చెరువులో ఉన్న పూడికను తీయక పోవటంతో నాచు, తుంగ పెరిగిపోయి చెరువులో ఉన్న కాస్తనీరు రంగుమారి దుర్గంధం వెదజల్లుతుంది. కనీసం నీటిని ఫిల్టర్ చేద్దామన్నా, పనిచేయని ఫిల్టర్‌బెడ్‌లే దర్శనమిస్తున్నాయి. ఫిల్టర్‌బెడ్‌ల్లో ఉన్న ఇసుకను మార్చిన దాఖలాలు శూన్యం. దీంతో పాచిపట్టిన ఫిల్టర్ బెడ్‌లలోనికి చెరువులో ఉన్న నీటిని నేరుగా పంచాయితీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. వాడుకనీరు దుర్గంధం వెదజల్లటంతో పాటు త్రాగు నీటిని కొనుగోలు చేసి త్రాగాల్సిన వస్తుందని ప్రజలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

### ముందుకు కదలని మురుగు...



నిలిచి ఉన్న మురుగు



రహదారుల వెంబడి పేరుకు పోయిన చెత్తాచెదారం

గ్రామంలో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా తయారయ్యింది. డ్రైనేజ్ కాలువలు పూడిపోయి వర్షపునీరు మురుగు నీటితో కలసి రోడ్లపై చేరుతున్నాయి. రోజుల తరబడి నీరు రోడ్లపై నిలవటంతో దుర్గంధంతోపాటు దోమల సంఖ్య పెరిగిపోయి ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నరు. ఏక్షణాణ ఏవ్యాధి ప్రబలుతుందోనన్న బయం పలువురిని వెంటాడుతోంది. గతంతో పారిశుధ్యం లోపించి ఈ గ్రామంలో అనేక మందికి విషజ్వరాలతోపాటు, డెంగ్యూ వ్యాధి సోకి అనేక మంది మృతి చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయి. దీంతోపాటు మరుగు కాల్వలకు ఆనుకొని పశువ్యర్థాలను నిల్వచేయటంతో మరిన్ని సమస్యలు ఏర్పడుతున్నాయి. పారిశుధ్య సమస్య అస్తవ్యస్తంగా ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవటం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్య బారిన పడకుండా ముస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు గ్రామంలోని సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాల్సి ఉంది.

# ‘అన్న అమృత హస్తం’పై అనాసక్తి!

- అంగన్‌వాడీ కేంద్రాలకు బాలింతలు దూరం
- వారి స్థానంలో అత్తలకు భోజనం

**సంతమాగులూరు:** సంతృప్తికరమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిస్ఠాత్మకంగా అన్న అమృత హస్తం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందించేందుకు చర్యలు చేపట్టింది. ఆశించిన స్థాయిలో పథకం ఫలితాలు ఇవ్వడంలేదు. ప్రధానంగా బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీలు అందించే భోజనంపై ఆసక్తి కనబర్చకపోవడమే. సంతమాగులూరు ఐసీడీయస్ ప్రాజెక్ట్ పరిధిలో 254 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 1300మంది బాలింతలు, గర్భిణులు, 15000 మంది చిన్నారులున్నారు. వీళ్ళందరికీ అన్న అమృత హస్తంలో భాగంగా భోజనాన్ని అంగన్‌వాడీ కేద్రాలలో అందించాలి. గతనెల ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలలో పథకాన్ని ప్రారంభించారు.

### అందుబాటులో లేని అంగన్‌వాడీ కేంద్రాలు

వారంలో ఆరు రోజులపాటు బాలింతలకు, గర్భిణులకు మధ్యాహ్నం కోడిగుడ్డు ఇవ్వాలి. అన్నం ఆకుకూరతో కలసిన పప్పు, ఒక కూరతో ఆరురోజులపాటు భోజనంలో పెట్టాలి. ఈ భోజనాన్ని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్ళి తీసుకోవాలి. అయితే అక్కడికి వెళ్లడానికి ఇష్టపడడంలేదు. కేంద్రాల్లో అసౌకర్యంగా ఉండటం, ఇరుకు గదులు చిన్నారులతో కలిసి భోజనం చేసేందుకు సుముఖత చూపటంలేదు. మరికొంత మంది కోడిగుడ్డు, పాల కోసం కేంద్రాలకు వెళ్తున్నారు. ప్రాజెక్ట్ పరిధిలో ఏ ఒక్క కేంద్రంలోనూ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలేదు. కనీసం ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఐదుగురు కూడా హాజరు కావడం లేదని తెలుస్తోంది. ఇందుకు ప్రధాన కారణం అంగన్‌వాడీ కేంద్రం అందుబాటులో లేకపోవడమే. కొన్ని కేంద్రాలు ఏకంగా కిలోమీటరు పైబడి వెళ్ళాల్సి ఉం డడంతో వెళ్ళలేక మొగ్గు చూపటంలేదు. మరికొన్ని కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు బదులు ఇంటిలోని పెద్దవారు వచ్చి అన్నం తిని కోడిగుడ్డు, పాలు ఇంటికి తీసుకెళ్తున్నారు. అమ్మా భోజనానికి రావాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు బాలింతల్ని, గర్భిణులను పిల్చుకెళ్లాల్సిన పరిస్థితి.

### నాణ్యత లేని పాలు

పౌష్టికాహారంలో భాగంగా రోజువారీ అందించే పాలు నాసిరకంగా ఉంటున్నాయి. కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్న పాల ప్యాకెట్లలో పురుగులు ఉండడం, ప్యాకెట్ ఉబ్బిపోయి దుర్వాసన వెదజల్లడం వల్ల ఎవరూ ముందుకు రావడం లేదు. అలాగే పలు కేంద్రాల్లో ఇప్పటికీ కట్టెలతోనె వంట చేయడం, అద్దె భవనాలు కావడంతో పరిశుభ్రత ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. దాంతో రోజువారీ ఎంతమంది పౌష్టికా హారం స్వీకరించారన్నదీ అధికారులవద్ద సమాచారమూ ఉండట్లేదు. దీనివల్ల అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పథకంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించేలా ఐసీడీఎస్ సిబ్బంది కృషిచేయాల్సి ఉంది.



అంగన్‌వాడీ కేంద్రంలో అరకొరగా భోంచేస్తున్న బాలింతలు, గర్భవతులు



అంగన్ వాడీ కేంద్రంలో భోంచేస్తున్న చిన్నారులు

## విద్యుత్ కోతలతో అవస్థలు

**పర్చూరు:** పర్చూరులో వేళాపాళ లేని విద్యుత్ కోతలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొద్దిపాటి సమస్య ఉన్నా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేయటంతో సమస్య మరింత జఠిలంగా మారింది. వర్షాకాలం కావటం రాత్రివేళల సైతం విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవటంతో గర్భిణులు, బాలింతలు, వృద్ధుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వర్షాకాలం కావటంతో దోమలతో సమస్య మరింత ఇబ్బంది కరంగా మారింది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ కోతనుంచి ప్రజలకు విముక్తి కల్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎన్ఐఓఎస్ పరీక్షకు 232మంది హాజరు

**యద్దనపూడి :** మండల పరిధిలోని వయోజనులకు నిర్వహించిన ఎన్ఐఓఎస్ పరీక్షకు 232మంది హాజరైనట్లు కోఆర్డినేటర్ రాజేష్ తెలిపారు. ఈ పరీక్షలు మార్చినెలలో ఫెయిల్ అయిన వారికి, పరీక్షకు హాజరుకాని వారికి ఈ రోజు పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలను ఎంఈఓ సుబ్రహ్మణ్యేశ్వరరావు పర్యవేక్షించారు.

## వీఆర్‌పాలెం అభివృద్ధికి రూ. 45 లక్షల మంజూరు

**నాగులుప్పలపాడు:** టంగుటూరి ప్రకాశం పంతులు జన్మస్థలమైన వినోదరాయుని పాలెం అభివృద్ధికి రూ. 45 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రకాశం పుట్టిన గ్రామాన్ని నోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించినట్లు టీడీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జి బి.ఎన్.విజయకుమార్ ఆదివారం తెలిపారు. ఆ నిధులను గ్రామాభివృద్ధికి ఉపయోగించనున్నట్లు తెలిపారు.

# ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు

**చీమకుర్తి సహా పది గ్రామాల వాసులకు ప్రమాద ఘంటికలు**
**ఒట్టిపోతున్న చెరువు**
**కలుషిత జలాలే ప్రజలకి దిక్కు**

**చీమకుర్తి:** చీమకుర్తి పట్టణ ప్రజలతో పాటు పదిగ్రామాలలో నివశిస్తున్నవారికి తాగునీటి కష్టాలు ముంచుకొస్తున్నాయి. పాటిమీద పాలెం సమీపంలోని చీమకుర్తి తాగునీటి చెరువులో ఉన్న జలాలు అడుగంటి పోయాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన తాగునీటి పథకం ద్వారా చీమకుర్తి పట్టణంతోపాటు మండల పరిధిలోని నాయుడుపాలెం, బండ్లమూడి, తొర్రగుడిపాడు , ఎర్రగుడిపాడు , మంచికలపాడు , కె.అగ్రహారం, చీమలమర్రి, రెడ్డినగర్ లకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రామతీర్థం రిజర్వాయరు ద్వారా తాగునీటి చెరువును నింపి ఆయాగ్రామాలకు సరఫరా చేస్తారు. ప్రస్తుతం నీటిని నింపే అవకాశం లేకపోవడంతో ఉన్న నీటిమట్టం అడుగంటి పోయింది. కనుచూపు మేరలో సాగర్ జలాలు వచ్చే అవకాశం కనబడకపోవడం నీటికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. మరోవైపు రామతీర్థం జలాశయం పూర్తిగా అడుగంటింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం చెరువులో ఉన్న జలాలతోనే నెట్టుకు రావాల్సి వుంది. దీనితో తాగునీటి సరఫరాను తగ్గిస్తూ వస్తున్నారు.





అడుగంటిన చెరువు (ఇన్‌సెట్లో) కలుషిత నీటితో ఉన్న ఫిల్టర్‌బెడ్

### కొళాయిల నుంచి కలుషిత నీరు

ప్రస్తుతం చీమకుర్తి చెరువు నుంచి విడుదల చేస్తున్న తాగునీటి జలాలు ఫిల్టరుకు నోచుకోకుండా యథాతథంగా కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. దీనితో కలుషిత నీరే తాగునీటి కోసం ఉపయోగించాల్సి వస్తున్నది. ఈ సమస్యను గుర్తించిన అప్పటి కలెక్టర్ సు జాత శర్మ ఫిల్టర్ చేసిన నీటినే ఇవ్వాలని ఆదేశించారు. కానీ, ఏడాది అవుతున్న మైక్రో ఫిల్టరు బెడ్‌ల ద్వారా జలాలను సరఫరా చేసిన దాఖలాలు లేవు. అలంకార ప్రాయంగా తాగునీటి పథకం వద్ద నీటిగది ఏర్పాటు చేశారు. లక్షల ప్రభుత్వ నిధులు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన మైక్రోఫిల్టర్ బెడ్‌లను వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీనితో కలుషిత జలాలు ప్రజలు తాగి వ్యాధుల బారిన పడాల్సిన పరిస్థితి ప్రజలకు ఏర్పడింది. తక్షణమే ఫిల్టర్ బెడ్‌లను ప్రారంభించి స్వచ్ఛమైన జలాలను అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.



పోలేరమ్మ గుడిలో పూజలు చేస్తున్న భక్తులు

## పిలిస్తే పలికే పోలేరమ్మతల్లి

**జాతర సందర్భంగా నేడు అన్నదానం**

**మద్దిపాడు :** చల్లని తల్లి, శక్తి స్వరూపిణి, అమ్మలుగన్న అమ్మ పోలేరమ్మ. దుష్టశక్తులు దరిచేరకుండా కాపాడడమే కాకుండా, భక్తులు కోర్కెలు తీర్చే కరుణామయిగా మద్దిపాడులో కొలువు తీరింది పోలేరమ్మ తల్లి. స్థానికంగా పోలేరమ్మజాతర సందర్భంగా దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా అలరారుతోంది. పోలేరమ్మ పొంగళ్ల పురస్కరించుకొని సోమవారం భారీగా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పోలేరమ్మతల్లికి మంగళ స్నానాలు నిర్వహించి శాస్త్రోక్తంగా జాతరను నిర్వహించనున్నారు.

## నూరుశాతం అక్షరాస్యతే లక్ష్యం

**ఉప్పుగుండూరు(నాగులుప్పలపాడు):** నూరుశాతం అక్షరాస్యతే ధ్యేయంగా సాక్షర భారత్ కేంద్రాలు పనిచేయాలని అడిషనల్ డైరెక్టర్ మాలకొండయ్య అన్నారు. ఆదివారం ఉప్పుగుండూరు ,కండ్లగుంట, ఒమ్మెవరం , అమ్మనబ్రోలు గ్రామాలలో సాక్షరభారత్ కేంద్రాలలో జరిగే సీ గ్రేడ్ పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయోజనులందరికి ఈకేంద్రాల ద్వారా విద్యనేర్పించాలన్నారు. పగటిపూట పనులకు వెళ్లి రాత్రిళ్ల కేంద్రాలకు వచ్చి చదువు నేర్చుకోవాలన్నారు. ఉపాధి పథకం ,వ్యవసాయ కూలీలకు చదువే ముఖ్యమన్నారు. దీనిద్వారా మీ బిడ్డలను ఉన్నత చదువులు చదివించుకొనేందుకు పూర్తిస్థాయిలో విజ్ఞానవంతులు అవుతారన్నారు. గ్రామస్థాయిలో పనిచేసే కోఆర్డినేటర్లు కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ఎస్.కె. అంజయ్య, గ్రామ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

## స్టడీ మెటీరియల్ అందజేత

**ఉప్పుగుండూరు (నాగులుప్పలపాడు) :** ఉప్పుగుండూరు గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను అందజేశారు. పదోతరగతి విద్యార్థులకు వారి ప్రతిభను పెంపొందించేందుకు మెటీరియల్ దోహద పడుతుందని గ్రంథపాలకురాలు నాగరజని తెలిపారు. కార్యక్రమంలో గుండా శంకరరావు, తెలగతోటి సామ్యేలు, మంగపతిరావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్మశాన స్థల సమస్యకు పరిష్కారం ఎన్నడో?

**చేకూరుపాడు ఎస్సీ కాలనీ వాసుల ఆవేదన**

**చేకూరుపాడు(నాగులుప్పలపాడు):** చేకూరుపాడు ఎస్సీ కాలనీ వాసుల శ్మశాన స్థల సమస్య ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచడం లేదు. గ్రామంలో 3 వేలకు పైగా జనాబా ఉన్నారు. వీరిలో 2వేల మంది జనాబా ఎస్సీలే. శ్మశానానికి సర్వే నెం132/2లో ఎ1.40సెంట్లుభూమి ఉన్నప్పటికి ఈ పాటికే ఆ భూమి అంతా సమాధులతో నిండి పోయింది. మిగిలిన అరకొర భూమిలో చిల్ల చెట్లు నిండుకొని ఉన్నాయి. ఆ స్థలంలోనికి పోయేందుకు రహదారి కూడా లేదు. కాలనీలో మనిషి మృతి చెందితే శ్మశానానికి పోయేందుకు పొలంగట్లపై వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఆ భూముల యజమానులు అడ్డుకుంటున్నారు. 2013 నుంచి నేటి వరకు కలెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తున్నప్పటికి సమస్య ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న పాత శ్మశానికి అదనంగా భూమి కేటాయించాలని ,కాలనీ నుంచి ఆ స్థలానికి పోయేందుకు రహదారి ఏర్పాటు చేయాలని పలు దఫాలుగా ఆందోళన చేసినప్పటికీ మా మొర ఆలకించడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు, కలెక్టర్‌తోపాటు ,జాతీయ, రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లినా స్థల సమస్య పరిష్కారానికి నోచుకోక పోవడం దురదృష్టకరం. అధికారులు స్పందించి శ్మశానానికి రాకపోకలకు వీలుగా రహదారిని నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



చేకూరుపాడులో చనిపోయిన వారిని పొలాల గట్లపై నుంచి తీసుకెళ్తున్న దళితులు

### సమస్య పరిష్కారం కావడం లేదు

**- చప్పిడి కోటేశ్వరరావు**



స్వాతంత్య్రం వచ్చి 70 ఏళ్ల దాటినా శ్మశాన సమస్య పరిష్కారానికి నోచుకోక పోవడం దురదృష్టకరం. పలుమార్లు అర్జీలు అందిస్తున్నా బుట్టదాఖలవుతున్నాయి. అధికారులు చిత్తశుద్ధితో మాసమస్యను పరిష్కరించాలి.

### స్థలం, రోడ్డు సౌకర్యం కల్పించండి

**- ఆర్.ఏసురత్నం**



శ్మశాన స్థలానికి సంబంధించి అదనపు భూమితో పాటు రోడ్డు సౌకర్యం కల్పించాలి . ఈ సమస్యపై ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం. ప్రజా ప్రతినిధులు , అధికారులు పట్టించుకోవాలి.

## మనస్తాపంతో కార్మికుడి ఆత్మహత్య

**మద్దిపాడు :** గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలో కార్మికుడిగా పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్రంలోని చౌటుప్పల్ గ్రామానికి చెందిన యు.నాగేందర్ (24) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. 20 రోజుల క్రితం భార్య శైలజతో కలిసి ఓ ఫ్యాక్టరీలో కార్మికులుగా చేరారు. అయితే శైలజకు ఇక్కడ వాతావరణం నచ్చలేదు. దీంతో ఊరికి వెళ్లిపోతానని నాగేంద్రకు చెప్పడంతో ఆయన వీలులేదని, వెళ్లిపోతే చనిపోతానని చెప్పాడు. అయినా భార్య వినకుండా ఊరికి ప్రయాణం కావడంతో నాగేందర్ మనస్తాపానికి గురై ఇంట్లోని రేకుల షెడ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమచారం మేరకు ఎస్సై రాజేష్ సంఘటనా స్థలంకు వెళ్లి మృత దేహాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**సంతనూతలపాడు :** సంతనూతలపాడు మండలంలోని ఏఎంసీ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మోటార్ సైకిల్‌ను కారు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. సంతనూతలపాడుకు చెందిన మార్పూడి వెంకట్రావు, బొమ్మతోటి ప్రవీణ్ ఏఎంసీ వద్ద ఉన్న బంక్‌లో పెంట్రోల్ కొట్టించుకుని సంతనూతలపాడు బయల్దేరారు. ఈ సమయంలో ఎదురుగా వస్తున్న జీపు వారి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. వీరిలో వెంకట్రావు పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## నలుగురు జూదరుల అరెస్టు

**మద్దిపాడు:** మండలంలోని నేలటూరులో పేకాటడుతున్న వారిపై మద్దిపాడు ఎస్సై రాజేష్ తన సిబ్బందితో దాడిచేసి నలుగురిని అరెస్టు చేశారు. వారివద్ద రూ.3,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కోర్టుకు హాజరపచనున్నట్లు ఎస్సైరాజేష్ తెలిపారు.

## గుంటిగంగలో ప్రత్యేక పూజలు

**తాళ్లూరు :** జిల్లాల్లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గంగమ్మతల్లికి మొక్కుబడులు చెల్లించు కున్నారు. తమను చల్లగా చూడమని వేడుకున్నారు. పలువురు పశుసంపదను గంగమ్మతల్లి చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. పలువురు వాహనచోదకులు పూజలు చేయించగా, మరికొందరు భక్తులు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు

## తపాలాశాఖలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం ఉండదు

**ఒంగోలు వ్యవసాయం :** తపాలాశాఖలో పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవక్స్ సమ్మె చేస్తున్నా తమ వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తపాలాశాఖ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు మాస్టర్ టి.వి.ఏశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల సేవింగ్స్ ఖాతాలు, రికరింగ్ డిపాజిట్లను సమీపం లోని సబ్ పోస్టు ఆఫీసుల్లో చెల్లించాలని ప్రజలకు సూచించారు. ఏదైనా ఇతర సేవలకు కూడా ప్రజలు సమీపంలోని సబ్‌పోస్టాఫీసుల్లో కలవాల్సిందిగా ఆయన కోరారు.

# ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

**-నగర కమిషనరు సంక్రాంతి వెంకటకృష్ణ**

**ఒంగోలు కల్చరల్ :** విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం అత్యవసరమని నగరపాలకసంస్థ కమిషనరు సంక్రాంతి వెంకటకృష్ణ చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ ఆధ్వర్యంలో రామ్ నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశ ప్రధాని సైతం స్వచ్ఛ భారత్‌తోపాటు స్వస్థ భారత్ నిర్మాణం జరగాలని పిలుపునిచ్చారన్నారు. విద్యార్థులు ఆరోగ్యకర జీవనవిధానాన్ని అలవాటు చేసుకోవాలని, ఇందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కృషి చేయాలని చెప్పారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు గొర్రెపాటి రాజేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులలో వచ్చే అనేక చిన్న చిన్న వ్యాధులను సకాలంలో గుర్తించలేక పోవటం వలన వారికి అనారోగ్యం కలిగే ప్రమాదం ఉందన్నారు. అందుకే తమ క్లబ్ తరఫున ప్రభుత్వ పాఠశాలల్లో మెగా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు వి.కేశవ, రవికిరణ్, సి.వి.ఎల్. సుబ్రహ్మణ్యం, డాక్టర్ జె.అరవింద్, యం.సుభాష్, యం.కమల పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి క్లబ్ ఒంగోలు సెంట్రల్ కార్యదర్శి యం.మాధవరావు సంధానకర్తగా వ్యవహరించారు.



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటకృష్ణ

## మోదీ, బాబు పాలనలో సామాన్యులకు కష్టాలు

**ఒంగోలు కలెక్టరేట్ :** కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు మూడున్నరేళ్ల పాలనలో కార్పొరేట్లు ఆకాశంలోకి, సామాన్య ప్రజానీకం పాతాళంలోకి వెళ్లారని సీపీఎం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు విమర్శించారు. మోదీ, చంద్రబాబులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 21నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో ప్రచారోద్యమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం ప్రచారోద్యమం పోస్టర్లను జాలా అంజయ్య, కొండారెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు.

## యాచకుడి మృతి

**ఒంగోలు క్రైం :** యాచన చేసుకుంటూ జీవించే వృద్ధుడు మృతి చెందిన సంఘటన కర్నూలురోడ్డులోని ఫ్లైవోవర్ కింద ఆదివారం జరిగింది. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సెలవుల్లో కాలేజీలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలి

**ఒంగోలు కలెక్టరేట్ :** సెలవు దినాల్లో కాలేజీలు నిర్వహించే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్. వినోద్, సిహెచ్. సుధాకర్‌లు డిమాండ్‌చేశారు. ఆదివారం నగరంలో కాలేజి నిర్వహి స్తున్న నారాయణ విద్యా సంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలు ఆదివారం, ఇతర సెలవు దినా ల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు ఈ విధానాలను ఉపసంహరించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పి. విజయ్, నాయకులు సిహెచ్ మోహన్, నవీన్, పవన్, మహేంద్ర, వరుణ్ పాల్గొన్నారు.

# హేతువాద-శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించాలి

**- నాగిరెడ్డి భవన ప్రారంభోత్సవంలో ఝాన్సీ**

**ఒంగోలు కలెక్టరేట్ :** ప్రజాతంత్ర ఉద్యమాలకు బాసటగా ఉండేందుకు, హేతువాద-శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించే కేంద్రంగా నిర్మించిన తరిమెళ్ల నాగిరెడ్డి భవన్ అని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ పేర్కొన్నారు. స్థానిక ఈమనిపాలెంలో నూతనంగా నిర్మించిన తరిమెళ్ల నాగిరెడ్డి భవనాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఏఐఎఫ్‌టీయూ(న్యూ) కోశాధికారి డీవీఎన్ స్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఝాన్సీ మాట్లాడుతూ చట్టసభలను, ఎన్నికలను కూడా పోరాట వేదికలుగా ఉపయోగించుకున్న మార్క్సిస్టు-లెనినిస్ట్ మేధావిగా నాగిరెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. తనపై, తన సహచరులపై పాలకులు మోపిన కుట్ర కేసులకు జవాబుగా ఆయన రాసిన తాకట్టులో భారతదేశం గ్రంథం ప్రజా ఉద్యమాలకు దిక్సూచి అని చెప్పారు. ఏఐఎఫ్‌టీయూ న్యూ జాతీయ అధ్యక్షుడు గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ 1917లో జన్మించిన నాగిరెడ్డికి ఇది శత జయంతి సంవత్సరమని గుర్తు చేశారు. ఈ సందర్భంలో ఆయన పేరుతో భవనాన్ని నిర్మించడం ప్రజాతంత్ర, హేతువాద భావాజాలాలను పెంపొందించే కేంద్రంగా ప్రకటించడం సంతోషకరమన్నారు. ఇలాంటి కేంద్రాలు ప్రతి పట్టణంలో ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి జాలా అంజయ్య, సీపీఐ నాయకులు యు. ప్రకాశరావు, న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కొంగర నరసింహులు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలితకుమారి, చిన్నతరహా గ్రానైట్ పరిశ్రమల సంఘం రాష్ట్ర అ ధ్యక్షుడు యర్రమనేని కోటేశ్వరరావు, జిల్లా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చుండూరి రంగారావు, సుపరిపాలన వేదిక నాయకుడు టి. గోపాల్‌రెడ్డి, షంషీర్ అహ్మద్, భవన నిర్మాణ కమిటీ నాయకులు పంగులూరి గోవిందయ్య పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఝాన్సీ

## న్యాయమూర్తుల ఖాళీలను భర్తీ చేయాలి

**ఒంగోలు కలెక్టరేట్ :** దేశంలోని వివిధ స్థాయి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల స్థానాలను వెంటనే భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అఖిల భారత న్యాయవాదుల సంఘం(ఐలు) జాతీయ కౌన్సిల్ సభ్యుడు, జిల్లా కార్యదర్శి యడవల్లి రమేష్ ఒక ప్రకటనలో కోరారు. సుప్రీంకోర్టు, హైకోర్టులు 2012 సంవత్సరం కంటే ముందు దాఖలు చేసిన కేసులన్నీ 2018 మార్చి నాటికి పూర్తి చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం అర్థరహితమని తెలిపారు. ఆ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకో వాలని కోరారు. కేసులు సత్వర పరిష్కారం కోసం జనాభా ప్రాతిపదికన న్యాయ స్థానాలు ఏర్పాటు చేసి ఖాళీలను వెంటనే భర్తీ చేయడం ద్వారానే సత్వర పరిష్కారానికి సాధ్యమవుతుందని తెలిపారు. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

## శ్రీరామమూర్తి సేవలు చిరస్మరణీయం

**ఒంగోలు కలెక్టరేట్ :** యానాది సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శిగా, గిరిజన ప్రజా పోరాట సమితి అధ్యక్షునిగా, జర్నలిస్టుగా దివంగత చేవూరి శ్రీరామమూర్తి అందించిన సేవలు చిర స్మరణీయమని పలువురు వక్తలు కొని యాడారు. స్థానిక అంబేద్కర్ గ్రంథా లయంలో ఆదివారం జరిగిన శ్రీరామ మూర్తి సంతాప సభకు గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం అధ్యక్షత వహించారు. ముందుగా శ్రీరామమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాలా జీనాయక్, మడనూరు సర్పంచ్ కత్తి పద్మ, గాండ్ల హరిప్రసాద్, ఓపీడీఆర్ చావలి సుధాకర్, పల్నాటి నాగేశ్వరరావు, లక్ష్మీ, ఎన్ఆర్ఐ వబ్బాని శ్రీనివాసరావు, పులి నిరంజన్, జే శ్రీను, రావూరి చంద్రమౌళి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

**ఒంగోలు కలెక్టరేట్ :** ఒంగోలు నియోజకవర్గంలో ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్య క్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆ పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, నియో జకవర్గ ఇన్‌చార్జి షేక్ ఖలీఫాతుల్లా బాషా చెప్పారు. ఆ పార్టీ స్థానిక కార్యాల యంలో ఆదివారం ప్రజాదర్బార్ కార్యక్ర మానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రతి ఆదివారం ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 28న అమిత్‌షా విజయవాడకు వస్తున్నారని, పార్టీ శ్రేణులందరూ రావాలనికోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కాట్రగడ్డ వాసు, కార్యదర్శి బొద్దులూరి ఆంజనేయులు, ముదవర్తి బాబురావు, పఠాన్ షాజిద్‌ఖాన్ పాల్గొన్నారు.

## మెగాఫ్యాన్స్ ఆధ్వర్యంలో వైద్య, రక్తదాన శిబిరాలు

**ఒంగోలు కల్చరల్ :** సినీనటుడు చిరంజీవి సినీ పరిశ్రమలో అడుగుపెట్టి నలభై సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఎన్‌జీవో కాలనీలోని సరస్వతి శిశుమందిరంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు చనపతి రాంబాబు ప్రారంభించారు. ఒంగోలు కిమ్స్ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఎముకలు, కీళ్ల వైద్యనిపు ణులు జి. కమల్‌హసన్, ఆర్.రఘురాములు, వి.ప్రశాంతి, డి.పావని తదితరులు షుగరు, బీపీ, ఈసీఈ వంటి ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చిరంజీవి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైడి యుగంధర్, నగర అధ్యక్షుడు పిల్లి రాజేష్ పెద్ద సంఖ్యలో చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.


వైద్య శిబిరం వద్ద మంత్రి శ్రీను, రాంబాబు, డాక్టర్లు




## జీవాలను నిర్దాక్షిణ్యంగా చంపడం దారుణం

**ఒంగోలు కలెక్టరేట్ :** మానవుని ఆహారం కోసం ప్రపంచ వ్యాప్తంగా లెక్కలేనన్ని జీవాలను నిర్దాక్షిణ్యంగా చంపడం దారుణమని పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ నన్నూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఒంగోలు పిరమిడ్ మాస్టర్ల ఆధ్వర్యంలో ఆదివారం శ్రీగిరి, సీతారామాపురం, గద్దలగుంట ప్రాంతాల్లో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పప్పులు, గింజలు, విత్తనాలలో గుడ్లు, మాసం కంటే నాలుగు రేట్ల బలం ఎక్కువగా ఉందన్నారు. భగవంతుడు మానవులకు నిర్దేశించిన ఆహారం శాకాహారమని, దాంతోనే సహజ రోగ నిరోధక శక్తి అపారమని వైద్యులు చెప్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్. సునీల్, బదిరీ, కాశీవిశ్వనాథ్, పద్మ, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

---

థియేటర్ --- సినిమా

---

సత్యం --- ఫిదా
రత్నమహల్---ఆనందోబ్రహ్మ
గోపి ---జయజానకి నాయక
సాయిసరోజ్ -- లై
తులసీరాం --- జయ జానకి నాయక
జయరాం ---నిన్నుకోరి
గోరంట్ల సినిమాస్ స్క్రీన్స్‌లలో----
నక్షత్రం, గౌతమ్‌నంద, ఆన్‌బెలి, నేనే రాజు నేనేమంత్రి, ఆనందోబ్రహ్మ

## కర్నూలు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి

**ఒంగోలు కలెక్టరేట్ :** నగరంలోని కర్నూలు రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం కర్నూలు రోడ్డు జోన్ కమిటీ కార్యదర్శి జి. రమేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు నెలల క్రితం ప్రారంభించిన ఆర్టీసీ సెంటర్‌గేటు నుంచి అవుట్ గేట్ వరకు చేపట్టిన పనులు కూడా పూర్తి చేయకపోవడం దారుణమని తెలిపారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



# 22న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

**యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నాయకులు**

**ఒంగోలు వ్యవసాయం :** బ్యాంకింగ్ సంస్కరణల ముసుగులో ప్రభుత్వం చేస్తున్న దాడి నుంచి ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకునేందుకు ఈ నెల 22వ తేదీ దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏఐబీఓసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.కె.రాజేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు, బడా పారిశ్రామిక వేత్తల బకాయిలు రూ.12లక్షల కోట్లకు చేరనున్నాయని, వీటిని ప్రభుత్వం వసూళ్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటిలో 12మంది వద్ద నాలుగు లక్షల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. వీరు పేర్లను బహిరంగంగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. బ్యాంకింగ్ వ్యవస్థను కాపాడుకునేందుకే తాము ఆందోళనలు చేస్తున్నామన్నారు. కార్పొరేట్ సంస్థలు కావాలని ఎగ్గొడుతున్న బకాయిలను బ్యాంకుల లాభాల నుంచి తొలగించి మొత్తం మీద బ్యాంకింగ్ వ్యవస్థను రూ.18, 417కోట్ల నష్టాలు ఉన్నట్లు ప్రభుత్వం చూపించడం అన్యాయమన్నారు. దీన్ని అడ్డం పెట్టుకుని ప్రైవేటీకరణ, విలీనాల కార్యక్రమాలను చేపడుతుందని విమర్శించారు. సమావేశంలో ఏఐబీఇఏ నాయకులు రామ్మోహనరావు(రాము), అన్నమనేని వేణుగోపాల్, పి.నరసింహం, యు.వేణు, రాకేష్, రాజీవ్, బి.వి.విక్రమ్షారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీజేఎం పీకే రాజేశ్వరరావు

# సోదరభావంతో యువత ముందడుగు వేయాలి

**ఒంగోలు కలెక్టరేట్ :** యువకులు సోదరభావంతో ముందడుగు వేస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చునని స్టెప్ సీఈవో డాక్టర్ రవి పేర్కొన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక హర్షిణి డిగ్రీ కాలేజీ సద్భావనా దివస్‌పై ఆదివారం సెమినార్ జరిగింది. ముందుగా జాతీయ సమైక్యత కొరకు కృషి చేస్తామని, హింసను పాల్పడబోమని యువత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జరిగిన సభలో డాక్టర్ రవి మాట్లాడుతూ చిన్నతనంలోనే ఏకత్వం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ గుండవరపు రాఘవ మాట్లాడుతూ ఎటువంటి భేదభావాలు లేకుండా ఐక్యమత్యంతో యువత ముందడుగు వేయాలని చెప్పారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన జాతీయ నాయకులను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హర్షిణీ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డి. ఆంజనేయులు మాట్లాడుతూ యువత దేశాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. అనంతరం యువత-అహింస అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు.




మాట్లాడుతున్న స్టెప్ సీఈవో రవి

## కరవది పీహెచ్‌సికి స్థలం స్వాధీనం

**ఒంగోలు రూరల్ :** కరవది పీహెచ్‌సీ నిర్మాణానికి సర్వే నెంబరు 672లో 66సెంట్లు భూమిని వైద్యఆరోగ్య అధికారులకు స్వాధీనం పరిచినట్లు మండల తహసిల్దార్ కె.వి. శశికుమార్ తెలిపారు. ఈస్థలం ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వ వైద్యశాలను నిర్మించుకోవచ్చునని ఆయన తెలిపారు.

## బ్రాహ్మణుల మద్దతు టీడీపీకే



**ఒంగోలు కల్చరల్ :** త్వరలో జరగనున్న నంద్యాల ఉప ఎన్నికలో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఓటర్ల మద్దతు తెలుగుదేశం పార్టీకే ఉంటుందని బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య, ప్రకాశం జిల్లా కో ఆర్డినేటర్ కె.కుసుమకుమారిలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి తెలిపారు. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆదివారం నంద్యాలకు వచ్చిన ముఖ్యమంత్రిను వారు కలిసి ఆ నియోజకవర్గంలో బ్రాహ్మణ ఓటర్ల మద్దతు గురించి తెలిపారు. కార్పొరేషన్ అధ్యక్షుడు, జిల్లా కో ఆర్డినేటర్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు.

# ఆహార నియమాలే ఆరోగ్య సోపానాలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

**ఒంగోలు కల్చరల్ :** సరైన, సమతుల ఆహార నియమాలే సంపూర్ణ ఆరోగ్యానికి మూల సూత్రాలని ప్రముఖ కవి, విశ్లేషకులు, కథా రచయిత హైదరాబాదుకు చెందిన జి.వి.సత్యనారాయణ(విహారి) చెప్పారు. ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన 'ఆహారం ఆరోగ్యం' పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, సాహితీవేత్త డాక్టర్ జి.వి.పూర్ణచందు రచించిన ఈ పుస్తకాన్ని నవ్యాంధ్ర రచయితల సంఘం గౌరవాధ్యక్షు రాలు తేళ్ల అరుణ ఆవిష్కరించారు. సాహితీవేత్త కాల్నానిక కవితలు, కథలకే పరిమితం కాకుండా మానవుల ఆరోగ్యాన్ని, జీవనవిధానానికి సంబం ధించిన ఇటువంటి ఉపయోగకరమైన రచనలు చేయటం హర్షించదగిన విషయమన్నారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ డాక్టర్ జి.వి.పూర్ణచందు దాదాపు వందకు పైగా రచనలు చేస్తే ప్రతి ఒక్కటీ సామాజిక స్పృహ కలిగి సమాజంలోని వివిధ వర్గాలకు ఉపయోగపడే విధంగా ఉన్నాయని కొనియాడారు. సభకు ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించగా, గౌరవాధ్యక్షులు మిడసల మల్లిఖార్జునరావు, ప్రధాన కార్యదర్శి కుర్రా ప్రసాద్‌బాబు, జిల్లా గ్రంథాలయ ఇన్‌ఛార్జి కార్యదర్శి సజ్జా మధుసూదనరావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు ప్రసంగించారు. అనంతరం ప్రముఖ కథా రచయిత విహారిని, పుస్తక రచయిత జి.వి. పూర్ణచందుని సత్కరించారు.

## బ్యాంకు మేనేజర్లు విధిగా సమావేశాలకు హాజరుకావాలి

**ఒంగోలు వ్యవసాయం :** జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా 2017-18వ సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, క్రిస్టియన్ కార్పొరేషన్ల కింద లబ్దిదారుల ఎంపిక కోసం జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, బ్యాంకుల మేనేజర్లు ఈ నెల 21వ తేదీ నుంచి జరిగే సమావేశాలకు విధిగా హాజరు కావాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ టి.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 23వ తేదీ ఎస్సీ, మైనార్టీ, 24వ తేదీ బీసీ, కాపు, 28న ఎస్టీ అభ్యర్థుల్లో ఎవరైతే ఆన్‌లైన్‌లో దరకాస్తులు చేసుకున్నారో వారితో సమావేశం ఏర్పాటు చేసి ఎంపిక చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమావేశాలు జరిగే సమయంలో బ్యాంకు మేనేజర్లు సెలవు పెట్ట డానికి కూడా వీలులేదని కలెక్టర్ తెలిపారని వివరించారు. లబ్దిదారులను ఎంపిక చేసిన 72గంటల్లో వారి జాబితాను బ్యాంకు మేనేజర్లు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. సెప్టెంబరు నెలాఖరుకు యూనిట్లు గ్రౌండింగ్ పూర్తి కావాలని పేర్కొన్నారు.

## రాజీవ్‌గాంధీకి నివాళి



రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళలర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

**ఒంగోలు క్రైం :** దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ 73వ జయంతి సందర్భంగా నగర కాం గ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళర్పించారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ సంస్మరణ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధికార ప్రతినిధి యాదాల రాజశేఖర్, నాయకులు గాడె లక్ష్మారెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకులు రామస్వామి, పాలడుగు శ్రీను, సుదర్శ రవి పాల్గొన్నారు.

## టీవీఎస్ కింగ్ ఆటో మైలేజి పోటీల్లో బహుమతి అందజేత




విజేత బాలరాజుకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

**ఒంగోలు క్రైం :** టీవీఎస్ కింగ్ ఆటో మైలేజి పోటీలు ఆదివారం స్థానిక ఎం.కె. ఆటో మోటివ్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆటో మైలేజి పోటీల్లో పాల్గొన్న విజేతలైన వారికి ఎస్సీ కార్పొరేషన్ ఈవో టి.ప్రేమకుమారి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎం.కె.ఆటోమోటివ్స్ మండి, మల్లిఖార్జునరావు, టీవీఎస్ ఏరియా మేనేజర్ యస్. రామన్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు. పోటీల్లో విజేత కె.బాలరాజుకు ఐదువేలు నగదు అందజేశారు.

## 14గ్రామ పంచాయతీల్లో సాక్షరభారత్ పరీక్షలు

**ఒంగోలు రూరల్:** మండలంలోని 14 గ్రామాలలో ఆదివారం సాక్షరభారత్ జాతీయ సార్వత్రిక విద్యాపరీక్షలు జరిగాయి. చింతాయిగారిపాలెం, గుండాయిపాలెం, దేవరంపాడు, దేవరంపాడు ఎస్సీకాలనీపంచాయతీ, బొద్దులూరివారిపాలెం, పాతపాడు, ఉలిచి, కరవది, చేజర్ల, వలేటివారిపాలెం, మండవవారిపాలెం, సర్వేరెడ్డిపాలెం, యరజర్ల, దశరాజుపల్లి, గ్రామాలలో ఈ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలను ఒడల సాక్షరభారతి సూపర్‌వైజర్ రమణారావు, మండలసాక్షరభారతి కోఆర్డినేటర్లు పర్యవేక్షించినట్లు తెలిపారు. ఈ పరీక్షలను గ్రామ సాక్షరభారతి కోఆర్డినేటర్లు నిర్వహించారు.

## 'నాకు న్యాయం చేయండి'

**బీఎస్ఎన్ఎల్ జేఈ బ్రహ్మయ్య**

**ఒంగోలు వ్యవసాయం :** తనను హత్య చేసేందుకు కత్తితో దాడిచేసిన వారిని శిక్షించి న్యాయం చేయాలని బీఎస్ఎన్ఎల్ జేఈ షేక్ బ్రహ్మయ్య ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో 2014లో రాత్రి సమయంలో ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా కొప్పోలు రోడ్డు ఇందిరమ్మ కాలనీ వద్ద తనపై కత్తితో దాడిచేశారని, తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపారు. నేటికీ ముద్దాయిలును అరెస్టు చేయలేదని వాపోయారు. ఎస్పీ చర్యలు తీసుకోవాలని కోరారు.

# సంక్షోభంలో శిల్పులు

## పెరిగిన ముడి సరుకుల ధరలు : మందగించిన వినాయక విగ్రహాల విక్రయాలు



విక్రయానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు

**కనిగిరి :** వినాయక విగ్రహాల తయారీదారులు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. విగ్రహాల ముడి పదార్థాల ధర పెరిగినా విగ్రహాల ధర మాత్రం పెరగకపోవడం... ఆశించిన స్థాయిలో విగ్రహాల విక్రయాలు జరగకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ ఏడాది కరువు పరిస్థితులు నెలకొనడంతో పంటలు పండక రైతులు ఆర్థికంగా చితికిపోయారు. దీంతో గ్రామాల్లో వినాయక విగ్రహాల కొనుగోళ్ళు మందగించాయి. అందువల్లే ఆశించిన స్థాయిలో విగ్రహాల కొనుగోళ్లు జరగడం లేదు.నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలేనికి చెందిన బృందం, రాజస్థాన్ బృందం కనిగిరిలో ఏటా వినాయక విగ్రహాల తయారీని చేపడతారు. ఈ ఏడాది నెల రోజుల కిందటే వారు కనిగిరి చేరుకొని వినాయక విగ్రహాల తయారీ చేపట్టారు. ప్లాస్టప్యారీస్ ద్వారా అచ్చులు పోసి వినాయక విగ్రహాలను సైజులు వారీగా తయారీ చేస్తారు. అక్కడ నుండే కూలీలను సైతం తీసుకొచ్చి విగ్రహా తయారీ నుంచి మండపాల వరకూ తరలింపు బాధ్యతలను చేపడతారు. ఆరు, ఎనిమిది, పది, పన్నెండు అడుగులు ఎత్తులో విగ్రహాల తయారీ ఉంటుంది. విగ్రహాల తయారీకి వినియోగించే ముడిసరుకు ప్లాస్టాప్యారీస్ ధరతోపాటు, కూలీలు ధరలు పెరగడంతో శిల్పులు నానా ఇబ్బంది పడుతున్నారు. బుచ్చిరెడ్డిపాలేనికి చెందిన బృందం 100 విగ్రహాలు తయారు చేయగా ఆదివారం సాయంత్రానికి 30 విగ్రహాలు మాత్రమే కొనుగోళ్ళు జరిగింది. రాజస్థాన్ బృందం 110 విగ్రహాలు తయారు చేయగా 40 విగ్రహాలు మాత్రమే అమ్మకాలు జరిగాయి. తయారీలో కనీసం 50 శాతం కూడా జరగకపోవడంతో వారికి అప్పులే మిగిలాయని తెలుస్తోంది. విగ్రహాల తయా



రీకి వినియోగించే ప్లాస్టిపారీస్ గత ఏడాది లారీ లోడు 21 టన్నులు రూ 1.20 లక్షలు కాగా, ఈఏడాది రూ 1.40 లక్షలుకు పెరిగింది. కొబ్బరి పీచు బస్తా గత ఏడాది రూ.13 వందలు ఉండగా, ఈ ఏడాది రూ 2 వేలకు పెరిగింది. కూలీ ధరలు, ముడి సరుకు, రంగుల ధరలు మరింతగా పెరిగాయి. 3,500 రూపాయల నుంచి రూ 20 వేలు దాకా విగ్రహాల ధరలు ఉండగా, గత ఏడాది కంటే ఒక్కొక్క విగ్రహానికి రూ1,000లు నుంచి రూ 2,000లు వరకూ ఈ ఏడాది ధర తగ్గించినా విక్రయాలు పెద్దగా జరగలేదు.

### ధర తగ్గించాం

**ఎ వెంకటేశ్వర్లు, విగ్రహాల తయారీదారు. బుచ్చిరెడ్డిపాలెం**

గత 20 ఏళ్ల నుంచి ఏటా కనిగిరి వచ్చి వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నాం. ఈ ఏడాది కరువుతో విగ్రహాల విక్రయాలు మందగించాయి. ముడి సరుకుల ధరలు, రంగులు ధరలు పెరిగినా విగ్రహాల ధరలు గత ఏడాది కంటే తగ్గించాం. అయినప్పటికీ కొనుగోళ్లు పెరగడం లేదు.

### 10 ఏళ్ల నుంచి విగ్రహాల తయారీ

**దేవారావు, విగ్రహాల తయారీదారు. రాజస్థాన్**

కరువు పరిస్థితులు నెలకొనడంతో గ్రామాల్లో రైతులు వద్ద తగినంత డబ్బు లేదు. ఈ ఏడాది వినాయక విగ్రహాల కొనుగోళ్లు మందగించాయి. అయినా తాము 10 ఏళ్ళుగా విగ్రహాల తయారీ చేస్తున్నాము. ముడి సరుకుల ధరలు పెరిగినా విగ్రహాల ధరలు పెంచడం లేదు.

## సాక్షర భారతి అభ్యాసకులకు పరీక్షలు

**తాళ్లూరు :** సాక్షరభారతి కేంద్రాల అభ్యాసకులకు ఆదివారం పరీక్షలు నిర్వహించారు. 7 వవిడత అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా మండలంలో 32 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 680 మంది హాజరు కావల్సి ఉండగా, 544 మంది హాజరయ్యారు. పరీక్షలను మండల సాక్షర భారత్ కో ఆర్డినేటర్ లూధరన్ పర్య వేక్షించారు.

## టెలీకాన్ఫెరెన్స్‌కు హాజరవ్వాలి

**వలేటివారిపాలెం:** మండలంలోని నాలుగు కాంప్లెక్స్‌లలో సోమ, మంగళ వారాల్లో జరగనున్న టెలికాన్ఫరెన్స్ కార్యక్రమానికి పాఠశాలల హెచ్ఎంలతా తప్పక హజరుకావాలని ఇన్‌ఛార్జ్ ఎంఈవో కాంతారావు తెలిపారు. సోమవారం సగం మంది ప్రధానోపాధ్యాయులు, మిగిలిన సగం మంది ప్రధానోపాధ్యాయులు మంగళవారం హాజరుకావాలన్నారు.

## సర్వేకు టీచర్లు సమాయత్తం

**కనిగిరి :** ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల అభ్యాసన ఫలితాలను అంచనా వేయడానికి ఉపాధ్యాయులను సమాయత్తం చేస్తున్నట్టు సర్వశిక్షాభియాన్ జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి ఆర్. కొండారెడ్డి తెలిపారు. సోమ,మంగళ, బుధ వారాల్లో అందుకోసం టీచర్లలందరికీ టెలీ కాన్ఫెరెన్స్ శిక్షణ ఇస్తామన్నారు. 3,5,8 తరగతులు చదువుతున్న విద్యార్థుల అభ్యాసన స్థాయిని జాతీయ విద్యా సంస్థ(ఎన్‌సీఈఆర్‌డీ) ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షా ద్వారా అంచనా వేస్తారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ నాస్ సర్వే జరుగుతుందన్నారు. తొలి ఐదు ర్యాంకుల్లో ఒకటిగా ఏపీ ఉండాలన్నదే పీడీ ఆదేశమన్నారు. టెలీ కాన్ఫెరెన్స్‌కు ఉపాధ్యాయులంతా హాజరు కావాలని కోరారు. స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమ అమలులో భాగంగా సెప్టెంబర్ ఒకటి నుంచి 15వరకు జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో స్వచ్ఛతా కార్యక్రమాలను చేపడతామని సీఎంవో తెలిపారు.

మండల స్థాయిలో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు, విద్యాకమిటీలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.వనమహోత్సవం, స్వచ్ఛత కార్యక్రమాలపై అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, పెయిటింగ్, పోటీలు నిర్వహించి విజేతలను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయికి పంపుతామన్నారు.



వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

# ముమ్మరంగా వరి నాట్లు

**ముండ్లమూరు :** మండలంలో చాలా మంది రైతులు బోర్ల కింద వరినాట్లను ముమ్మరంగా వేస్తున్నారు. పసుపుగల్లు, ముండ్లమూరు, రెడ్డినగర్, పెదఉల్లగల్లు, చింతలపూడి, సింగనపాలెం, లక్ష్మీనగర్‌లో గత వారం బీపీటీ అనే రకంతో తయారు చేసిన నారును ఉపయోగిస్తున్నారు. ఈ ఏడాది సరైన వర్షాలు లేక భూగర్భజలాలు అడుగంటిపోవడంతో వేరే పంటల వైపు మొగ్గు చూపగా, మరికొందరు బోర్ల సాయంతో వరి పండించడానికి సిద్ధమవుతున్నారు. మండలంలో ఇప్పటికే 100 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేసినట్టు అంచనా. మరో వారంరోజుల్లో 1000 హెక్టార్ల విస్తీర్ణంలో సాగుచేసేందుకు భూములను సిద్ధం చేస్తున్నారు.

### వరి నారుకు పెరిగిన డిమాండ్

గత వారం నుంచి వర్షాలు కురుస్తుండడంతో బోర్ల కింద వరి సాగుచేసేందుకు రైతులు సిద్ధం కావడంతో వరినారుకు డిమాండ్ పెరిగింది. ఎకరా విస్తీర్ణంలో పెరిగిన వరినారు రూ.2వేల నుంచి రూ.3వేలకు వరకు ధర పలుకుతుంది. కాగా, నారు కోసం మరికొందరు రైతులు గుంటూరు జిల్లా శావల్యాపురం, ఈపూరు మండలాలకు పరుగులు తీస్తున్నారు. ఏదిఏమైనా వరినారుకు డిమాండ్ పెరిగింది.

# నత్తనడకన వంతెన నిర్మాణం

## గుండ్లకమ్మ తీరంలో వాహన చోదకుల పాట్లు



వంతెన నిర్మించాల్సిన ప్రదేశం ఇదే

**దొనకొండ :** చందవరం సమీపంలోని గుండ్లకమ్మ వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇటీవల వర్షాలు కురవడంతో వరద నీరు చప్టాలపై నుంచి ఉధృతంగా ప్రవహించాయి. దీంతో వాహనాల చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పశ్చిమ ప్రాంత ప్రజల రాకపోకలను దృష్టిలో పెట్టుకొని గత కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. టెండరు పొందిన గుత్తేదారు 7 పిల్లర్లు నిర్మించారు. తరువాత గిట్టుబాటు కాదన్న నెపంతో పనులను అర్థాంతరంగా నిలుపుదల చేశారు. మంత్రి శిద్దా రాఘవరావు ప్రజల ఇబ్బందులు గుర్తించి వంతెన నిర్మాణం కోసం రూ.7కోట్లు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి 2016 ఆగస్టు 9న మళ్లీ పనులు ప్రారంభింపజేశారు. ఇది జరిగి ఏడాది అయినా పనులు ముందుకు సాగడం లేదు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే త్రిపురాంతకంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, ఒంగోలు వెళ్లేందుకు వ్యయ ప్రయాసలు తగ్గుతాయని పశ్చిమ ప్రాంతీయులు ఆశిస్తున్నారు. ఇప్పటికైనా పనులు చురుగ్గా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన ఏవీ రమణారెడ్డి

# క్రీడలతో మానసిక ఉల్లాసం

**తాళ్లూరు :** క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తోందని సరస్వతీ విద్యాసంస్థల అధినేత ఏవీ రమణారెడ్డి అన్నారు. స్థానిక సరస్వతీ హైస్కూల్‌లో సాఫ్ట్‌బాల్ శిక్షణా కేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. తాళ్లూరులోని మా విద్యా సంస్థలో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు.జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి బొడ్డు సుబ్బారావు మాట్లాడుతూ 10 రోజులపాటు జిల్లా నలుమూలల నుంచి ఎంపికైన 11 మంది ప్రతిభావంతులకు ఈ కేంద్రంలో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. తాళ్లూరు, కొండమంజులూరు, దొడ్డవరం పాఠశాలలకు చెందిన 11 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు చెప్పారు. శిక్షణ పొందిన జట్టు క్రీడాకారులు సెప్టెంబర్ ఒకటి నుంచి మూడో తేదీ వరకూ ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోషియేషన్ కోశాధికారి ఎస్ చంద్రశేఖరరావు, అర్ధవీడు గురుకుల పాఠశాల పీఈటీ వినయ్‌కుమార్, హెచ్ఎం వి శ్రీరామమూర్తి,ఇంచార్జి లక్ష్మీనారాయణ, హైస్కూల్ పీఈ టీ త్రినాథ్, వళి, వెంటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పంగులూరు రానున్న ఎమ్మెల్యే

**పంగులూరు:** అద్దంకి శాసనసభ్యుడు గొట్టిపాటి రవికుమార్ సోమవారం పంగులూరులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే రవికుమార సోమవారం ఉదయం 10.30 గంటలకు చంద్రన్న బీమా చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నారని ఎంపీపీ నార్నె పార్వతమ్మ, జడ్పీటీసీ కుక్కపల్లి పద్మ తెలిపారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని వారు వెల్లడించారు.

# మట్టి వినాయక ప్రతిమలే శ్రేయస్కరం!

- నేటి నుంచి ప్రతిమల పంపిణీ చేయనున్న భక్తుడు
- తయారు చేస్తున్న గోనుగుంట సుబ్బారావు

**అద్దంకి:** ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయక వి గ్రహాలను నిమజ్జనం చేయటం ద్వారా నీరు కలుషితం అవుతున్నాయి. కలుషిత నీటి ద్వారా విడుదల అయ్యే రసాయనాల ద్వారా వాతావరణ కలుషితమవుతుంది. అందువల్ల మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. అయితే చాలా చోట్ల ఇళ్లలో సైతం పూజలు చేసుకునేందుకు మట్టి వినాయక విగ్రహాలు అందుబాటులో లేక పలు రకాల పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం అద్దంకి పట్టణంలోని సాయిబాబా గుడి ప్రాంతంలో నివాసముండే గోనుగుంట సుబ్బారావు మాత్రం తాను తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాల ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధం అయ్యాడు. ఇప్పటికే మట్టి వినాయక ప్రతిమల తయారీకి ఉపయోగించే మట్టిని సిద్ధం చేసుకొని ప్రతిమల తయారీ ప్రారంభించారు. ఈ నెల 25వ తేదీన వినాయకచవతి పండుగ నాటికి సుమారు 5 వేల మట్టి విగ్రహాలను తయారు చేసి అందులో 3 వేల మట్టి వినాయక వి గ్రహాల ప్రతిమలను ఉచితంగా అందించనున్నారు. ఇప్పటికే తన కుటుంబ సభ్యులతో కలసి అర అడుగు, 10 అంగుళాల ఎత్తుతో వినాయక విగ్రహాల తయారీ ప్రారంభించారు. ఇప్పటికే గోమూత్రంతో జీవామృతం తయారు చేసి పలు ప్రాంతాలలో ఉన్న మొక్కలకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. పేడతో పిడకలు తయారు చేసి దేవాలయాలలో హోమాల నిర్వహణకు ఉచితంగా అందజేయటం ద్వారా సుబ్బారావు ప్రత్యేక గుర్తింపు పొందాడు., ప్రస్తుతం మట్టి వినాయక ప్రతిమలను స్వయంగా తయారు చేసి ఉచితంగా పంపిణీ చేసేందుకు ముందుకు రావటం పట్ల పలువురు అభినందిస్తున్నారు.


మట్టి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్న గోనుగుంట సుబ్బారావు

### నీటి కాలుష్యం జరగకుండా ఉండేందుకే..



ప్లాస్టర్ పారీస్ ద్వారా తయారు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయటం ద్వారా నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం కలుగుతుంది. దీంతో మట్టి విగ్రహాలను ఇళ్లలో ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహించుకునేందుకు తన వంతుగా 3 వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు సొంతంగా తయారు చేస్తున్నాను. పోలీస్‌స్టేషన్, పలు దేవాలయాల వద్ద సోమవారం నుంచి ఉచితంగా పంపిణీ చేస్తా.

**-గోనుగుంట సుబ్బారావు, అద్దంకి**

## మానస మృతికి వ్యాక్సిన్ కారణం కాదు : డీఐవో


విచారణ చేస్తున్న డీఐవో సరళాదేవి

**మేదరమెట్ల:** ఎంఆర్ వ్యాక్సిన్ ఇప్పటి వరకు ఎక్కడా వికటించలేదన డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ అధికారి సరళాదేవి తెలిపారు. ఆదివారం తమ్మవరంలో దుగ్గినేని మానస మృతికి గల కారణాలను తలిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఎంఆర్ వ్యాక్సిన్ వల్ల మానస మృతి చెందలేదని ఆమె తెలిపారు. సాధారణంగా ఎటువంటి వ్యాక్సిన్ వికటించినా అరగంట లోపే కళ్లు ఎర్రబడటం, శరీరంపై దద్దుర్లు, తీవ్ర జ్వరం రావడం జరుగుతుందన్నారు. ఇటువంటి లక్షణాలు మానస లో కన్పించలేదని, వ్యాక్సిన్‌లు వేసే వైద్య ఆరోగ్యసిబ్బంది వద్ద ఎమర్జెన్సీ కిట్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. పిల్లలకు వ్యాక్సిన్ వేసిన గంటా రెండు గంటల వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామంలో అందుబాటులో ఉండి పిల్లలను పరిశీలిస్తారని తెలిపారు. మానస తల్లిదండ్రులు చెప్పిన వివరాల ప్రకారం ఆమెకు నోటి నుంచి నురగ రావడం, శరీరం రంగుమారడం వంటి లక్షణాలు పాయిజినెస్ లక్షణాలుగా కనిపిస్తున్నాయన్నారు. ఈ విచారణలో కొరిశపాడు డాక్టర్ శిరీష, ఎంపీహెచ్ఈవో నాగేశ్వరరావు, సూపర్ వైజర్ సుందరరావు పాల్గొన్నారు.

## అన్నగారి సంతలో 25 వనిత కార్డులు విక్రయం


కార్డులను అందజేస్తున్న డీఎం రామ్‌మోహనరావు

**అద్దంకిటౌన్ :** ప్రయాణికులకు ఆర్టీసీ కల్పిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అద్దంకి డిపో మేనేజర్ రామోహనరావు కోరారు. వనిత కార్డు పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక అన్నగారి సంతలో వనిత కార్డు మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఇకపై ప్రతివారం మేదరమెట్ల, అద్దంకి మార్కెట్ యార్డులో జరిగే అన్నగారి సంతలో వనిత కార్డు కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. బస్టాండ్‌లో కూడా వాటికి సంబంధించి కౌంటర్ ఉందని తెలిపారు. సంతలో జరిగిన మేళాలో 25 మందికి వనిత కార్డులు విక్రయించినట్లు ఆయన చెప్పారు. కాగా బస్టాండ్ ఆవరణంలో మినీ థియేటర్ నిర్మాణానికి సంబంధించి ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని డీఎం తెలిపారు. బస్టాండ్ ఆవరణంలోని 15 షాపులకు సంబంధించి టెండర్లు పిలవనున్నట్లు చెప్పారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**అద్దంకి :** అద్దంకి పట్టణంలోని మూడోవార్డు పరిధిలో గల కాటికాపురుల కాలనీలో కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు కాటికాపురుల కాలనీకి చెందిన ఎన్.శ్రీను (48) మద్యంతాగి వచ్చి భార్యతో రోజూ గొడపడేవాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో శ్రీను ఇంట్లో ఉరి వేసుకు న్నాడు. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందివున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సుబ్బరాజు రాత్రి సమయంలో సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు.

## ఇళ్ల మధ్య టవర్ నిర్మాణం ఆపాలని ఆందోళన

**మేదరమెట్ల:** మేదరమెట్లలోని రాజీవ్‌నగర్ కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపాలని కాలనీవాసులు ఆందోళన చేశారు. ఆదివారం వీరాస్వామికి చెందిన స్థలంలో టవర్ నిర్మాణానికి గుంతలు తీస్తుండగా చుట్టు పక్కల మహిళలందరు టవర్ నిర్మాణాన్ని ఆపాలన్నారు. అయితే తమకు పంచాయతీ అనుమతులు ఉన్నాయని కాంట్రాక్టర్లు తెలియజేశారు. టవర్ రేడియేషన్ వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎలిజిబెత్, రజని, అఖిల్, సునీల్‌కుమార్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్కూళ్లకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

**అద్దంకిటౌన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మధ్యాహ్నం భోజన పథకానికి సంబంధించి ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లు మంజూరు చేస్తుందని, ఈ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంఈవో విజయకుమార్ ఆదివారం తెలిపారు. మండలంలోని 74 పాఠశాలల సంబంధించిన వారు గ్యాస్ సిలిండర్లు తీసుకునేందుకు సిద్దంగా ఉండాలని, మండలంలోని పాఠశాలలకు సిలిండర్లు పంపిణీకి సంబంధించి రాధాకృష్ణ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు ఎంఈవో తెలిపారు.

## బోరుబావులు తెరిచి ఉంటే చర్యలు

**పంగులూరు:** పంట పొలాలు, ఇతర ప్రాంతాల్లో బోరు బావులు తవ్వి నిరుపయోగంగా వదిలేసినా, నిర్లక్ష్యంగా తెరచి ఉంచితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి. పార్వతి ఆదివారం హెచ్చరించారు. మండలంలో బోరు బావులు తవ్విన రైతులు, వాటిని ఎక్కడైనా ఉపయోగించకుండా తెరచి ఉంచినట్లయితే మూసివేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. బోరు బావులు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

## వైభవంగా గ్రామ దేవతల కొలుపులు


అద్దంకి కొలుపుల్లో యువకుల నృత్యాలు

**అద్దంకి/అద్దంకిరూరల్:** అద్దంకి పట్టణంలోని వడ్డెర సామాజిక వర్గం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న పోలేరమ్మ కొలుపులు ఆదివారంతో ముగిశాయి. గుంజివారిపాలెం నుంచి ప్రారంభమైన కొలుపుల ఉత్సవం దేవాలయం వరకు సాగింది. అద్దంకి వంశస్తుల ఇంట్లో తయారు చేయించిన నైవేద్యాన్ని ఊరేగింపుగా దేవాలయానికి తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. శ్రావణ మాసం చివరి ఆదివారం కావటంతో అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మండలంలోని చినకొత్తపల్లి, పార్వతిపురం గ్రామాల్లో అంకమ్మ కొలుపులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీనివాసనగర్, చినకొత్తపల్లి, గోవాడ గ్రామాలకు చెందిన కొల్లా వంశస్థులు చినకొత్తపల్లి గ్రామంలో వేంచేసి వున్న తమ కుల దేవరైన అంకమ్మతల్లి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. పార్వతిపురం, కొటికలపూడి, చెరువుకొమ్ముపాలెం గ్రామాలకు చెందిన చప్పిడి వంశస్తులు పార్వతిపురం గ్రామంలో ఉన్న అంకమ్మతల్లి ఆలయంలో చివరిరోజు కొలుపులను ఘనంగా నిర్వహించారు.

**బల్లికురవ:** మండలంలోని వల్లాపల్లి, గుంటుపల్లి, కొత్తూరు, మల్లాయపాలెం, గొర్రెపాడు, అంబడిపూడి, నక్కబొక్కలపాడు, చెన్నుపల్లి, కొప్పెరపాడు గ్రామాల్లో ఉన్న బొడ్డురాళ్ల వద్ద పోలేరమ్మ దేవాలయాలకు ఆదివారం మహిళా భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపుగా తరలి వెళ్లి పూజలు చేశారు. గ్రామ దేవతలకి చద్దిని సమర్పించారు.

## వయోజనులకు త్వరలో ఉత్తీర్ణత పత్రాలు

**బల్లికురవ:** పరీక్షలకు హాజరైన వయోజనులకు త్వరలో నేషనల్ లిట్రసి మిషన్ అథార్టీవారు ఉత్తీర్ణత పత్రాలు అందజేస్తారని సాక్షరభారత్ సూపర్‌వైజర్ పోతురాజు తెలిపారు. ఆదివారం మండలంలోని 21 పంచాయితీల్లో 15వ విడత ఎన్ఐఓఎస్ పరీక్షలు జరిగాయి. 530 మంది వయోజనులు ఈ పరీక్షల్లో పాల్గొనగా సూపర్ వైజర్ పోతురాజు వల్లాపల్లి, బల్లికురవ కేంద్రాలను తనిఖీ చేశారు. మండల కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**మేదరమెట్ల:** మండలంలోని 15 పంచాయతీల్లో సాక్షర భారత్ ఆధ్వర్యంలో ఎన్ఐఓఎస్ పరీక్ష జరిగింది. ఆదివారం జరిగిన ఈ పరీక్షలో స్త్రీలు 303 మంది, పురుషులు 54 మంది హాజరైనట్లు మండల సమన్వయకర్త ఎస్తేరురాణి తెలిపారు.

**సంతమాగులూరు:** మండలంలో 20 గ్రామాల్లో వయోజనలకు జరిగిన పరీక్షలకు 381 మంది హాజరైనట్లు సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం నిర్వహించిన పరీక్షలకు విశేషస్పందన వచ్చిందని ఆయన చెప్పారు.

## వినాయక మండపాలకు విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలి

**అద్దంకి టౌన్:** వినాయక చవితి ఉత్సవాలు ఈ నెల 25న తేదీ నుంచి జరుగుతున్నందున విద్యుత్ అలంకరణతో భాగంగా విద్యుత్ కనెక్షన్ పొందేవారు సంబంధిత మండలాల్లోని అసిస్టెంట్ ఇంజనీర్‌లను సంప్రదించి ముందస్తు అనుమతులు తీసుకోవాని అద్దంకి డీఈ సత్యన్నారాయణ ఆదివారం ప్రకటనలో కోరారు. అనాధికారికంగా విద్యుత్‌కు వినియోగించుకునేల చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 250 వాట్స్ వరకు రూ.750, 250 నుంచి 500 వాట్స్ వరకు రూ.1310, 500 నుంచి 1000 వాట్స్‌కు రూ.2400 చెల్లించాలన్నారు. ఈక్రమంలో అద్దంకి 9440812226, అద్దంకి రూరల్ 9490618827, మేదరమెట్ల 9440812227, పంగులూరు 9440812228, మార్టూరు 9440812231, సంతమాగులూరు 9440812229, బల్లికురవ 9490617496, యద్దనపూడి 9490617497 నెంబర్లను సంప్రదించి అనుమతులు తీసుకోవాలన్నారు.

## విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలి

**బల్లికురవ:** వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు పర్మిషన్ తీసుకోకుంటే చర్యలు తప్పవని బల్లికురవ ఎస్ఐ అనూక్ ఆదివారం హెచ్చరించారు. గణేష్ వి గ్రహాల నిర్వాహక కమిటీలు పోలీసు శాఖను సంప్రదించి అనుమతులు పొందాలని, చట్టాన్ని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

### సినిమా గైడ్

**అద్దంకి**

కళామందిర్ - జయ జానికీ నాయక
శ్రీరామ - ఆనందో బ్రహ్మ
వీఎన్ఎస్- నేనేరాజు-నేనేమంత్రి
మినీవిఎన్ఎస్ - లై

**మేదరమెట్ల**

నారాయణ చిత్రాలయ - జయ జానికీ నాయక

ఆంధ్రజ్యోతి

9

చీరాల

ప్రకాశం ● సోమవారం 21 ఆగస్టు 2017

। చీరాల । వేటపాలెం ।


## వైభవంగా పందిళ్లమ్మతల్లికి పొంగళ్లు

**వేటపాలెం:** పందిళ్లపల్లి గ్రామ శివారులో వేంచేసియున్న పందిళ్లమ్మతల్లి తిరునాళ్ల ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్థులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ పెద్దలు పర్యవేక్షించారు.



పందిళ్లమ్మ తల్లి మూలవిరాట్

# పంచాయతీ కార్యదర్శులు కావలెను!

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- 9 పంచాయతీలకు ముగ్గురే
- కుంటుపడుతున్న అభివృద్ధి
- ఇబ్బందిపడుతున్న పలు గ్రామాల ప్రజలు

**వేటపాలెం:** వేటపాలెం మండలాన్ని పంచాయతీ కార్యదర్శుల కొరత వేధిస్తోంది. మండలంలో మొత్తం 9 పంచాయతీలు ఉండగా, 15కు పైగా ఆవాస గ్రామాలు ఉన్నాయి. నిబంధనల మేరకు ఒక్కో పంచాయతీకి ఒక్కో కార్యదర్శి వంతున విధులు నిర్వహించాలి. కానీ 9 మంది కార్యదర్శులకుగానూ కేవలం ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతోంది. ఒక్కో కార్యదర్శి రెండు, మూడు పంచాయతీలను చూడాల్సి వస్తోంది. ఈ కారణంగా వారుపనిభారంతో సతమతమవుతున్నారు. ఏ ఒక్క పంచాయతీకి పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారు. ఫలితంగా మరుగుదొడ్ల నిర్మాణం, స్మార్ట్ వార్డులు, పంచాయతీల లక్ష్యాలు నెరవేరడం లేదు.

### ప్రజలకు తప్పని పరుగులు

పంచాయతీ కార్యదర్శుల కొరత కారణంగా ఏ పంచాయతీకి ఎవరు కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇన్‌చార్జి కార్యదర్శి ఏ సమయంలో ఏ గ్రామంలో అందుబాటులో ఉంటారో తెలియక ప్రజలు పరుగులు తీయాల్సివస్తోంది. చిన్నచిన్న పనులకు కార్యదర్శుల కోసం గ్రామాలు పట్టుకుని తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీల్లో మూడు నెలలకు ఒకసారి సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. మరోవైపు పన్నుల వసూళ్లు చేసేవారు లేక అభివృద్ధి నిలిచిపోతుంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన పట్టించుకోవడం లేదు.



వేటపాలెం మండల పరిషత్ కార్యాలయం

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



వేటపాలెం మండలంలో కార్యదర్శుల కొరత తీవ్రంగా ఉంది. 9 పంచాయతీలకు ముగ్గురు మాత్రమే ఉన్నారు. పనిభారంతో పంచాయతీల్లోని సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. కార్యదర్శుల కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- ఈవోఆర్‌డీ సుబ్రహ్మణ్యం

### పడకేసిన పారిశుధ్యం

పంచాయతీ కార్యదర్శుల కొరత కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. వీధులుచెత్తదిబ్బలు, మురుగు నిల్వలతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఫలితంగా దోమల విజృంభించి ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఇన్‌చార్జి కార్యదర్శులు పనిభారంతో సీజనల్ వ్యాధులు ప్రబలిన సమయంలో తప్ప పారిశుధ్యాన్ని పట్టించుకోవడం లేదు. తాగునీటి సమస్యను పట్టించుకునే దిక్కు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు.

## 30వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యతిరేక ప్రచారం

**చీరాలటౌన్ :** కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు మూడున్నరేళ్లుగా సాగిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై ఈ నెల 30వ తేదీ వరకు వ్యతిరేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు. ఆదివారం చీరాలలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీపీఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వసంతరావు, ఎన్.బాబూరావు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ సమారాధన

**చీరాలటౌన్ :** శ్రీకృష్ణజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం సంతబజారులోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఘనంగా సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా మండూరు ఇనకాల గోత్రం వారు దేవస్థాన ప్రాంగణంలో గుడి ఉత్సవం, ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మండూరు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, మల్లికార్జునరావు, జనార్ధన, రంగబాబు పాల్గొన్నారు.

## మహిళా కానిస్టేబుల్‌కు పలువురి నివాళి

**చీరాలటౌన్ :** అనారోగ్యంతో మృతి చెందిన టూటౌన్ పోలీస్‌స్టేషన్ మహిళాకానిస్టేబుల్ సుంకర శైలజకు జిల్లా పోలీసుఅధికారుల సంఘం ప్రతినిధులు నివాళులర్పించారు. శనివారం ఆమె మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆదివారం చీరాలలోని ఆమె స్వగృహంలో భౌతికకాయాన్ని సందర్శించి జిల్లా పోలీసుఅధికారుల సంఘం ప్రతినిధులు నర్రా వెంకటరెడ్డి, రామనాథం, మాధవి, టూటౌన్ ఎస్ఐ వెంకటకృష్ణయ్య, అక్రమ్, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### చీరాలలో సినిమాలు

| థియేటర్ | సినిమా |
|---|---|
| మోహన్ | జయ జానకి నాయకా |
| సంగం | లై |
| సాయిప్యాలెస్ | ఆనందో బ్రహ్మ |
| శాంతి | నేనే రాజు-నేనే మంత్రి |

## 26న దళిత పారిశ్రామికుల అవగాహన సదస్సు

**చీరాలటౌన్ :** దళితులకు వ్యాపార పారిశ్రామిక రంగంలో ఉన్న అవకాశాలపై అవగాహన కలిగించే ఉద్దేశ్యంతో ఈ నెల 26న చీరాల అంబేద్కర్‌భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు దళిత ఇండియన్ చాంబర్‌ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(డిక్కీ)సంస్థ ఏపీ ఉపాధ్యక్షుడు, జిల్లా కో ఆర్డినేటర్ భక్తవత్సలం తెలిపారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహంలో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర స్థాయిల్లో దళితుల పారిశ్రామిక పురోగతికై స్టాండప్‌ఇండియా, ముద్రా, పీఎంఈజీఆర్, కేవీఐసీ, కవీఐబీ, డీఈడీఎస్‌సీ వంటి పథకాలెన్నో ఉన్నాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో దళితులకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్న తరుణంలో పారిశ్రామిక అవకాశాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందడానికి డిక్కీ కృషి చేస్తోందన్నారు. చీరాలతోపాటు చుట్టుపక్కల మండలాల ఎస్సీ, ఎస్టీ ప్రజలు సదస్సులో పాల్గొని అవగాహన పెంచుకోవాలని కోరారు. సమావేశంలో ఇంజనీర్ సీ.హెచ్.సుధీర్‌బాబు, పులిపాటి రాజు, మిక్కిలి పుల్లయ్య, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలేరమ్మకు పొంగళ్లు

**చీరాలరూరల్ :** చీరాల మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పోలేరమ్మకు ఆదివారం పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి జలబిందెలతో అభిషేకం నిర్వహించిన అనంతరం పొంగళ్ళు సమర్పించి తమ కోర్కెలను తీర్చాలని ప్రార్థించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



జలబిందెలతో నాగలోకి వస్తున్న మహిళలు

## దుండగులను శిక్షించాలి

**చీరాలటౌన్:** అనంతపురం జిల్లా హిందూపురంలో వాసవీభజనమందిరాన్ని ధ్వంసం చేసిన దుండగులకు కఠిన శిక్ష విధించాలని చీరాల శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు గుంటూరు మాధవరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి మందిరాన్ని నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలన్నారు. లేనిపక్షంలో ఆర్యవైశ్యులు పోరాటం చేస్తారని హెచ్చరించారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

**చీరాల :** దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు అన్నారు. రాజీవ్‌గాంధీ 73వ జయంతి సందర్భంగా ఆదివారం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముక్కోణపు పార్కు సెంటర్లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు దేశాభివృద్ధికి కాంగ్రెస్ నాయకులు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గుంటి ఆదినారాయణ, షేక్ అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## 20మంది గైర్హాజరు

**చీరాలరూరల్ :** సాక్షరభారత్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని జరిగిన ప్రాథమిక అక్షరాస్యత పరీక్షకు 20మంది గైర్హాజరైనట్లు మండల కో ఆర్డినేటర్ జి.జగన్మోహన్ తెలిపారు. మండలస్థాయిలో మొత్తం 209మందికి గాను 189మంది మాత్రమే హాజరైనట్లు చెప్పారు.

## వయోజనులకు ప్రాథమిక అక్షరాస్యతా పరీక్షలు

**వేటపాలెం:** సాక్షర భారత్ కార్యక్రమాల్లో భాగంగా వయోజనులకు 7వ దశ ప్రాథమిక అక్షరాస్యతా పరీక్షలు ఆదివారం నిర్వహించారు. గతంలో జరిపిన నోస్ పరీక్షల్లో సీ గ్రేడ్ వచ్చిన వయోజనులకు ప్రస్తుతం ప్రాథమిక అక్షరాస్యతా పరీక్షలు నిర్వహించినట్లు మండల కోఆర్డినేటర్ ఏ.ప్రాయిం తెలిపారు. ఈ పరీక్షలకు పందిళ్లపల్లి, రామన్నపేట, పుల్లరిపాలెం గ్రామాల పరిధిలోని 29 మంది వయోజనులు హాజరైయ్యారని తెలిపారు. పరీక్షలను గ్రామ కోఆర్డినేటర్ కె.సింగమ్మ, కె.రాజ్యం పర్యవేక్షించారు.

## గౌడ విద్యార్థులు చదువుల్లో రాణించాలి

**వేటపాలెం:** గౌడ విద్యార్థులు చదువుల్లో రాణించాలని సర్పంచ్ కర్పూరపు రమాదేవి సూచించారు. ఆదివారం నాయినపల్లి బదిరాజుతోటలోగల గౌడ కమ్యూనిటీహాల్లో మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల సంఘం అధ్యక్షుడు కాయల సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని రంగాల్లో గౌడలు రాణించాలన్నారు. సంఘం తరపున పేద విద్యార్థులకు చదువుల్లో ప్రోత్సాహాన్ని అందిస్తామని, ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. సమావేశంలో చీరాల బీసీ సంఘం నాయకులు యనమల యానాదిరావు, సంఘం నాయకులు డీవీఆర్. నాగరాజు, కర్పూరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలను అందిస్తున్న గౌడ సంఘ నాయకులు



మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

## ఉచితంగా మందుల పంపిణీ

**చీరాల:** చీరాలలోని సత్యసాయి సేవట్రస్ట్ ట్రస్టు కార్యాలయం వద్ద ఆదివారం థైరాయిడ్ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ నెల 13వ తేదీ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత థైరాయిడ్ వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వ్యాధిగ్రస్తులకు నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన రిపోర్టులను ఆదివారం పంపిణీ చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసి వాటిని ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేశారు. థైరాయిడ్ వ్యాధిగ్రస్తులకు ప్రతి నెల రూ.140విలువైన మందులు అవసరం అవుతాయని అయితే వాటిని బస్టాండ్ వద్ద ఉన్న సురేష్‌మెడికల్స్‌లో రూ.60లకే ఇచ్చేందుకు షాపు ప్రతినిధులు అంగీకరించారన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు వూటుకూరి సుబ్బారావు(వూసూ), శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.